ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక




వెల
4 అణాలు

సంపుటము 41 సంచిక 41

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

జూన్ 29 1949


వార్తా చిత్రాలు




న్యూఢిల్లీలోని అఖిలభారత గాయకమండలి సమర్పించిన సన్మానపత్రమునకు గవర్నర్ జనరల్ రాజాజీ సమాధాన మిచ్చుచున్నారు. చిత్రములో రాజ్యాంగపరిషదధ్యక్షులు డా. రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు అనంతశయనం అయ్యంగారు మొదలైనవారున్నారు.




నీగ్రో నాయకుడు ఫ్రాంక్‌లోని అమెరికన్ థియేటర్ వింగ్ ద్వితీ వార్షిక బహుమానము నందుకొనిన సందర్భములో, గాయకబృందన కధ్యక్షురాలైన మార్గరెట్ బె ఆయనను అభినందించుచున్న దృ




18-న తేదీన ఢిల్లీ రాజకీయ సభను పరిషత్తు అధ్యక్షులు రాజేంద్రప్రసాదుగారు ప్రారంభించిరి.



భారతసైనిక రాయబారవర్గము అమెరికాను సందర్శించినప్పటి చిత్రము. మములో నున్నవారు ఎడమవైపున భారతప్రభుత్వ రక్షణశాఖా కార్య హెచ్. యం. పటేల్. మధ్యను, భారత ప్రధాన సైనికోద్యోగి మే జనరల్ కల్వంత్ సింగ్. ఇరువురికి అమెరికా సైనికశాఖా సహాయ కార్య ఫూర్ హీస్ వాషింగ్టన్‌లో నేషనల్, విమానాశ్రయంవద్ద స్వాగతము చున్నాడు. అమెరికాలో సైనిక కేంద్రాలను సందర్శిస్తూ పటేల్, కల్వ సింగ్‌గారలు 10 రోజులు పర్యటించారు.



స్థానిక స్వపరిపాలనా మంత్రి గా. కల్లూరి చంద్రమౌళిగారికి రాజమండ్రి పురపాలకసంఘంవారి సన్మానం.



...నపల్లి ... కపై కూర్చున్నవారు ...
బనగానపల్లి కాంగ్రెస్ అధ్యక్షులు ... ముక్తిమార్గ
మద్యపాననిషేధ మంత్రియుండ దని గరిత్రయే తెలుపుచున్నది.
సంఘాధ్యక్షు

ఆంధ్రపత్రిక

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


ఒరులేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మపథములకెల్లన్.

—మహాభారతము.

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర ఆషాఢ శుద్ధ చవితి బుధవారము





ఆంధ్రపత్రిక

1949-వ సం॥ జూన్ నెల 29-వ తేది బుధవారము

రాష్ట్రసంపాదన: నాయకుల విధి

"ప్రస్తుతం చెన్నరాష్ట్ర శాసనసభలో నెలకొన్న తగాదాలకు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమే తగిన ప్రతిక్రియ. నాయకత్రయ నివేదికను ఆమోదించి, రాష్ట్రమును తెచ్చుకొను బాధ్యత ప్రజలపైన, వారి ప్రతినిధులైన రాష్ట్ర కాంగ్రెసు నాయకులపైన ఆధారపడి యున్నది." అని కాంగ్రెసు కార్యదర్శి శ్రీ కళా వెంకటరావుగారు సోమవారము ఢిల్లీనుండి రాగానే పత్రికా ప్రతినిధులతో జరిపిన గోష్ఠిలో తెలియజెప్పిరి. "వెంటనే రాష్ట్రం రావలె నంటే చెన్నపట్నంతో రాష్ట్రం రావలె నని పట్టు పట్టరాదు. నాయకత్రయ నివేదికను పూర్తిగా శిరసావహించవలెనుగాని కొంత అంగీకరించి కొంత తిరస్కరించరాదు." అనికూడ విస్పష్టముగ తెలిపిరి.

చెన్నరాష్ట్ర శాసనసభ తగాదాలకు ఆంధ్రరాష్ట్ర నిర్మాణమే తగిన ప్రతిక్రియ అను శ్రీ వెంకటరావుగారి వ్యాఖ్య ఎంతవరకు హేతుబద్ధమైనది, సత్యబద్ధమైనది అను విషయమున అభిప్రాయభేదములకు ఆస్కారము లేకపోలేదు. వారి వ్యాఖ్య పూర్తిగ కాకపోయినప్పటికి కొంతవరకు నిజమని వచ్చును. అయితే ఆంధ్ర రాష్ట్రము వచ్చినప్పటికీ శాసన సభ్యులందలి తగాదాలు అంతరింప వని, రాష్ట్రము ఏర్పడిన పిమ్మట ఈ తగాదాలు మరింత తీవ్రము కావచ్చు ననీ కొందరి అభిప్రాయము. నేడు చెన్నరాష్ట్ర శాసనసభ కాంగ్రెసు పక్షమునందలి వైమనస్యములకు మూలము కేవలము భాషాప్రాంతీయమైన విభేదము లే నని చెప్పుటకు వీలు లేదు. కొందరికి భాషారాష్ట్ర సమస్య స్వప్రయోజనమునకు అనువుగ నున్నది. శ్రీ వెంకటరావుగారుకూడ కాంగ్రెసు శాసనసభ కాంగ్రెసుపక్ష తగాదాలు ఆంధ్ర రాష్ట్ర నిర్మాణముతో చాలవరకు తొలిపోగల దని మాత్రమే చెప్పిరి. చాలవరకు పోవు నన్నదికూడ సందేహమే. పైన చెప్పినట్లు చెన్నరాష్ట్ర శాసనసభా కాంగ్రెసుపక్ష తగాదాలకు ఆంధ్రులకు రాష్ట్రము లేకపోవుటయే హేతువని బల్లగుద్ది చెప్పుటకు వీలు లేదు. రాష్ట్రపతి పట్టాభి సీతారామయ్యగారు ఈమధ్య చెప్పినట్లు కాంగ్రెసు సంఘములకు కాంగ్రెసు మంత్రి వర్గములకు సరిఅయిన సఖ్యత లేకపోవుటే ఈ తగాదాలకు మూలకారణము. సొంత రాష్ట్ర మున్నప్పటికీ పశ్చిమ బెంగాలులో, కాంగ్రెసు కమిటీయందుగాని, శాసన సభ్యులందుగాని తగాదాలు, వర్గములు తప్పలేదు. తగాదాలను వివరించుటలోనూ, సమర్థించుటలోనూ, ఎవరికి వీలైనది వారు తెలియజేయుట కద్దు. కాంగ్రెసు సంఘములకు, కాంగ్రెసు మంత్రివర్గములకు సఖ్యత లేకపోవుటకు (ముఖ్యముగ ఆంధ్ర రాష్ట్రములో) గల కారణములు అందరికి తెలిసినవే. వాటిని వివరించుట అనవసరము.

"శాసనసభ పక్షంతోగాని, కాంగ్రెసు సంఘంతోగాని మేము భిన్నాభిప్రాయులము కావచ్చుగాక. ఈ సమస్యపై (రాష్ట్రము విషయమై) మేము ఎన్నటికీ విడిపోము" అని శ్రీ కళా వెంకటరావుగా రనిరి. కాని, నాయకత్రయకమిటీ నివేదికపై ఇంతవరకు ఆంధ్రనాయకులు చేసిన విమర్శలను చూచిన రాష్ట్ర సంపాదనా సమస్య కూడ, కాంగ్రెసు సంఘములందు, శాసనసభా పక్షమునందు గల విభేదములను తిరుగటిరాళ్లమధ్య పడి నలుగుచున్న దను భావము తొలిపుచ్చుటకు సాధ్య మగుటలేదు. నాయకత్రయ కమిటీ నివేదిక ననుసరించి రాష్ట్రమును అంగీకరించుటా కాదా, అనగా చెన్నపట్నం లేని ఆంధ్రరాష్ట్ర నిర్మాణాన్ని అంగీకరించుటా కాదా అన్నదే ఇపుడు సమస్య. అలా అంగీకరించి తక్షణం రాష్ట్రమును సంపాదించే భారమును శ్రీ కళా వెంకటరావుగారు ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెసుపైన పెట్టిరి. వారు కనుక పట్టుకుంటే రాష్ట్రం వెంటనే రాగల దని వా రనుచున్నారు. గతమాసం ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ నాయకత్రయ నివేదికను గురించి తీర్మానం చేసినపుడు కొన్ని షరతులను పెట్టినది. చెన్నపట్నం విషయమును సరిహద్దు సంఘము నిర్ణయించవలె ననినది. ఇది నాయకత్రయకమిటీ సిఫారసుకు ప్రతికూలము. రాష్ట్ర కాంగ్రెసు కమిటీ నాయకత్రయ కమిటీ నివేదికను అంగీకరించినచో తక్షణములో వెంటనే రాష్ట్రము వచ్చే అవకాశము న్నా రాష్ట్రకాంగ్రెస్ తన వైఖరిని మార్చుకొనునా అన్నది ఆలోచనీయము. చెన్నపట్నం ఆంధ్ర రాష్ట్రములో చేరుటనుగూర్చి ఆంధ్రులు తమ హక్కులు వదలుకొనవలె నని నాయకత్రయ నివేదిక తెలిపినది గాని అసలు పూర్తిగా దాని భవిష్యత్తునుగురించి నిర్ణయ మొసగలేదు. బొంబాయిని ప్రత్యేక రాష్ట్రముగా చేయుమని సూచించినట్లు చెన్నపట్నమునుకూడ ప్రత్యేక రాష్ట్రముగ చేయుమని సూచించవచ్చును. రాష్ట్రనిర్మాణమును, చెన్నపట్నముతో ముడిపెట్టుట ఎంతవరకు దూరదృష్టితో కూడుకొన్నదో ఆలోచించవలెను. చెన్నపట్నమును ప్రత్యేక రాష్ట్రముగ నిర్మించవలె నని సూచించక, సరిహద్దు నిర్ణాయక సంఘమునకు వదలివేయ దలచుట అంత చాతుర్యముతో కూడిన వ్యవహారము కాదు. ఈ విషయమున మా అనుమానములను వెలిబుచ్చి యుంటిమి. శ్రీ కళా వెంకటరావుగారు చెప్పినట్లు సరిహద్దుసంఘ నిర్ణయం నాయకత్రయ నిర్ణయమునకు భిన్నంగా ఉండు నని అనుకొనుటకు వీలు లేదు. చెన్నపట్నం పూర్తిగా ఆంధ్ర రాష్ట్రంలో చేర్చగలము అను విశ్వాస మున్నచో రాష్ట్రనిర్మాణమును వాయిదా వేయించుట సమర్థనీయ మనవచ్చును. కాని అవిధమైన విశ్వాసమును ఇంతవరకు ఎవరూ తెలియజేయలేదు. సమష్టిపట్టణముగ నుండవలెనా, లేక ప్రత్యేక రాష్ట్రముగా నుండవలెనా అన్నదే నిర్ణయము కావలసినపుడు ఆవిషయమును గురించి ఇపుడు బాధపడ నవసరము లేదు. కాబట్టి నూతన రాజ్యాంగము అమలులోకి వచ్చులోపల ఆంధ్ర రాష్ట్రము నిర్మాణము అగునట్లు చూచుట నాయకులందరి విధి. నూతన రాజ్యాంగము అమలులోకి వచ్చిన పిమ్మట దాని ననుసరించి రాష్ట్రము నేర్పడుటకు అనేక అభ్యంతరములు రాగలవు. రాష్ట్రము అనునది వచ్చిన తరువాత చెన్నపట్నం విషయముగాని, ఇతర తగాదా సరిహద్దుల విషయముగాని మన వాదనలకు ఎక్కువ విలువ యుండును. తరువాతనైననూ చెన్నపట్నం భవిష్యత్తు పట్టణప్రజల అభిప్రాయముతో నిమిత్తము లేకుండ నిర్ణయింపబడు నని అనుకొనుటకు వీలు లేదు. కాబట్టి సత్వర ఆంధ్రరాష్ట్ర నిర్మాణమునకు కాంగ్రెసు నాయకు లందరు పూనుకొందురుగాక యని ఆశించుచున్నాము.

పాకిస్థాన్, అఫ్ఘనిస్థానముల మధ్య విరోధము


పాకిస్థాన్, అఫ్ఘనిస్థానముల మధ్య విరోధము నానాటికి తీవ్రతర మగుచున్నది. ఆ దేశముల సరిహద్దున ఒకచోట ఇటీవల పాకిస్థాన్ విమానములు జనసమూహముపై మరతుపాకులు కాల్చినవి. దీనికి అఫ్ఘనిస్థానము ఆక్షేపణ తెలిపినది. కాని తమ సరిహద్దులోనే విమాన చర్య తీసుకున్నందువల్ల అఫ్ఘనిస్థానము జోక్యము చేసికొనరాదని పాకిస్థాన్ ప్రభుత్వము సమాధానమిచ్చినది.

అనేక శతాబ్దములనుండి అఫ్ఘన్ దేశీయులతో అతిసన్నిహితులై యుండి సంబంధబాంధవ్యములు నిలుపుకున్న పఠానులు, పాకిస్థాన్ ఆధిపత్యము నెదిరించుటకుగాను అఫ్ఘన్ ప్రభుత్వము యొక్క తోడ్పాటును అర్థించుటలోగాని, ఆ ప్రభుత్వము పఠానిస్థాన స్థాపనోద్యమమునకు తోడ్పడుటలోగాని ఆశ్చర్యము లేదు.

అఫ్ఘనిస్థాన ప్రభుత్వమైననూ ఆ కొండప్రాంతమును తమ దేశములో కలుపుకొన గోరుట లేదు. కేవలము పఠానులే నివసించుచున్న ప్రాంతమును ప్రత్యేక పఠానిస్థానముగా పాకిస్థానమునుంచి విభజించి స్వాతంత్ర్యము నివ్వవలె నని మాత్రమే కోరుచున్నది. కాశ్మీరములో దోపిడికి పంపి పఠానుల యసంతృప్తిని పోగొట్ట యత్నించిన పాకిస్థాన్ యత్నము విఫలమైనది.

అయితే ఈ పరిస్థితిని గమనించిన అగ్రరాజ్యములు తమ రాజకీయ చతురంగమునకు మరొక రంగము దొరికినదని భావించినవి. ద్వితీయ ప్రపంచ సంగ్రామకాలమునుంచియూ అఫ్ఘనిస్థాన ప్రభుత్వముతో అమెరికా మైత్రిని చేకూర్చుకొన్నది. అఫ్ఘనిస్థానము రష్యాకు దక్షిణసరిహద్దున నున్నది. అమెరికా ఇప్పట స్థావరము లేర్పరచుకొన్నచో అమెరికాతో యుద్ధము సంభవించు పక్షమున రష్యాకు అఫ్ఘనిస్థానము ప్రక్కలో బల్లెము కాగలదు. పై తగవులలో రెండవ పక్షమున చేరినచో రష్యా అమెరికావల్లని ప్రమాదమునుండి సంరక్షించుకొన వీ లగును. భారతదేశము అంతర్జాతీయ వ్యవహారములందు రష్యాపక్షము వహించగలదను ఆశ ఇప్పుడు నశించినది. కావుననే ఇంతకుముందు పాకిస్థానమును ఎన్నిరీతుల దూషించినను, ఉభయులూ వానిని మరచినారు. రష్యా పాకిస్థానులు మైత్రిని సాధించుటకు కృషి చేయుచున్నవి.

ఈ రీతిగా రష్యా అమెరికాల వ్యూహములలో పాకిస్థాన్ అఫ్ఘనిస్థానములు చిక్కుకొనుచున్నవి. ఒకసారి వ్యూహము చిక్కుకొన్నచో ఉభయ దేశముల ప్రజలకునూ క్షోభ తప్పదు గాని ...



నేటి ప్రపంచం

నాకబలి

అనివార్యమైన కారణాలవల్ల 'నాకబలి' సీరియల్ నవలను ఈ వారం ప్రచురించలేదు. వచ్చే వారంనుంచి తిరిగి ప్రచురించగలము.

[సం.]

ఆర్థికదుస్థితిలో ఉన్న దేశాలకి అమెరికా సహాయం

★ ఇండొనీషియాలో సమాధానం

ఆసియా, ఆఫ్రికా; దక్షిణమెరికాలలో ఆర్థిక దుస్థితిలో ఉన్న దేశాల సముద్ధరణ నిమిత్తం అమెరికా ఆర్థిక సహాయం చెయ్య తలపెట్టి, అధ్యక్షుడు ట్రూమన్ 45 మిలియన్ల డాలర్లు ప్రభుత్వ వ్యయంలో ప్రత్యేకించాలని అమెరికా కాంగ్రెస్‌లో శుక్రవారంనాడు ఒక ప్రతిపాదన తెచ్చాడు. ట్రూమన్ అధ్యక్షుడుగా ఎన్నుకోబడిన అనంతరం, అధ్యక్షపదవి స్వీకరిస్తూ విదేశాంగవ్యవహారాలపట్ల తన విధానాన్ని నాలుగు ముఖ్యాంశాలుగా వివరించాడు. అందులో నాలుగోది ఆర్థిక దుస్థితిలో ఉన్న దేశాలకి ఆర్థిక సహాయం, నిపుణుల సహాయం. మార్షల్ ప్రణాళికవంటిదే మరొకటి వస్తోందని కొందరూ, నెహ్రూ ప్రణాళిక ఉద్భవిస్తోందని కొందరూ అనుకున్నారు. ట్రూమన్ ప్రకటన చేసింది మొదలు ఇప్పటివరకూ అడపా తడపా వెనుకబడిన దేశాలకి ట్రూమన్ సహాయం గురించి వార్తలు వస్తూనే ఉన్నాయి. ఇప్పటికి అదేమిటో బయటపడింది. తీరా చూస్తే 45 మిలియన్ల డాలర్లు ఇదీ దూరప్రాచ్య దేశాలు, సమీపప్రాచ్యదేశాలు (దూరమూ, సమీపమూ యూరప్‌నుంచి కొలత) ఆఫ్రికాఖండంలోని దేశాలు, మధ్య అమెరికాదేశాలు (మెక్సికో వగైరా), దక్షిణమెరికాఖండంలోని దేశాలు అన్నిటికీ కలిపి ఈ లెక్కని చూస్తే మన దేశానికి ఏ కొద్ది లక్షలు గూపాయలో వస్తుంది. ఆ కాస్తకీ "ట్రూమన్ వెనకబడిన దేశాలని ముందుకి సాయం పడుతున్నా"డని ప్రచారం దేనికా అనిపిస్తుంది ఆ కాస్త ఉత్తం ఏ రాష్ట్రప్రభుత్వమో కల్లాలమీదా నాగితాలమీదా పన్ను విధించి వసూలుచెయ్య [illegible]?

యూరప్‌లో పరిశ్రమాభివృద్ధికీ ఆహారోత్పత్తి వృద్ధికీ తోడ్పడి ప్రభుత్వాలను బలపరచడానికి శతకోట్లు ఖర్చుపెట్టిన అమెరికా తదితర ఖండాలపట్ల పక్షపాతం చూపుతున్నదని ఎవరైనా సందేహిస్తే అది వారి తప్పుకాదు. యూరప్‌కి ప్రత్యక్షసహాయం చేసింది. ఆసియా ఆఫ్రికామొదలైన దేశాలకు ఇవ్వవలసినప్పుడు తన దేశంలోని పెట్టుబడిదారుల్ని ప్రోత్సహిస్తోంది. యూరప్‌లో ప్రజల జీవనప్రమాణం, కార్మికుల వేతనాలు చాలా హెచ్చుకావడంవల్ల అక్కడ అమెరికన్లు పెట్టుబడి పెట్టినా తీవ్రమైన పోటీని ఎదుర్కొంటున్నారు. లాభప్రమాణాలు అంత అధికంగా ఉండవు. ఆసియా ఆఫ్రికాలలో ప్రజల జీవనప్రమాణం చాలా తక్కువ, కార్మికుల వేతనాలు తక్కువ, అందువల్ల ఇక్కడ పెట్టుబడి పెట్టితే లాభప్రమాణాలు అత్యధికంగా లభిస్తాయి. ఆ దేశాల్లో ప్రజలకు ఆధునికజీవనసౌకర్యాలు లభిస్తాయి. దానితో వారి జీవనప్రమాణాల్ని వృద్ధిచేసినవారవుతారు.

అయితే ఈ దేశాలలో పరిస్థితులు కొంత కల్లోలంగా ఉన్నందువల్ల పెట్టుబడి ధనానికీ అసలుకీ మోసం రావచ్చుననే భయంతోనూ, ఆ దేశాల్లో తీరా పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తి ప్రారంభించినదాకే ఊరుకుని, ఆ తరువాత ప్రభుత్వాలు ఆపరిశ్రమల్ని తమపరంచేసుకుని నష్టపరిహారమైనా ఇవ్వకుండా తరిమివేస్తాయేమోననీ అమెరికాలో పెట్టుబడిదారు పరిశ్రమల యజమానులు భయపడుతున్నారు. కల్లోలపరిస్థితి ఆర్థికదుస్థితి వల్ల సంభవించినది కాబట్టి, ఆ ఆర్థిక దుస్థితిని తొలగించడానికే ఆ దేశాల్లో అమెరికన్లు పెట్టుబడి పెట్టితే కల్లోలం దానంతటదే అణిగిపోతుందని కొందరంటున్నారు. దీనికి పశ్చిమయూరప్‌ని ఉదాహరణగా చూపుతున్నారు. అయితే ఈ పెట్టుబడిదార్లు ఆర్థికదుస్థితిని తొలగించడానికి పెట్టుబడి పెడతారా లేక కల్లోలానికి భయపడి వెనుదీస్తారా?

వెనుదీస్తే మరొక ప్రమాదం ఉంది. యూరప్‌లో మార్షల్ ప్రణాళికమూలంగా అమెరికాలో వాణిజ్యమాంద్యం, ఆర్థికమాంద్యం నిరుద్యోగం ఇంతవరకూ నివారించబడ్డాయి. పశ్చిమ యూరప్‌లో ఆర్థికపునర్నిర్మాణం చకచకా సాగుతోంది కాబట్టి ఇప్పుడు తిరిగి అమెరికాలో ఆర్థికమాంద్యం ఇవాళ కాకపోతే రేపు, రేపు కాకపోతే ఎల్లుండైనా సంభవించి తీరుతుందని చాలామంది భయపడుతున్నారు. ఇప్పుడు దీన్ని నివారించాలంటే అమెరికన్ల పెట్టుబడి, నిపుణులైన ఉద్యోగులు కొత్త నివాసాలు వెతుక్కోక తప్పదు ఆ క్షణం వచ్చే సూచనలు కనిపించేవరకూ ట్రూమన్ ఊరుకుని, ఇంక అది రాబోతున్నదని గ్రహించి కాబోలు ఈ వెనుకబడిన దేశాల కార్యక్రమానికి ఉపక్రమిస్తున్నాడు. దీనివల్ల ఆసియాదేశాల కేమీ పెద్ద నష్టంలేదు అమెరికా రాజకీయపు పరపులు విధిస్తుందనే భయం ఇప్పుడంతగా ఉండనవసరం లేదు. పెట్టుబడి పెట్టక వారెక్కడికీ పోరు. అయితే అమెరికన్ వాణిజ్య పారిశ్రామికవ్యవహారాలని, భారతీయవ్యాపారాలవలెనే ప్రభుత్వం ఒక కంట కనిపెట్టడం అవసరం.

అమెరికన్ పెట్టుబడిదారులు కోరే హామీలు ముఖ్యంగా రెండు: వారి ఆస్తిపాస్తుల్ని, యంత్రపరికరాల్ని ఆ దేశాల ప్రభుత్వాలు నష్టపరిహారమైనా సక్రమంగా ఇవ్వకుండా స్వాధీనపరుచుకోరాదని ఒకహామీ; వారు ఆదేశాల్లో ఆర్జించుకునే లాభాల్ని డాలర్లరూపంలో స్వదేశానికి తీసుకుపోయే సౌకర్యం ఇవ్వాలని ఒకటి. ఏ విషయంలోనూ ఆయాదేశాలలోని పారిశ్రామికులకే సౌకర్యాలు ఇస్తారో అన్నీ పరదేశాలనుంచి వచ్చే పెట్టుబడిదారులకుకూడా అవే సౌకర్యాల నివ్వగలరని భారత ప్రధాని పండిట్ నెహ్రూ ఇదివరలో హామీ ఇచ్చారు.

పోతే పైన కోరిన రెండు హామీలనుగురించీ అధ్యక్షుడు ట్రూమన్ హామీ ఇంతవరకూ ఇవ్వగలమని చెప్పడం కష్టమన్నాడు. కాలక్రమేణా అనుభవాన్ని బట్టి హామీలు ఫలానిరీతిగా ఉండాలని నిర్ణయించుకోవచ్చును. ఎగుమతి దిగుమతి మార్కాల బాంకు ఈ విషయాలనుగురించీ భీమా ఇవ్వవచ్చును. అయితే అది క్రమేణా జేలవలసిందేనని ట్రూమన్ చెప్పాడు. అమెరికన్ ప్రభుత్వం మాత్రం పెట్టుబడిదారుల్ని ప్రోత్సహిస్తుంది.

ఆర్థిక దుస్థితిలో ఉన్న దేశాలకి ద్రవ్యం పెట్టుబడి చాలమటుకు పెట్టుబడిదారులవద్దనుంచే రావాలనీ, వారికి ప్రభుత్వం తగు సౌకర్యాలిస్తుందనీ ట్రూమన్ చెప్పాడు. ప్రభుత్వం చేసే ధనసహాయపరంగా 45 మిలియన్లు ప్రత్యేకించమని కాంగ్రెస్‌ని కోరాడు.

చీనా :

చీనాలో కమ్యూనిస్టుసైన్యాలు దేశాన్ని అతి సులువుగా ఆక్రమించుకోగలుగుతున్నారు. షాంఘై అనంతరం ఇంతవరకూ యుద్ధం చెయ్యనక్కరలేకుండా కొన్ని వందలమైళ్లదూరం సైన్యాలు ప్రయాణంచేసి ఆక్రమించుకుంటున్నాయి. వీరికంటె వేగంగా కొమింటాంగ్ సైన్యాలు నిష్క్రమిస్తున్నాయి. చాంగ్ కై షేక్ స్వరాష్ట్రమైన ఫ్యూకియన్ రాష్ట్ర ప్రధాన నగరాన్ని (ఫూచో నగరం) జాతీయ సైన్యాలు విడిచి వెళ్లిపోతాయి. 130 మైళ్లలో ఉన్న ఆమోయ్ వద్దకు నిష్క్రమిస్తున్నాయి. అక్కడనుంచి అవి ఫార్మోజాద్వీపం వెళ్లిపోయినా ఆశ్చర్యం లేదు. చాంగ్ కై షేక్ తన బలాల్ని ఫార్మోజా ద్వీపంలో కేంద్రీకరించుకుంటున్నాడు. ఫార్మోజాద్వీపాన్ని విడిచిపెట్టదలచలేదని కమ్యూనిస్టు నాయకుడు మావ్ సీటుంగ్ ఇటీవల ఒక ప్రకటన చేశాడు. బహుశా ఫార్మోజాదీవిని బలపర్చుకుని కమ్యూనిస్టులనుండి రక్షించుకుని, అగ్రరాజ్యాల పుణ్యమా అని తృతీయ ప్రపంచ సంగ్రామం సంభవిస్తే, ద్వితీయ ప్రపంచ సంగ్రామానంతరం వలెనే తన శత్రువుల్ని అమెరికన్లు తన దేశాలనుంచి వెళ్లగొట్ట గలుగుతారనీ, అప్పుడు తిరిగీ జాతీయప్రభుత్వాన్ని స్థాపించుకోడానికి వీలవుతుందనీ, అంతవరకూ ఫార్మోజాద్వీపంలో నిరీక్షించవచ్చుననీ చాంగ్ కై షేక్ తలుస్తున్నట్లు కొన్ని అమెరికన్ పత్రికలు ప్రచారం చేస్తున్నాయి.

దక్షిణరాష్ట్రాల్లో గోరిల్లా దళాలన్నీ ఏకమై మూడు కమ్యూనిస్టు సైనిక దళాలుగా ఏర్పడినాయనీ, ఆ సైన్యం కాంటన్ నగరంపైకి దాడిచేయబోతోందని కమ్యూనిస్టు రేడియో తెలుపుతోంది. కాంటన్ నగరంనుంచి జాతీయ ప్రభుత్వం ఏనాడో తరలి ఫార్మోజా వెళ్లిపోయింది. ఫార్మోజా ద్వీపానికి చీనాజాతీయులిచ్చినపేరు టాయ్‌వాన్. కాంటన్ నగరంకూడా ఇతర నైకేష్టేషన్లవలెనే ఏ కాస్త యుద్ధం లేకుండా కమ్యూనిస్టుల చేతుల్లో పడవచ్చును.

అయితే దక్షిణచీనాలో వరదలు విపరీతంగా వచ్చి పంటలన్నీ నాశనమైనాయనీ అక్కడ పరిస్థితి బాగుండనందువల్ల కమ్యూనిస్టులు కొంచెం వేగం తగ్గించుకున్నారనీ హాంకాంగ్‌నుంచి బ్రిటిష్ వార్తలు వస్తున్నాయి.

బ్రిటిష్‌నౌకపై బాంబులు:

కమ్యూనిస్టుచీనా రేవులకి ఓడలు పోరాదనీ, కమ్యూనిస్టులతో రవానాది వ్యాపారాలు నిలిపివెయ్యాలనీ కొమింటాంగ్ అధికారులు హెచ్చరించారు. బ్రిటిష్‌నౌక "ఆంచిసెస్"ను షాంఘై సమీపంలో వాంగ్‌పూనదీ ముఖంవరకూ వెళ్ళనిచ్చి, అక్కడ ఆ నౌకని కొమింటాంగ్ విమానాలు రెండుసార్లు బాంబుచేశాయి. వారి హెచ్చరికను మన్నించకుండా కమ్యూనిస్టులకు సరుకులు రవానా చేస్తున్నందువల్ల బాంబుచెయ్యవలసి వచ్చిందని కొమింటాంగ్ అధికారులు చెప్పారు. కాని వాంగ్‌పూనదీముఖంలో ఆ ఓడని ముంచివెయ్యగలిగితే షాంఘై ఓడరేవు పనికిరాకుండా పోతుందని జాతీయాధికారుల ఆశయం. కాని ఆ నౌక మునిగిపోలేదు. తీవ్రంగా దెబ్బలు తిని ఒడ్డున నిలిచింది.

హాంకాంగ్ :

బ్రిటిష్‌వారు మాత్రం కమ్యూనిస్టులతో వ్యాపారం మానదలచలేదు సరిగదా, ఎలాగైనా వారి మైత్రిని సాధిద్దామని శతవిధాల కృషిచేస్తున్నారు. వారు హాంకాంగ్‌పైకి రాకుండా కాపాడుకోవాలి. హాంకాంగ్‌కి ప్రమాదం వాటిల్లిందంటే ఇంక మలయాలో కమ్యూనిస్టుల్ని బ్రిటిష్‌పాలకులు అణచలేరు. అందువల్ల నయానా భయానాకూడా హాంకాంగ్‌ని రక్షించుకోడానికి బ్రిటిష్‌వారు సిద్ధపడుతున్నారు. కమ్యూనిస్టులతో వర్తకం చేస్తున్నారు. రహస్యంగా కమ్యూనిస్టులకి ఆయుధ సామగ్రి సప్లై అవుతోంటే చూస్తూ ఊరుకున్నారు. హాంకాంగ్‌లో కమ్యూనిస్టు గోరిల్లాల సావరాలదరికి పోవడంలేదు. అసలు కమ్యూనిస్టులకి అవసరసామగ్రి హాంకాంగ్ ద్వారానే సప్లై అవుతోందని కొమింటాంగ్ అధికారుల నిందిస్తున్నారు కూడా.

చివరికి హాంకాంగ్‌ని కమ్యూనిస్టులు విడిచిపెట్టి ఇతర ప్రాంతాన్ని ఆక్రమించుకొంటారనీ, బ్రిటిష్ సైన్యాలతో వారు తలపడకపోవచ్చుననీ అనేకమంది భావిస్తున్నారు.

బ్రిటన్ చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించవలసిన సమయంలో ఈ విషయమై సంప్రదింపులు జరపవచ్చునని వారూహకానే అవకాశం ఉందట. హాంకాంగ్‌ని వారికి విడిచిపెట్టడంవల్ల బ్రిటిష్‌వ్యాపారస్తులతో వర్తకం నడుపుకోవచ్చును. కమ్యూనిస్టుల అవసరమైన భారీయంత్ర పరికరాలు వగైరా తెచ్చుకునే అవకాశంఉంది. బ్రిటిష్‌వారికి హాంకాంగ్ విడిచిపెట్టితే వారు కమ్యూనిస్టులు ఏది కోరితే అది ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు కనిపిస్తుంది. అందువల్ల కమ్యూనిస్టులకి అదే లాభకరం.

పీపింగ్ ప్రభుత్వం

కమ్యూనిస్టులు ఇంతవరకూ ఆక్రమించుకున్న ప్రాంతంలో తమ అధికారాన్ని స్థిరపరుచుకోడానికి కృషిచేస్తున్నారు. ఇతర 'ప్రజాస్వామ్య' పక్షాల ప్రతినిధులతో సహా 21 మంది గల కౌన్సిల్‌ను స్థాపించడానికి నిర్ణయించినట్లు కమ్యూనిస్టు నాయకుడు మావ్ సీటుంగ్ ప్రకటించాడు. దేశంలో ద్రోహులు విప్లవ వ్యతిరేకులూ అయిన కొమింటాంగ్ అధికారుల్ని నిర్మూలించడమే ప్రధానకర్తవ్యమని చెప్పాడు.

ఈ మిశ్రప్రభుత్వం ద్వారా దేశంలో ప్రజాహితపరిపాలన స్థాపించదలచుకున్నట్లు చెప్పాడు. అన్యదేశాలు కమ్యూనిస్టు ప్రభుత్వంతో రాజకీయ వాణిజ్య సంబంధాలు పెట్టుకోవచ్చునని సూచించాడు. అయితే ఇంతవరకూ ఏ దేశమూ బహిరంగంగా సంప్రదింపులకు రాలేదు.

అమెరికన్ నౌకలు యుద్ధ ప్రాంతాలనుంచి

(21-వ పేజీ చూడుము)

విషయ సూచిక

ముఖచిత్రం:
'సకలగృహవర్తి, మార్జాలచక్రవర్తి:'
ఛాయాచిత్రకారుడు:
డి. అన్నాజీరావు, చెన్నపట్నం.

సాహిత్యవ్యాసంగం:

మన కథలు

శ్రీ బసిరెడ్డి ఈశ్వరరెడ్డి

ఆధునికయుగంలో మన సాహిత్యమంతా కథామయమై పోతున్నది. సాహిత్యములో గద్యమునకు ముఖ్యముగా కథలు ప్రాధాన్యముగా గల గద్యమునకు ప్రముఖస్థానము వచ్చినది. నేడు మన తెనగులో కూడా మన పత్రికలను మినహాయిస్తే, తక్కిన పత్రికలన్నియూ ఎక్కువభాగం కథామయమైనవే కదా? పుస్తక సాహిత్యంలోనా, పత్రికా సాహిత్యంలోనా ఎక్కువ భాగం కథలే. పూర్వం ఏ సామాన్య విషయమునైనా పద్యంబద్ధం చేసేవారు ఉత్తర పశ్చాత్తాపాలకు కూడా కవిత్వాన్నే ఉపయోగించే వారు. నేడు అదేవిధముగా సాహిత్యానికి సంబంధించిన విషయాలనూ, ఐతిహాసికగాథ్యలనుకూడా కథారూపకంగా లక్షకంగా వ్రాస్తున్నారు. ఎంత క్షుద్ర విషయమైనా కథారూపాన్ని చెందగనే సాహిత్యంగా మారిపోగలదా భావమే నేటి కథాప్రాధాన్యములకు కారణమై యుండవచ్చును. ఒక్కమాటతో చెప్పవలెనంటే, ప్రాచీన కవిత్వభాగాన్ని కథాసాహిత్యం పూర్తిగా ఆక్రమించుకొన్నదనుటలో సందేహం లేదు.

మన ఆధునిక కథలకు ఆంగ్లసాహిత్యప్రేరణ ఎక్కువగా నున్నది. మన కథాసాహిత్యం ఆంగ్ల కథా సాహిత్యాన్ని ననుకరిస్తున్నది. ఐతే నేటి కథలకు ప్రాచీన కథలనంచీ ఎలాటి ప్రేరణా దొరకలేదని భావం కాదు. ఉపనిషత్తుల కాలంనుంచీ మనదేశంలో కథాసాహిత్యమున్నది. బౌద్ధజాతక కథల ప్రాధాన్యము నేడుకాదనగలడు. మన ప్రాచీనకథల్లో ఎక్కువ భాగం ఉపదేశాత్మకమైనవే. నీతినీ సామాన్యధర్మాన్నీ కథలద్వారా బోధించడం మన కథాసాహిత్యముదానిలో ముఖ్యవిశేషం. కాదంబరి దశకుమారచరితం మొదలగునవి ప్రాచీనకథాసాహిత్యములో పేరెన్నిక గన్నవి. ఒక విషయాన్ని సమర్థించుటకు అర్థాంతరన్యాసముగా కథల నుపయోగించేవారు. భారతంలో యీ విషయమునకు అనేక ఉదాహరణము లున్నవి. శాంతిపర్వంలో భీష్మాచార్యులు తన కథనమును కథలద్వారా సమర్థిస్తాడు. పంచతంత్రం మొదలగు గ్రంథములలో కథల ద్వారానే అనేకగంభీరసమస్యలకు సమాధానము లివ్వబడినవి. గంభీరవిషయములను కథలద్వారానే పరిష్కరించడం, నైతికవిషయాలను కథల ద్వారానే ప్రచారం చేయడం మన ప్రాచీన సాహిత్యములోని విశిష్టత యనవచ్చును. అట్లు చేయడంవల్ల సామాన్యనీతిని, గంభీరవిషయములనూ సామాన్యప్రజల్లో ప్రచారం చేయుటకు సాధ్యమైనది. బౌద్ధమతం సర్వ సామాన్యాకర్షక మగుటకు జాతక కథలూ ప్రాకృతం మొదలగునవియే కారణముగదా! నేటి కథలకూ నాటి కథలకూ సాదృశ్యంతక్కువైనా ఆనాడు కూడా కథలకు ప్రాధాన్యముండె నని చెప్పక తప్పదు.

అధునిక కథలకు పూర్వం మనకు కన్పించునవి విక్రమార్క, శుకసప్తతి, కాశీమజిలీ మొదలగు కథలుమాత్రమే. యీ విక్రమార్క కథలు ఆంగ్లసాహిత్య సభ్యతలు వ్యాపించకమును పు యావద్భారతదేశములోనా ప్రచారములో నుండె ననునది నిర్వివాదమైన విషయం. యిప్పటికీ పల్లెలలో యీ కథల కున్న ప్రాధాన్యమును తీసి వేయజాలము. యీ కథలన్నియూ ముఖ్యముగా మధ్యకాలంనాటి రాచకుమారులకు సంబంధించినవి. నేటి కథల్లోని వాస్తవికత, వాటిలో లేకున్ననూ అవి జనరంజకము లని మాత్రం చెప్పవచ్చు. ఆ కథల తీరు ఘటనాక్రమం ప్రతికథలోనా ఒకేవిధంగా ఉండును. ప్రతికథా రాజు పరదానీ (ప్రధాని) పేదరాశి పెద్దమ్మా లేనిది సాగదు. యిప్పటికీ రాయల సీమలోని పల్లెల్లో యీకథల ప్రాధాన్యమేమీ తగ్గలేదు. యీకథల్లో స్వాభావికత్వం తక్కువైనా ప్రజా సామాన్యాన్ని నేటికంటే ఎక్కువ ఆకర్షించిన వనుటలో సందేహం లేదు. ముఖ్యంగా ఆ కథల్లోని కల్పనావైచిత్ర్యం శ్లాఘనీయము.

యిక ఆధునిక కథాసాహిత్యమును ప్రతి అక్షరాస్యుడూ స్వల్పంగానైనా చవిచూచియుంటాడు. నేటికథల్లో దైవికచమత్కృతినీ ప్రాచీన రాజ పరాక్రమాలనూ వర్ణించు విషయములు లేవు. నేటికథాసాహిత్యం రాచకుల చిత్రణారకే పరిమితమై పోలేదు. స్వాభావికత్వమే నేటికథలకు గీటురాయి. స్వాభావిక కథాచిత్రణ ద్వారానే నేడు టాల్‌స్టాయ్ మొదలగువారు ప్రపంచఖ్యాతిని పొందినారు. అయితే వారి స్వాభావికత్వమునకూ కండ్లనీళ్ళనూ కార్చిచ్చునూ -కలినీ విపవాన్నీ అవసరమైనప్పుడూ అనవసరమైనప్పుడూ కూడా కథల్లో కావ్యాల్లో యిరికించే కమ్యూనిస్టుల అసహ్య స్వాభావికత్వమునకూ ఎంతో భేదమున్నది అనుభవాలకూ కల్పనలకూ ఆదర్శాలకూ చక్కని సామంజస్య మొనగూర్చి రచించబడిన ఉజ్జ్వలమైన కథానికలు మన తెలుగులో అనేక మన్నవి. వాటితోబాటే ఆఫీసు గొడవలను వర్ణించే స్వాభావిక (అస్వాభావిక) కథలు కూడా కొల్లలుగా ఉన్నవి. మంచీచెడూ అన్నిచోట్లా అవశ్యంభావియే కదా...

యిక మన తెలుగులోని కథల వివిధత్వమును పరిశీలిద్దాం. కథను క్రమానుసారంగా ఆదినుంచీ అంత్యంవరకూ నడపడం మన పూర్వ కథాకారుల కలవాటు. యిప్పుడు అంత్యంలోని ఘటననో మధ్యంలోని ఘటననో ప్రథమంలో చూపించి తరువాత కథను వివరించడం అనేకుల కలవాటు. యింకా కొందరు కథలను డైరీరూపకంగా వ్రాస్తారు. మరి కొందరు జాబుల రూపంగా కథను వ్రాస్తారు. కొందరు పౌరాణిక కథలను ఆధునిక భావాలతో చిత్రిస్తున్నారు. చాలా మంది నిత్యజీవితంలోని ఘటనలనే ప్లాటుగా తీసకొని కథలు వ్రాస్తున్నారు. ఇట్లా వ్రాయడంలో తప్పేమీ లేదు. కానీ, ఆ నిత్యజీవితంలోని సాధారణ ఘటనలనే సాధారణమానవమానసిక ప్రవృత్తి యొక్క ఆధారంతో సకలమానవానుభూతుల సహాయంతో వర్ణించినప్పుడే ఆకర్షకమగును. ఉదా... దయ, ప్రేమ, మాతృత్వం, శృంగారాభిరుచి మొదలగునవి స్త్రీకి సహజమైన మౌళిక ప్రవృత్తులు గదా? యీ ప్రవృత్తుల యొక్క సుందరానుభవంతో రచించబడిన సుకుమార కల్పనాత్మకమైన కథ రాణించును కానీ పూతననో మొగుడిని చంపిన మహామారినో బీభత్సంగా శిల్పించి కథలవ రచిసే అవి జనసామాన్యాన్ని ఆకర్షించవు. సకల స్త్రీ సహజమైన ప్రవృత్తులు లేకపోవడమే అనాకర్షణకు కారణ మగును.

ప్రస్తుతం తెలుగులోని కథలను భావప్రధానము లనియూ, ఘటనా ప్రాధాన్యము లనియూ రెండు విధములుగా విభజించవచ్చును. విషయము లేకుండా భావమే ప్రధానముగా రచించబడిన కథలు మన భాషలో చాలా తక్కువ. సామాన్యపాఠకులెక్కువగా ఘటనలే ప్రాముఖ్యముగా కల్గిన నాటకములనే ఎక్కువగా చదువుదురు. భావుకత్వప్రధానమైన క్లిష్టమనోవైజ్ఞానిక కథాసాహిత్యమును చదువుటకు ఓర్పు కావలెను. ఘటనలే ప్రధానమైన నాటకమునకు ఎంతో కల్పనాశక్తి యుండవలెను. స్పష్టంగా ఏమీ చెప్పకున్ననూ కథద్వారానే ఒక గంభీరమైన సత్యాన్నీ, నీతినీ బోధించు శక్తి కథాకారునకు మాత్రమే కలదు. వ్యాసరచయితకూ కవికీ యీ సౌకర్యం లేదు.

అనేకులు పెద్ద రచనలు నవల లనియూ చిన్న రచన లన్నియూ కథలనియూ భావిస్తుంటారు. ఇట్లా భావించడం పొరపాటు. నవలకూ కథకూ మౌలికంగానే ఎంతో భేదమున్నది. ఒక మానవుని సంపూర్ణ జీవిత ఘటనను గురించిగానీ అనేక విషయాలతోగానీ వ్రాయబడిన రచనను నవల యనవచ్చును. నవలలోవలె కాక కథలో ఒక చిన్న ఘటనగానీ, ఒక చిన్న విషయముకానీ వివరించుటకే అవకాశమున్నది కథల్లో అనవసర విస్తారానికి అవకాశమే లేదు. నవలలో ప్రధానమైన కథయే గాక ప్రాసంగిక కథకూడా వర్ణింపబడును. నవలలో అనావశ్యకమైన పాత్రలు కానీ, ప్రాసంగికమైన కథ కానీ వర్ణింపబడుటకవకాశము లేదు. కథలో ప్రతి పాత్రయూ ప్రధానముగా ప్రతి వాక్యమూ సాభిప్రాయమగా నుండును. ఆరంభమునుంచీ అంత్యము వరకూ అనవసర విస్తరణ లేకుండా ప్రవాహపూర్ణముగా సాగిపోవునదియే కథ.

మన తెలుగులోనే కాకుండా భారతదేశములోని ఆధునికకథాసాహిత్యమంతయూ నవీనమైనదే. నేటి ఆధునిక కథలు వ్యాపించుటకు పూర్వం ఉత్తర హిందుస్థానమంతటా విక్రమార్కుని కథలూ కథాసరిత్సాగరము వంటి కథలూ ప్రచారంలో ఉండెవి. యిప్పటికీ ఉత్తరయిండియాలోని పల్లెల్లో మనం విక్రమార్కుని ఉదారత్వ, దేశప్రేమలకు సంబంధించిన కథలను వినవచ్చును. ఆ కాలంలోని విక్రమార్కుని నిష్పక్షపాతమునకు సంబంధించిన కథలను చెప్పుకొంటూ ఆ న్యాయమిక్కడ నే డెక్కడి దని వృద్ధులు నిట్టూర్పు విడుస్తుంటారు. ఆంగ్లసాహిత్యము ద్వారా బెంగాలీ కథలకు ప్రేరణ లభిస్తే బెంగాలీ కథల ద్వారా ఉత్తరదేశంలోని అనేకభాషల కథాసాహిత్యమునకు ప్రేరణ లభించిన దనవచ్చును. రవీంద్రనాథ్ శరత్‌బాబు ప్రేమచంద్ యశ్‌పాల్ ఉత్తర యిండియాలోని కథా సాహిత్యమునకు ఏహారధుల నవచ్చును. రవీంద్రనాథుని కథలలో అతని కావ్యములలోవలె భావుకత్వం ప్రచురంగా ఉండును. శరచ్చంద్రుడిద్దరూ తమ కథల్లో భావుకత్వమునకు గాక సమస్యాచిత్రణకె ఎక్కువ ప్రాధాన్య మిస్తారు. యిటే ప్రతి కథాకారునకూ తన శైలిలో విశిష్టతా ఆదర్శంలో నిగూఢతా ఉండితీరును. హిందీ ప్రాంతముల్లోని కథాకారులలో జైనేంద్ర కుమార్ సుదర్శన్, అజ్ఞేయ మొదలగువారు ముఖ్యులు. అట్లే బెంగాలీకథాకారుల్లో రవీంద్రుడు, శరత్ బాబు మొదలగువారు ముఖ్యులు. స్థూలంగా చూస్తే బెంగాలీ కథల్లో ఉన్న భావనా ప్రాబల్యం తెలుగు హిందీ కథల్లో లేదు బెంగాలీ కథల కున్న పేరు ప్రఖ్యాతులు మన కథలకు లేకున్నా మన కథలు వాటికన్నా ఏమీ తీసిపోవు.

కథలు ప్రజాబాహుళ్యానికి సంబంధించినవి. సాహిత్యంలో ప్రజాసామాన్యమున కందుబాటులో ఉండునవి కథలూ నాటకములూ మాత్రమే. ఆదిమకాలంనుంచీ నేటివరకూ ప్రతి మానవుడూ కథారసాస్వాదన చేస్తూనే వున్నాడు. ప్రతిభాషలోనా కథాసాహిత్యమున్నది. ఒకవేళ ఏ భాషలోనైనా కథాసాహిత్యం లేకున్ననూ ఆమానవులలో కథాసాహిత్యం లేకుండా ఉండజాలదు. ఎందు కనగా ప్రతి మానవునకూ ఆబాల్యం నుంచీ కథాభిరుచి కలిగి తీరును. చిన్నప్పుడే భావాలూ వికసించకనమునుపే పసిబిడ్డలు ముసలమ్మలను కథలు చెప్పమని వేధిస్తారు పిల్లవాడు ముసలమ్మలు చెప్పే కాకిపిల్లి కథలలో తన్మయులై పోతారు. అట్లల్లతే మానసికవికాసాన్ని పొందకాలదీ గంభీరమై మననయోగ్యమైన కథాసాహిత్యమును వాంఛిస్తారు. తన మానసికవికాసానికి తగిన కథలనే ప్రతియొక్కడూ కోరును. మానసిక వికాసమును చెందనివానిని బాలానందం లోని కథలంతగా ఆకర్షించవు. అట్లే వయస్సులో వృద్ధిజెందినా మానసికంగా సాహిత్యకంగా బాలుడైన వానిని బాలానందంలోని కథలే ఎక్కువగా ఆకర్షించును. ప్రతి మానవుడూ తన వికాసమునకు సరియైన కథాసాహిత్యమునే కోరుననునది నిర్వివాదమైన విషయం. వికాసాన్ని బట్టి కథా సాహిత్యాభిరుచులలో మార్పు చెందిననూ ప్రతి యొక్కనికీ ఆజన్మాంతం కథా సాహిత్యంలోని అభిరుచి మాత్రం తగ్గదు.

మన తెలుగులో సాహిత్యంలోని అనేక భాగములు అసంపూర్ణముగా ఉన్నా కథా సాహిత్యం భాగం మాత్రం సమృద్ధముగా నున్నదని చెప్పవచ్చును. బెంగాలీ హిందీ సాహిత్యములలో వలె మనకథాసాహిత్యం కూడా చిన్నిచిన్ని లోపము లెన్ని యున్ననూ సమృద్ధముగా నున్నదని చెప్పవచ్చును కానీ మన తెలుగులోని అత్యుజ్జ్వలమైన కథలుకూడా హిందీ బెంగాలీలలోకి క్రూరంపబడక పోవటం ఆ భాషలలోని ప్రచ్చెత్తి తెనిగించబడకపోవడమునకు ఆంధ్రులలోని ఆధానకరణాత్మక ప్రవృత్తి, విశాలదృష్టి లే



స్వీడెన్‌రాజు జన్మదిన సందర్భమున ఢిల్లీలో ఆ దేశపు రాయబారి గత గురువారం విందు చేసెను. ఆ సందర్భమున తీసిన ఈ చిత్రములో భారత సేనాధిపతి కరియప్ప, ఇందిరా గాంధి, స్వీడిష్ రాయబారి ఉన్నారు.

మధ్యప్రాచ్యము: 3

పాలస్తీనా, ట్రాన్స్‌జోర్డన్లలో బ్రిటిష్ దుస్తంత్రాలు



శ్రీమతి కమలాదేవి ఛట్టోపాధ్యాయ

జోర్డన్‌కు తూర్పుగా ఉన్న ప్రాంతాన్ని విభజించి స్థాపించిన పాలస్తీనా, ట్రాన్స్‌జోర్డన్లు నేడు మధ్యప్రాచ్యరాజకీయాలకి కేంద్రాలైనాయి. సునిశితదూరదృష్టిగల బ్రిటిష్ సామ్రాజ్యవాదులు తమ విల్లుకి ఈ రెండు అంబుల్నీ సంధించారు. పాలస్తీనాని తమ స్థావరంగా చేసుకోవాలని బ్రిటిష్‌వారు ఒక శతాబ్దం క్రిందటనే యత్నాలు ఆరంభించారు. అప్పుడు అక్కడి యూదుల్ని సంరక్షించాలని బ్రిటిష్ ప్రభుత్వం తమ కౌన్సల్‌ని ఆదేశించింది. తరువాత బ్రిటిష్‌వారి తంత్రం బోధపడింది. యూరప్‌లో కొన్ని ప్రభుత్వాల విచక్షణా పాలనలో కష్టాలు పడుతున్న యూరోపియన్ యూదుల్ని పాలస్తీనాకు బ్రిటిష్‌వారాహ్వానించారు. పాలస్తీనా నివాసం ఏర్పరచుకో వచ్చునని వారికి చెప్పారు. బ్రిటిష్ సంస్థల ఆధ్వర్యంకింద వలసకార్యక్రమాలు తయారు చేయబడినయ్. ఈ కార్యక్రమాలకు ఆర్థిక సహాయం ఇచ్చే నిమిత్తం స్థాపించబడిన కార్పొరేషన్లు బ్రిటిష్‌వారి ఆధ్వర్యం క్రిందనే నిర్వహించబడినాయి. బ్రిటిష్‌వారు సృష్టించే వలస బ్రిటిష్‌వారిపట్ల నిత్యం కృతజ్ఞత కలిగిఉంటుందని వారి విశ్వాసం.

సామ్రాజ్యవాదం ఎప్పుడూ అంతఃకలహాల ఆధారంపైనే పెంపొందుతుంది. సామ్రాజ్యవాదుల రాజకీయతంత్రాలలో అనేకదశాబ్దాలు యూదు ఉద్యమం రెండు విధాలైన కర్తవ్యాలు నెరవేర్చింది. ఒకవైపున ఇది పాలస్తీనా ప్రజల న్యాయోచిత స్వాతంత్ర్యోద్యమానికి అవరోధాలు కల్పించింది. మరొకవైపున సామ్రాజ్యవాదం తన వికృతరూపాన్ని దీనికి చాటు చేసుకొని, అరబ్ ప్రజల క్రోధాన్ని తమపైనుండి దీనిపైకి మరల్చగలిగింది. ప్రమాదభరిత సన్నివేశాల్లు సంభవించాయి. మచ్చుకి ఒక విషయం చెప్తే చాలు. బ్రిటిష్‌వారు కొన్ని తమ సంస్థకి అగ్రస్థానంలో యూదుల్ని నియమించారు. దీనివల్ల అరబ్ ప్రజలు బ్రిటిష్‌వారికి వ్యతిరేకంగా వర్తిస్తే యూదులపై శత్రుత్వం వహించినట్లు కనపడేది. ధనానికి సంబంధించిన వ్యవహారాల్లో సామ్రాజ్యవాదులకి రెండు నాలుకలున్నాయి. దీనివల్ల అరబ్-యూదు వైషమ్యాలలో తమ ద్రవ్యానికి అపాయం కలుగకుండా కాపాడుకోగలిగారు. పరోక్షంగా ఆ వైషమ్యాలను మరింత రెచ్చగొట్టినట్లయ్యేది. ఆంగ్లో-అమెరికన్ టొబాకో కంపెనీ రెండు వ్యాపార సంస్థల్ని స్థాపించింది. ఒకటి టెల్‌అవీవ్‌లో స్థాపించి యూదుల్నే ఉద్యోగాలలో నియమించి యూదులకి పొగాకు, సరుకులు సప్లై చేసేది. మరొకటి అరబ్ ప్రాంతంలో స్థాపించి అరబ్బులనే కార్మికులుగా నియమించి, అది అరబ్బీ జాతీయ వాణిజ్యసంస్థ అని ప్రచారం చేసి అరబ్బులకు అమ్మేది. రెండోది, వాస్తవానికి యూదులకి భూము లమ్మకూడదని అరబ్బుల తరఫున ప్రచారం చేసిందికూడా.

ఉభయపక్షాలమధ్యనూ వైషమ్యాలు నానాటికీ పెరిగిపోవడంతో పాలస్తీనాలో సామ్రాజ్యవాదులకు నిరంకుశమైన పోలీసుపరిపాలన సాగించడానికి అవకాశ మిచ్చింది. ఇంగ్లండులో జనాభాలో 700కి ఒక్కొక్కడు చొ॥ పోలీసు బలాన్ని నిర్ణయిస్తే, పాలస్తీనాలో నూటికి ఒకడు చొ॥ పోలీసు బలం పెంచారు. ఇంగ్లండులో మొత్తం ప్రభుత్వవ్యయంలో వెయ్యింట మూడువంతులే పోలీసుశాఖ ఖర్చులకు వినియోగిస్తుంటే, పాలస్తీనాలో ప్రభుత్వవ్యయం మొత్తంలో నూరింట 27 వంతులు పోలీసు శాఖనిమిత్తం వ్యయపరిచారు. ఈ విధంగా పాలస్తీనాలో పార్లమెంటుగాని ఎన్నికలుగాని లేకుండా నిరంకుశపరిపాలన సాగింది. యూదు ఉద్యమం యూదులకు బాధానివారణ తేలేకపోగా, సామ్రాజ్యవాదులకీ, అరబ్ స్వాతంత్ర్యోద్యమానికీ మధ్యపడి నలిగిపోయింది.

సాంఘిక దుస్థితి ఫలితంగా యూదులకు సంభవించిన కష్టనిష్ఠురాలు ఈ రీతిగా ఒక బలవత్తరప్రభుత్వం చేతిలో పరికరాలై ఇక్కడి నిర్భాగ్యులైన ప్రజలను పీడించడానికి వినియోగపడ్డ విషాదకరమైన విషయం. దీర్ఘకాలం క్రూరంగా హింసించబడిన యూదు యువజనులు అంధులై ప్రపంచ రాజకీయ తంత్రాలలో పరికరాలైనారు. ప్రపంచవ్యవహారాలలో అత్యంత ప్రధానమైన పాలస్తీనాలో బ్రిటిష్‌ప్రాబల్యం నిలదొక్కుకుంది.

పాలస్తీనాలో మరొక బ్రిటిష్ డొమినియన్ స్థాపించి పూర్వ యూదునాగరికతా వైభవాన్ని పునరుద్ధరించాలనే నినాదం ఫలితమే బాల్ఫర్ ప్రకటన. యూదులకొక జాతీయావాసం నెలకొల్పడం బాల్ఫర్ ప్రకటన ఆశయం. కాని బ్రిటిష్ దుస్తంత్రాలపై పెంపొందిన ఈ యూదుఉద్యమం విపరీతంగా పరిణమించింది. ప్రథమ ప్రపంచసంగ్రామానంతరం తలెత్తిన నాజీ వాదానికీ, యుద్ధానంతర ఆర్థికవ్యవస్థకీ యూదులు గురైనారు. ఏదేశంలో చూచినా ప్రభుత్వాలు జాతీయవాదులు క్రూరహింసలకు గురైన యూదులకు పాలస్తీనాలోని నూతనావాసం స్వర్గతుల్యంగా కనపడింది. యూదుజాతులలో మేధావులనతగినవారు పాలస్తీనాలో చేరి నివాసం ఏర్పరచుకున్నారు. ఆధునిక శాస్త్రజ్ఞులు, పారిశ్రామిక నిపుణులు, అందరూ చేరారు. వీరందరూ ఉజ్వల భవిష్యత్తు గురించి కలలు గన్నారు.

పురాతన దేశమైన పాలస్తీనాలో యూదులు వేలాది వచ్చి చేరగానే దేశంలో అకస్మాత్తుగా నూతనపరిణామం గోచరించింది. హింసలు, అవమానాలు భరించలేక వచ్చిచేరినవారు ఇక్కడ ఆర్థిక, సాంఘిక రంగాలలో పెద్దపెద్ద మార్పులు తెచ్చారు.

వ్యావసాయిక, పారిశ్రామిక సహకారసంస్థలు నెలకొల్పబడినయ్. సహకార సూత్రబద్ధమైన వలసలు స్థాపన కావడంతో సామ్యవాద భావాలు ప్రచారమైనాయి. సమాజ జీవనం నూతనమార్గం తొక్కింది. వామపక్షవాదం వ్యాప్తమయింది. కార్మిక, సహకారసంస్థలు బలపడినాయి. యూదుల సంఘబలం పెరుగుతున్నకొద్దీ, వారు బ్రిటిష్ తంత్ర రాజకీయాలకు కట్టుబడిఉండే ఆశ సన్నగిలింది. యూదుల ప్రాబల్యం ప్రదర్శితమౌతున్నకొద్దీ, వారి హింసాపూరిత చర్యలు రెచ్చినకొద్దీ, పాలస్తీనాలో బ్రిటిష్‌వారి స్థావరం చలించడం ఆరంభించింది.

అయితే అరబ్బుల పక్షాన్ని బ్రిటిష్‌వారు విడిచిపెట్టలేదు. ద్వితీయ ప్రపంచ సంగ్రామం ప్రారంభం కావడంతో అరబ్బులపక్షం వహించడం బ్రిటిష్‌వారికి మరింత అవసరమయింది. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు ఈ పక్షంనుంచి ఆపక్షానికీ, ఆ పక్షంనుంచి ఈ పక్షానికి మారుతున్నందువల్ల, చివరికి వారు అరబ్‌లీగ్ స్థాపనకు విముఖులు కారనే భావం అరబ్ రాజ్యాంగ వేత్తలకు కలిగింది. సంరక్షణ పేరుతో పాశ్చాత్య సామ్రాజ్యవాదులు చేస్తున్న దుస్తంత్రాలను నిరోధించడానికిగాను క్రమక్రమంగా నెలకొంటున్న అరబ్ లీగ్‌ని ఆరంభంలో బ్రిటిష్‌వారు ప్రతిఘటించారు. ఇప్పుడు యూదుల దౌర్జన్యవాద ఫలితంగా అరబ్బుల మధ్య సంఘీభావం కుదిరి వచ్చింది. 1945 వేసవిలో అరబ్‌రాజ్య ప్రతినిధుల సమాఖ్య స్థాపించబడింది. యూదు విప్లవాన్ని అరికట్టే ఉద్దేశంతో బ్రిటిష్‌వారీ సంస్థకు చేయూత నిచ్చారు. కాని అరబ్‌రాజ్యాల స్వాతంత్ర్యాన్ని, పరిపాలన హక్కుల్ని సంరక్షించడంకోసం ఏర్పడిన ఈ సంస్థ సామ్రాజ్యవాదహితం కోరి పని చేస్తుందనే నమ్మకం లేదు. అందువల్ల అరబ్ లీగ్‌పట్ల పైపైకి సహకార సానుభూతులు ప్రదర్శించినా, దానికి క్రిందనుంచి ఎసరుపెట్టడానికి కృషి చేస్తూనే ఉన్నారు.

ఫ్రెంచి తాకిడికి విశాలసిరియారాజ్యం వీగిపోయిన అనంతరం, జోర్డన్‌కి తూర్పునున్న ప్రాంతం ట్రాన్స్‌జోర్డన్ రాజ్యంగా నిర్మించబడింది. మక్కా షెరీఫ్ పెద్దకొడుకు అబ్దుల్లా బ్రిటిష్ మిలిటరీ సహాయంతో, ఆర్థికసహాయంతో ట్రాన్స్‌జోర్డన్‌కు రాజైనాడు. అయితే ట్రాన్స్‌జోర్డన్ రాజ్యాన్ని పునర్నిర్మించవలసిన అగత్యం కలిగింది. బ్రిటిష్‌వారు సాలుకి 25 లక్షల పౌనులు సబ్సిడీ నిచ్చి, గ్లబ్ పాషా అను బ్రిటిష్ మిలిటరీ ఆఫీసరును అరబ్ సైనికులకు శిక్షణ నిమిత్తం పంపారు. యూదుల నివాసం అక్కడ ఏర్పాటు చెయ్యకుండా చేశారు. తద్వారా తమ ప్రాబల్యానికి ప్రమాదం సంభవించకుండా, మధ్యప్రాచ్యంలో స్థిర స్థావరం స్థాపించుకున్నారు.

బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు చాటుగా ఉండి అబ్దుల్లా రాజును ముందుబెట్టి సిరియాలో దుస్తంత్రాలు సాగించారు. సిరియాలో ప్రజల అసంతృప్తిని ఆధారంగా చేసుకుని అబ్దుల్లా అనుచరులు సిరియాలోని పాలకవర్గాన్ని కూలదోసి విశాలసిరియాను తన రాజ్యాధిపత్యం కింద స్థాపించాలని యత్నిస్తున్నారు. దీనివల్ల బ్రిటిష్‌వారి స్థావరం విశాలమై ఈ ప్రాంతంలో వారి ప్రాబల్యం వృద్ధి కావచ్చును. ఇరాక్‌లో అవకాశంకోసం నిరీక్షిస్తున్న స్వార్థపరులు హాషిమైట్ రాజకుటుంబాన్ని చిరస్థాయి చెయ్యాలని యత్నిస్తున్నారు. హాషిమైట్ రాజ్యంపట్ల వారి జాతీయభావప్రోద్బలం ఎంత ఉన్నప్పటికీ ముఖ్యంగా వీరితో లాలూచీ పడ్డానికి వారి స్వార్థమే ముఖ్యహేతువు. వారు బ్రిటిష్ సామ్రాజ్యవాదుల చేతిపరికరా లన్నమాట వాస్తవం.

అరబ్ లీగ్‌లో అబ్దుల్లా స్వార్థపరుడుగా పరిగణించబడుతున్నాడు. ఇబన్‌సాద్ లీగ్‌లో కెల్ల బలవంతుడు. అతను అబ్దుల్లాను శత్రువుగా పరిగణిస్తాడు. ట్రాన్స్‌జోర్డన్‌లో తమకు స్థానం లేకపోయిందని యూదులకు ఆగ్రహంగానే ఉంది. కొన్నిదినాల క్రిందట డా॥ వీజ్‌మన్ యూదుకాంగ్రెస్‌లో ఇలా అన్నాడు; "మనరాజ్యం తూర్పుసరిహద్దు సంగతి అప్పుడే తేలదు. ట్రాన్స్‌జోర్డన్‌లో యూదులు అసంఖ్యాకంగా మూగినప్పుడు, అప్పుడు మనం అక్కడ ప్రవేశించవచ్చును. పాలస్తీనాలోని అరబ్‌జిల్లాలనైనా తన పరిపాలనలోకి తెచ్చుకోవాలనే కోరికతో, అబ్దుల్లారాజు బ్రిటిష్‌వారి దేశవిభజన కార్యక్రమానికి అంగీకరించాడు. బ్రిటిష్‌వారు దేశం విడిచిపోగానే ఆ జిల్లాల్ని ఆక్రమించుకున్నారు. కాని ఈ జిల్లాలలోని పాలస్తీనావారులు అబ్దుల్లా రాజరికానికి సమ్మతించలేదు. వారి ప్రాంతాలు ట్రాన్స్‌జోర్డన్‌లో కలిసిపోవడం వారి కిష్టం లేదు. కాని ఈనాడు బ్రిటిష్‌వారి దయాదాక్షిణ్యాలపైన ఆధారపడిన ట్రాన్స్‌జోర్డన్ సైన్యమే వారికీ యూదుసైన్యానికీ మధ్య అవరోధంగా ఉంది."

వాస్తవానికి ఇజ్రాయిల్ సైన్యాలు ట్రాన్స్‌జోర్డన్ ఆక్రమించుకోవాలనే ఆశయంతో కొన్నిసార్లు సరిహద్దుదాటి ఆ దేశంలో ప్రవేశించాయికూడా. దీనితో బ్రిటిష్‌వారికి పట్టరాని ఆగ్రహం కలిగింది. వెంటనే తమ సైన్యాల్ని అక్కడికి పంపారు. దక్షిణ నెగెవ్ ఎడారి ప్రాంతాన్ని ఆక్రమించిన ఇజ్రాయిల్ సైన్యాలకు ట్రాన్స్‌జోర్డన్ ఓడరేవు అకాబాను సంరక్షిస్తున్న బ్రిటిష్‌సైన్యాలు ఎదురై నిలిచాయి.

పందొమ్మిదో శతాబ్దంలో స్థిరసంకల్పంతో మధ్యప్రాచ్యంలో వ్యాప్తిచేసుకొన్న బ్రిటిష్‌వారి ప్రాబల్యం, ప్రథమ ప్రపంచసంగ్రామానంతరం సుస్థిరం చేసుకోగలిగింది. ద్వితీయ ప్రపంచసంగ్రామానంతరం బ్రిటిష్ సైనికబలం క్షీణించినందువల్ల మధ్యప్రాచ్యంలో వారి ప్రాబల్యం చలించిపోయింది. తమ ప్రాబల్యాన్ని అమెరికాకు విడిచిపెడుతున్నట్లు నటిస్తున్నారు. కాని సుశిక్షిత రాజకీయతంత్రజ్ఞులద్వారా ఈ ప్రాంతంలో బ్రిటన్ తన ప్రాబల్యాన్ని రాజకీయంగా ఇంకా నిలుపుకుంటోంది. పైపైకి అరబ్‌దేశాలకు స్వాతంత్ర్యం ఇస్తున్నట్లు నటిస్తున్నా, అక్కడి ధనవంతుల సహాయంతోనూ, అవినీతిపరులైన అధికారుల సహాయంతోనూ ఈ ప్రాంతాన్ని ఇంకా ఆర్థికంగా రాజకీయంగా తన చెప్పుచేతుల్లో పెట్టుకోడానికే తంత్రాలు పన్నుతోంది. సామ్రాజ్యవాదులు తమ స్వార్థాశయాలకోసం ధనవంతులను పాలకులుగా తమ అండను ఉంచుకుంటున్నారు.

సోషలిస్టు బ్రిటన్‌కూడా తన విధానాన్ని మార్చుకోడంలేదు. బ్రిటిష్ కార్మికపక్ష సమావేశంలో ఒకసారి కొందరు మధ్యప్రాచ్యంలో కొన్ని ప్రాంతాల్ని అంతర్జాతీయ సంస్థకు ఒప్పగించాలని సూచించినప్పుడు బెవిన్ నిర్మొహమాటంగా ఇలా అన్నాడు: "అంతా ఎవరిమట్టుకు వారు తమతమ సంపదల్ని కాపాడుకుంటుంటే, బ్రిటిష్‌వారి సంపదల్ని గంగలో తొయ్యాలని చెప్తే నేను ఒప్పుకోను."

బ్రిటిష్‌వారు తమ సామ్రాజ్యాన్ని అంతరింపచేసేది ఈ ప్రకారమే! బ్రిటిష్‌సైన్యబలం పనికిరానిచోట బ్రిటిష్‌రాజ్యాంగదుస్తంత్రాలు అమలు జరుగుతున్నాయి. వారు భారతదేశాన్ని విడిచివెళ్లిపోయారంటే ఊరకే కాదు. కామన్వెల్త్‌లో సభ్యత్వం నిలపడానికే.

[సమాప్తం]

(6-వ పేజీ తరువాయి)

పోవుటపో కారణములు మనంకూడా మన భాషయొక్క స్వల్పపరిధులను దాటి మన సాహిత్యమును ఆ యా భాషలలోని కనువదించ డానికి ప్రయత్నిస్తే మన సాహిత్యమూ భారతీయ సాహిత్య రంగంలో పేరెన్నికతో విలసిల్ల గలదు. అట్లు గాక మన తెలుగు సరిహద్దులలోనే భాషకెన్ని వన్నె చిన్నెలు చేస్తూ కూర్చున్నా విశాలభారతములో మనకూ మన సాహిత్యమునకూ తగిన గౌరవస్థానము నాక్రమించ జాలము.

శతాబ్దం గడిచిన డెన్మార్కు కర్షకప్రజాస్వామ్యం

[డెన్మార్కు ప్రధాని హాన్స్ హెడాఫ్]

డేనిష్ రాజ్యాంగం, డేనిష్ ప్రజాస్వామ్య పాలనావిధానం 1848-49 లో రూపొందాయి. యూరప్ చరిత్రలో ఈ సంవత్సరం అత్యంతప్రధానమైనది. 1848 ఫిబ్రవరి ఫ్రెంచి విప్లవం తాకిడికి యూరప్‌లోని అనేక దేశాల్లో రాజకీయ, జాతీయరంగాలలో కల్లోలతరంగాలు వ్యాపించాయి. ఆ సంవత్సరం జనవరిలో డెన్మార్కురాజు ఎనిమిదో క్రిస్టియన్ మరణించడంతో డెన్మార్కులో ఈ కల్లోలం తీవ్రతర మయింది.

డెన్మార్కు చరిత్రలో 1848 వ సంవత్సరం ప్రధాన ఘట్టం. ఆ సంవత్సరం డేనిష్ జాతీయ రాజ్యాంగపరిషత్సభ జరిగింది. ఆ సంవత్సరమే ష్లేస్విగ్ యుద్ధం ప్రారంభమయింది. డెన్మార్కు నుంచి ష్లేస్విగ్ రాష్ట్రాన్ని వేరుపరచాలని జర్మనీ యత్నాల ఫలితంగా ఈ యుద్ధం సంభవించింది. నార్వే, స్వీడెన్‌లలో నిరంకుశ పాలన ముందే అంతమై ప్రజాస్వామ్యం అమలు జరిగింది. డెన్మార్కులో 1848-49 లో ప్రజాస్వామ్య పరిపాలన ప్రారంభమై అది మొదలు దినదినప్రవర్ధమాన మయింది. డెన్మార్కు, నార్వే, స్వీడెన్ దేశాలలో రాజకీయ పరిణామాల గతి ఒకేరీతి ననుసరించింది.

ఈ మూడు దేశాలలోనూ రైతులోకం రాజకీయ చైతన్యం పొందింది. రాజ్యాంగ సంస్కరణలలో రైతు ఉద్యమమే ప్రధానపాత్ర వహించింది. స్వాతంత్ర్యపిపాసువులైన రైతుల కృషి ఫలితంగా ఉత్తమప్రజాస్వామ్య సిద్ధాంతాలు ప్రచారంలోకి వచ్చాయి. పందొమ్మిదో శతాబ్ద మధ్యకాలంలో మిగతా దేశాలన్నిటిలోనూ రైతులోకం రాజకీయచైతన్యం లేక మూకగా పడిఉన్న సమయంలో ఈ మూడు స్కాండినేవియన్ దేశాలలోనూ రైతులు రాజకీయాలలో ప్రవేశించారు. పరిపాలనా వ్యవహారాలలో తమ ప్రాబల్యం కనపరిచారు. అందువల్లనే అప్పుడు తయారైన స్కాండినేవియన్ రాజ్యాంగ నిర్మాణాలలో రైతుల కోరికలు మన్నించబడినాయి. అవి రైతు రాజ్యాంగాలైనాయి. అందువల్లనే దాదాపు ఆ సమయంలోనే నిర్మించబడిన ఇతర రాజ్యాంగాలకంటె స్కాండినేవియన్ రాజ్యాంగాలు సుస్థిరంగా ఉన్నాయి. ఈ విషయాన్ని సరిగా పరిశీలిస్తే అక్కడి ప్రజల శాంతిలక్ష్యాలు, శాంతిజీవనం, మొదలైనవి బోధపడగలవు. రైతుల శాంతి ప్రియత్వమే అక్కడ సుస్థిరపరిపాలనకు అవకాశమిచ్చింది. అక్కడ ప్రజాస్వామ్యానికి గట్టి పునాదులు పడ్డాయి.

డెన్మార్కులో ప్రజాస్వామ్యం 1849 జూన్ 5 వ తేదీని నెలకొల్పబడింది. ఆ రాజ్యాంగం స్థాపించబడి ఇప్పటికి నూరు సంవత్సరాలు నిండాయి. ఆ రాజ్యాంగంయొక్క ప్రాధాన్యత, డెన్మార్కు ప్రజల స్వాతంత్ర్యాశయసిద్ధికీ, పురోభివృద్ధికీ ఆ రాజ్యాంగం చేసిన తోడ్పాటు ఎన్నడానికి తరం కాదు. డేనిష్ ప్రజలు తమ రాజ్యాంగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో ఆదరిస్తారు. ఆ రాజ్యాంగ మిప్పుడు మూడు స్కాండినేవియన్ దేశాలలోనూ అనుసరించబడుతోంది. ఆ దేశాల మధ్యనూ విద్యావిజ్ఞానాదిరంగాలలో సన్నిహితబాంధవ్యం తీసుకురాగలిగింది ఈ రాజ్యాంగమే. శాసనాల నిర్మించడంలోనూ, అమలుపరచడంలోనూ మూడు దేశాలకూమధ్య సహకారం సాధ్యమయింది. కొన్ని శాసనాలు మూడు దేశాలలోనూ ఒకేరూపంలో ఒకే విధాన అమలుజరుగుతున్నాయి.

ఇంతే గాదు. మా జాతిలోని వివిధవర్గాలు పురోభివృద్ధిపొంది రాజకీయాధికారం ఆర్జించగల అవకాశం మా ప్రజాస్వామ్యంలో ఉంది. బహుశా ప్రజాస్వామ్యం అంటేనే సహజంగా అన్నివర్గాలవారికీ సమానావకాశా లిస్తుంది. చారిత్రకంగా చూస్తే ఏఒక్క కాలంలోగాని ఒక దేశంలో ఏ పార్టీ ప్రభుత్వాధికారంలో ఉంటుందో, మిగతా రెండు దేశాల్లోనూ ఆ కాలంలో అదే వర్గానికి చెందిన పార్టీ ప్రభుత్వాధికారంలో ఉండడం సంభవిస్తోంది. అంతర్జాతీయ వ్యవహారాలలో దీనివల్ల ఎటువంటి ప్రయోజనం ఉంటుందో సులువుగా గ్రహించవచ్చును.

ప్రజాస్వామ్యం సుస్థిరం కావడంతో ఇతర స్కాండినేవియన్ దేశాలలోనే గాకుండా, ఆంగ్లో-సాక్సన్ ప్రజాస్వామ్యాలతో కూడా సన్నిహితమైత్రి ఏర్పడింది. ఈ ప్రజాస్వామ్యాలన్నిటిలోనూ జీవితంగురించీ, మూల్యాలను గురించీ ఒకే రకమైన ప్రమాణాలు ప్రచారంలోకి వచ్చాయి. దీనితోపాటు రష్యాలోని జార్ ప్రభుత్వానికీ, జర్మనీలోని కైజర్ ప్రభుత్వానికీ మా దేశంతో గల వైమనస్యాలు హెచ్చిపోయాయి. ఆ రెండు దేశాలలోని ప్రభుత్వ పరిపాలనా విధానానికీ, డెన్మార్కులో ప్రభుత్వ పరిపాలనా విధానానికీ చాలా అంతరం ఉంది. అంతర్జాతీయ వ్యవహారాలలో ఇవి సుస్పష్టమైనాయి.

దేశంలో వ్యవహారాలను గమనిస్తే, ప్రజాస్వామ్యం స్థాపనతో ప్రజల్లో రాజకీయ చైతన్యం కలిగింది. రాజకీయాలలో వారి ప్రాబల్యం నానాటికీ పెరుగుతూ వచ్చింది. 1869 ఎన్నికల్లో జనాభాలో నూరింట 30 వంతు మాత్రమే పాల్గొన్నారు. 1947 లో నూరింట 86 వంతులు పాల్గొన్నారు. క్రమక్రమంగా ప్రజాసామాన్యం రాజకీయాలలో శ్రద్ధ వహిస్తూ వచ్చింది. ఇదే రాజ్యాంగనిర్మాతలు కోరినది. వ్యక్తిగతబాధ్యతకు తావిచ్చి జనాభాలో అత్యధికసంఖ్యాకుల ఆదరణపై ఆధారపడే పరిపాలననే వారు ఆశించారు. ఇట్టి ఆదరణవల్ల, బాధ్యతవల్ల స్వయంసముద్ధరణ చక్కగా నెరవేరుతుంది. పూర్వరాజాధికారం ప్రజాపాలనగా, పీడిత ప్రజానీకం స్వతంత్రపౌరులుగా మారడమే వారు కోరినది. అది నెరవేరింది.

నూరు సంవత్సరాలైన తర్వాత రాజ్యాంగ నిర్మాతల ఆశయాలు ఫలించినవని ప్రకటించుకోడానికి నాకు గర్వంగా ఉంది. జాతిలోని సర్వవర్గాలపైనా ప్రజాస్వామ్యం మోపిన భారం క్రిందనూ, ప్రజాస్వామ్య విధానంవలన సామాన్య జనులలో ఉద్భవించిన రాజకీయబలంవల్లనూ, నూరు సంవత్సరాల్లో డేనిష్ ప్రజానీకం రాజకీయంగా బలపడింది. ప్రజాస్వామ్యానికి వేళ్లు లోతుగా పాతుకున్నాయి.

రాజ్యాంగ సంస్కరణలు పరిణామంద్వారా వచ్చినవే గాని విప్లవంద్వారా వచ్చినవిగావు. ఈ రక్తపాతరహిత విప్లవంవల్ల వ్యక్తిగత వికాసానికి అపారావకాశాలు లభించాయి. ప్రజాస్వామ్యంవల్ల వ్యక్తులలో ప్రతిభ పెంపొందుతుంది. ఇతర ప్రభుత్వ విధానాలలో వ్యక్తి ప్రతిభ అణిచివెయ్యబడుతుంది. డెన్మార్కులో రాజ్యాంగరచనావిశేషఫలితంగా లభించిన వ్యక్తిగత స్వాతంత్ర్యంవల్ల, సంఘంలోని వర్గాలొక్కొక్కటే క్రమక్రమంగా ఉద్ధరింపబడినాయి. సర్వవర్గాలకూ లభించిన రాజకీయ, సాంఘిక వికాసంవల్ల, క్రమక్రమంగా వివిధ వర్గాలను వేరు చేసే అంతరాలు అంతరించాయి. రాజకీయ, ఆర్థిక, సాంఘిక రంగాలలో క్రమక్రమంగా వ్యత్యాసాలు తగ్గి సర్వవర్గాలూ ఒకే చదునులో కొచ్చాయి. వర్గవ్యత్యాసాలు అంతరించినది డెన్మార్కు ప్రజాస్వామ్యంలో సాధ్యమైనట్లు మరే ప్రజాస్వామ్యంలోనూ ఇంతవరకూ సాధ్యం కాలేదు.

కార్మికులు, కర్షకుల సంఘప్రతిపత్తి మారిపోయింది. నూరు సంవత్సరాలకు పూర్వం వారి స్థితికీ, ఇప్పటి స్థితికీ పోలికేలేదు దీనికి డేనిష్ ప్రజాస్వామ్య రాజ్యాంగమే హేతువు. ఈ పరిణామానికి యూరప్ పరిణామాలు కొంత తోడ్పడినప్పటికీ అది ప్రధానహేతువు కాదు. వివిధవర్గాలు చైతన్యం పొంది స్వయంసముద్ధరణకు వారు చేసిన స్వయంకృషియే ప్రధాన హేతువు.

గత శతాబ్దంలో డేనిష్ ప్రజాస్వామ్యం సాధించిన మహత్కార్యాలలో ఆర్థికంగా వైజ్ఞానికంగా వర్గవ్యత్యాసాల నిర్మూలనం మహోత్తమమైన దని చెప్పవచ్చును. వివిధవర్గాలను ఐక్యంచేసుకున్న డెన్మార్కు దేశానికి నైతికబలం అనేకరెట్లు ఇనుమడించింది. జర్మన్లు దేశాన్ని ఆక్రమించిన కాలంలో డేనిష్ ప్రజల్లో వారు వైషమ్యాలు కల్పించలేకపోయినారంటే దానికి కారణం వర్గవ్యత్యాసాలు లేకపోవడమే. క్రమక్రమంగా దేశంలో ప్రభుత్వ పరిపాలనలో వివిధరాజకీయపక్షాలమధ్య సహకారం గోచరిస్తున్న దంటే దానికికూడా కారణం అదే. భిన్నపక్షాల సహకారంపై నడిచే ప్రభుత్వం ఇటీవల అగత్య మయింది.

డెన్మార్కు ప్రజాస్వామ్యపథంలో పురోభివృద్ధి పొందుతోంది. డెన్మార్కు ప్రజాస్వామ్యానికి ఉజ్జ్వల భవిష్యత్తుంది.

గృహాధి దేవత

[గృహకార్యనిర్వహణం అంటే కొందరు స్త్రీలకి అభిరుచి ఉండదు. కొందరికి చేతకాదు. కొందరు అవమానకర మని పరిగణిస్తారుకూడా. అసలు ఆధునిక భావపరిణామానికి మూలం పాశ్చాత్యవిద్య, తద్వారా పాశ్చాత్య నాగరికతాసంపర్కం. అందువల్ల పాశ్చాత్యదేశాల్లోని వనితాలోకంలో పై విషయమై భావపరిణామగతి ఏ దిశగా ఉందో గ్రహించడం కొంత అవసరం. విషయం మంచిచెడ్డలమాట అటుంచి, భావగతిని తెలుసుకోవడం ముందు అవసరం. కాబట్టి అమెరికాలో గృహిణీ మాసపత్రికలో డరోతీ థాంప్సన్ అనే ఆమె వ్రాసిన వ్యాససంగ్రహాన్ని ఇక్కడ పొందుపరుస్తున్నాం.]

ఒకసారి నేను కొత్తగా ఊళ్ళోకివచ్చిన నా స్నేహితురాలింటికి చూడటానికి వెళ్లినప్పుడు, ఆమె రేషన్ల నిమిత్తం దరఖాస్తు వ్రాస్తోంది. దరఖాస్తు అచ్చుప్రతిమీద ప్రశ్నలకి సమాధానాలు వ్రాస్తోంది. ఒక ప్రశ్నవద్ద వ్రాయకుండా ఆలోచిస్తూ ఉండడం గమనించాను. కొంతసేపటికి కలం టేబుల్‌మీద పెట్టేసి నాకేసి తిరిగి ఇల్లా అంది; "ఇలాటి ప్రశ్న చూస్తే నాకు చిరాకొస్తుంది. అసలీ విషయాన్ని గురించి ఆలోచిస్తే చాలా చిన్నతనమనిపిస్తుంది. ఇంట్లోవాళ్లు ఎవరే ఉద్యోగం చేస్తున్నారో ఇక్కడ రాయాలిట. ఏం రాయను? ఇంటిచాకిరీ వంటచాకిరీ అని రాయనా? నా గతి చూడు. ఎందు కొచ్చిందీ చదువంతా? కాలేజీ చదువు వెలగబెట్టాను. డిగ్రీ పుచ్చుకున్నాను. వయస్సు మించిపోలేదు. నా చదువువల్ల కించిత్తుకూడా లబ్ధిలేదు. నా చదువుగాని బుద్ధిబలంగాని ఉపయోగించలేక శరీరపరిశ్రమ చేసి పైసా ఆర్జించలేకపోయాను. చదువూ, శక్తీ ఉండి ఏం లాభం? ఎందుకూ కొరగాకుండా లేదు. ఇంటిచాకిరీయే నాకు మిగిలిన ఉద్యోగం."

నాకు నవ్వొచ్చింది. "నొచ్చిన చిక్కేమిటంటే, ఇంటిచాకిరీ, వంటచాకిరీ, అంటున్నావ్. పదిరకాల ఉద్యోగాలన్నిటికీ కలిపి ఒక్కటే పేరు వెతికితే, మరికొంత గౌరవప్రదమైన పేరు వెతికితే అది నీ ఉద్యోగ మౌతుంది. నీ ఉద్యోగా లన్నిటిలోనూ నువ్వు చెయ్యితిరిగిన దానవు. నీది ఒక ఉద్యోగం కాదు, చూడు. ఆ ప్రశ్నకి సమాధానంగా ప్రక్కని నువ్వు ఈ మాటలన్నీ రాయచ్చు: ఆయవ్యయాలు తనిఖీ చేసే ఆడిటర్, ఆయవ్యయాలు చేసే ఆర్థికమంత్రి. వంటమనిషి. శిశుసంరక్షకురాలు. (నర్సు) అధ్యాపకురాలు. ఆంతరంగిక కార్యదర్శి. ఆహారశాఖామంత్రి వగైరా. అన్నిటికంటె ముఖ్యమైనది దాత."

"అదెల్లాగ. దాత నెల్లా కాగలను? దాతలు ధనం దానం చేస్తారు. నేను ఎవ్వరికీ దానం చెయ్యలేదే?"

"కావచ్చు. దాత అంటే ధనం దానం చేసేవారికే చెల్లదు. మానవులకి అమృతప్రాయమైన ప్రేమ నిచ్చి, తన్నిమిత్తం చేసేవారు కూడా దాతలే. నీ సత్తువ ధారపోసి, నీ బుద్ధిబలం అంతా వినియోగించి, నీ కాలంఅంతా వెచ్చించి ప్రేమ ప్రసాదిస్తావు. దానితోనే బిడ్డల్ని పెంచి పౌరులుగా చేస్తావు."

"నువ్వు చెప్పేదాంట్లో కొంత సత్యం ఉండవచ్చును. కాని నా జీవితవిధానం గురించి చిన్నతనంలో ఎన్నో కలలు గన్నాను. ఒక్కటీ నెరవేరలేదు. నా యౌవనంలో వీణ వాయించేదాన్ని. ఎంతో శ్రమపడి సాధన చేశాను. కాని ఇప్పుడు వీణ తీస్తే అప్పటివలె వాయించలేను. ఆ స్వారస్యం ఇప్పుడు రాదు. మరి నా కాలేజి చదువుకూడా ఏందుకూ రాకుండా వ్యర్థమైపోయింది."

"కానయితే ఇది ఆలోచించు. నీ బిడ్డలందరికీ ఇప్పుడు సంగీతం అంటే సహజమైన అభిరుచి ఉంది. నువ్వే నీ గృహంలోకి గానం తెచ్చావు. నీకు తెలియకుండానే నీ ఇంట్లో కొత్తవెలుగులు వెలిగించావు. అనాలోచితంగానే, కాని అనాయాసంగా కొన్ని ప్రధాన గృహసమస్యలపైన నీ మనస్సును లగ్నపరిచి సాధించావు. సమస్యల్ని పరిష్కరించడానికి బుద్ధి నెలా ఉపయోగించాలో నీ బిడ్డలికి నేర్పిపెట్టావు. కాలాన్నెలా సద్వినియోగం చెయ్యాలో చూపించావు. ఇదంతా అనాలోచితంగా చేశావు. అనాలోచితంగా కాకపోతే ఇంత సులువుగా సాధించలేకపోయేదానివే. గృహనిర్వహణలో విశేషప్రజ్ఞ చూపావు. నీ సామర్థ్యం దూరాన ఉండి గమనించిన నాకు తెలుసును" అన్నాను.

ఈ ఇల్లాలు కాలేజి చదువు పూర్తి చేసుకుని ఇరవయ్యోఏట ఒక స్కూలుమేష్టర్ని పెళ్లి చేసుకుంది. ముగ్గురు బిడ్డల్ని కన్నది. వారి ఆదాయం ఎప్పుడూ నెలకు రు 100 పైన మించలేదు. కాని నిరాడంబరంగానైనా పరిశుభ్రంగా ఉంటే చిన్నగృహంలో నివసిస్తారు. కడుపు మాడ్చుకోవలసిన అవసరం వారికి కలగలేదు. వారి వేషాలంకారాలలో లోటు కనిపించదు. పిల్లలు బుద్ధిమంతులు. అల్లరిచేసినా ముద్దుగా ఉంటుంది. కాని విసుగు కలిగించరు. తెలివైనవాళ్లు. పరిశ్రమకూడా ఉంది. అందువల్లనే తండ్రిని ఎక్కువ బాధపెట్టకుండా స్కాలర్‌షిప్పులవల్ల చదువు సాగించగలుగుతున్నారు. దయాభావం, సహనం ఆదరం నేర్చారు.

కొద్ది ఆదాయంలో పొదుపుగా గడిపి గృహాన్ని నిర్వహించిన విధానం చూస్తే, ఆమెలో వ్యాపారనిర్వహణదక్షత విశేషంగా కనపడుతుంది. నేరమాడి ఇంటికి కావలసిన వస్తు

(20-వ పేజీ చూడుడు)

మన రాష్ట్రం మన దేశం

★ ఆంధ్రరాష్ట్ర సాధన: వెంకట్రావుగారి సూచన
★ కాశ్మీర్ సమస్య

ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోరేవారు చెన్నపట్నంపైన హక్కులు వొదులుకోవాలి అని పట్టాభి - పటేల్ - నెహ్రూ కమిటీ ఆదేశమిచ్చింది. ఈ మాటలకి అందరూ తలొక వ్యాఖ్యానం చేశారు. ఆంధ్రరాష్ట్రంలో చేర్చాలనే హక్కు ఒక్కటే వొదులుకోవాలా? లేక చెన్నపట్నాన్ని తమిళ్నాడులో కలిపేస్తోంటే మాట్లాడకుండా ఊరుకోవాలని దీని అర్థమా అని దేశంలో తర్కవితర్కాలు చెలరేగాయి. బొంబాయి పరిస్థితీ చెన్నపట్నం పరిస్థితీ ఒక్కటి గావని కూడా నాయకత్రయ కమిటీ నివేదికలో చెప్పారు. దీనివల్లనే ఇంతగా వాదోపవాదాలకి తావొచ్చింది. ఆంధ్రమహాసభ నాయకులు డా॥ పట్టాభిగారితో సంప్రదించిన అనంతరం నాయకత్రయ కమిటీ ఆదేశాన్ని బేషరతుగా ఆమోదించారు. ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ చెన్నపట్నంపైన హక్కు వొదులుకోలేరనీ, ప్రస్తుతానికి నిక్కచ్చిగా తెలుగువారివే అయిన జిల్లాలతో రాష్ట్రం నిర్మించి, దానికి చెన్నపట్నాన్నే ప్రధాననగరంగా ఉంచాలనీ, వెన్వెంటనే చెన్నపట్నం, బళ్లారి, గంజాం మొదలైన ప్రాంతాలు ఏ రాష్ట్రానికి చెందాలో నిర్ణయించడానికి సరిహద్దు నిర్ణాయక సంఘాన్ని నియమించాలనీ సూచిస్తూ తీర్మానం చేసింది. అంటే కొన్ని మరతులతో పైకమిటీ ఆదేశంలో ప్రధానాంశాన్ని అంగీకరించిందన్నమాట. కమిటీవారి ఆదేశాలను బేషరతుగా పూర్తిగా ఆమోదించకపోతే రాష్ట్రం రాకపోవచ్చుననీ, తరుణం మించిపోవచ్చుననీ కూడాననీ డా॥ పట్టాభిగారన్నారు.

ఈవారం కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ కళా వెంకట్రావుగారు చెన్నపట్నం వచ్చారు. చెన్నపట్నంలోనూ రాజమహేంద్రవరంలోనూ వారు పత్రికాప్రతినిధులకు ఈవిషయమై తమ అభిప్రాయాలు స్పష్టపరిచారు. ఆంధ్రరాష్ట్రం రావాలంటే రాష్ట్రకాంగ్రెస్ వెంటనే తన వైఖరిని మార్చుకోవలసిన అవసరం ఉందని సూచించారు. నాయకత్రయ కమిటీ నివేదికను రాష్ట్రకాంగ్రెస్ బేషరతుగా అంగీకరిస్తే వెంటనే రాష్ట్రం వస్తుందన్నారు. నివేదికలోని కొన్ని అంశాల్ని నిరాకరిస్తే ప్రయోజనం లేదన్నారు. ఇప్పటికిప్పుడు పోనిస్తే, చెన్నపట్నం మొదలైన వాదగ్రస్తమైన ద్విభాషాప్రాంతాలను గురించి మిగతా భాషారాష్ట్రాల నిర్మాణ కాలంలో నియమింపబడే సరిహద్దు నిర్ణాయక సంఘమే నిర్ణయిస్తుందని చెప్పారు ఈలోగా ఆంధ్రులు తమ రాష్ట్రానికి చెన్నపట్నాన్ని తాత్కాలికంగా ప్రధాననగరంగా పెట్టుకోదలిస్తే తమిళులు అభ్యంతరం చెప్పరని హామీయిచ్చారు.

చెన్నపట్నాన్ని తాత్కాలికంగా ఉభయ రాష్ట్రాలకూ రాజధానీనగరంగా ఉండడానికి వీర్పాటు చేసేపక్షంలో, క్రియకి వెంకట్రావు గారి సూచనా, రాష్ట్రకాంగ్రెస్ తీర్మానం గాద్దింలో ఒకటే అవుతాయి. చెన్నపట్నం మనకి కూడా రాజధానిగానే ఉంటుంది. నగర భవిష్యత్తు గురించి మున్ముందు, దేశమంతా భాషా రాష్ట్రాలుగా విభజించబడేటప్పుడు, సరిహద్దు నిర్ణాయకసంఘం విచారిస్తుంది. ఈ రెండు మరతులే రాష్ట్రకాంగ్రెస్ విధించింది. ఈ మరతులు నెరవేరగల వని కాంగ్రెస్ కార్యదర్శి కళా వెంకట్రావుగారు చెప్పారు. ఒక్కటే విషయం ఇంక స్పష్టం కావాలి. చెన్నపట్నంలో ఉండే ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వానికి పట్నంలోని తమ కార్యాలయ పరిసరాలలో ఎటువంటి అధికారాలు, హక్కులు ఉంటాయి? ఆంధ్రరాష్ట్ర ప్రభుత్వ కార్యాలయం నిర్నిబంధంగా అన్యుల జోక్యంతో నిమిత్తంలేకుండా తమ కార్యాలు నిర్వర్తించుకోగలగాలి. ఏపాటి అవకాశమున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాన్ని తిప్పలుపెట్టి నగరం నుంచి వెళ్లగొట్టడానికి యత్నించేవారుండక పోరు. ఈ విషయమై తగు రక్షణ తీసుకుంటే, రాష్ట్రకాంగ్రెస్ నాయకత్రయ నివేదికను ఆమోదించడానికి సంకోచం ఉండనవసరం లేదు. మున్ముందు చెన్నపట్నం తదితర సరిహద్దుల సందర్భంలో మనం న్యాయం చేకూర్చుకోడానికి మనకు మన ప్రభుత్వం ఒకటి ఉంటేనే వీలవుతుంది. లేనిపక్షంలో బరంపురం దౌర్జన్యాల వంటివానికికూడా ఏమీ చెయ్యలేక నిస్సహాయంగా చూస్తూ కూర్చోవలసివస్తుంది. ఇప్పుడు ఆంధ్రులకు ప్రత్యేకరాష్ట్రమే ఉంటే, బరంపురంలో జరిగిన దౌర్జన్యాలకు ఒరిస్సా ప్రభుత్వాన్ని హెచ్చరించగలిగేది. వాదగ్రస్త ప్రాంతాల్ని ఆయా సరిహద్దు ప్రభుత్వాలు ప్రభుత్వాధికారం వినియోగించి తమవిగా చేసుకోడానికి ఆట్టే కష్టం ఉండదు. ఆక్షేపించేవారుండరు. కాబట్టి ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ త్వరలో, తరుణం మించిపోకుండా ఆటంకం తొలగించి, బేషరతుగా నాయకత్రయకమిటీ నివేదికను ఆమోదించి సత్వరరాష్ట్ర నిర్మాణానికి తోడ్పడాలని చాలామంది నాయకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికి రాష్ట్ర కాంగ్రెస్ కమిటీలోని నాయకులు తప్ప తదితర నాయకుల దరూ, పట్టాభికమిటీ ఆదేశాన్ని పాటించడానికి సంసిద్ధతను ప్రకటించారు. ఆంధ్రమహాసభ, భాషారాష్ట్రసమితి, హిందూ మహాసభ మొదలైన సంస్థలన్నీకూడా సుముఖంగా ప్రకటించాయి. దేశంలో ప్రజాభిప్రాయంకూడా మారిందనే ఇటీవలి వార్తలను బట్టి భావించవచ్చును. ఇంక రాష్ట్రకాంగ్రెస్ కూడా అంగీకారం ప్రకటిస్తే నూతన రాజ్యాంగంతోపాటు ఆంధ్రరాష్ట్రం సిద్ధిస్తుంది.

కాంగ్రెస్ సంస్థ-సంస్కారం:

ఆంధ్రరాష్ట్రం ప్రత్యేకించబడితే చెన్నరాష్ట్రశాసనసభా కాంగ్రెస్‌పక్షంలో తగువులు చాలావరకు తేలిపోతాయని శ్రీ కళా వెంకట్రావు గారు చెన్నపట్నంలో చెప్పారు. అంత సులువుగా ఈ తగువులు తేలిపోతాయంటే ఎవరికీ విశ్వాసం కలగదు. రాష్ట్రం ప్రత్యేకించబడితే తెలుగు - తమిళవైషమ్యాల తీవ్రత కాంగ్రెస్ పక్షంలో కొంత తగ్గవచ్చును. చెన్నపట్నం గురించీ చెంగల్పట్టులోని ఉత్తరతాలూకాలను గురించీ అటో ఇటో తేలేవరకూ వైషమ్యాలు నశించవు. ఆ తరవాతనైనా నశిస్తాయనే నమ్మకం పూర్తిగా లేదు. పోగా మిగతా గ్రూప్ కక్షలూ, వ్యక్తిగతవైషమ్యాలూ అలాగే ఉండిపోతాయి. స్వాతంత్ర్యం లభించినది మొదలూ ఇప్పటివరకూ కాంగ్రెస్ వాదుల మనోభావాలలో వచ్చిన మార్పులే ఈ కక్షలకు హేతువు. అసలు ఈ తగువులు దేశమంతటా అన్నిరాష్ట్రాలలోనూ కాంగ్రెస్‌వాదుల్లో విపరీతంగా వ్యాపించాయి. పండిట్ నెహ్రూ చెప్పినట్లు కాంగ్రెస్‌సంస్థకి కొత్త జీవశక్తి పొయ్యవలసిన అవసరం ఉంది. కలకత్తాలో కాంగ్రెస్‌కి కలిగిన పరాజయం అల్పవిషయమని తలచడం పొరపాటని పండిట్ నెహ్రూ చెప్పారు. స్వాతంత్ర్యార్జన అనంతరం కాంగ్రెస్‌వాదులు ప్రజాసామాన్యానికి దూరమైపోయినారు. కేవలం కక్షలే ప్రధానంగా ఎంచి ప్రజాసేవని విస్మరిస్తున్న కాంగ్రెసువాదుల్ని పండిట్ నెహ్రూ మందలించారు. దోషులైనవారిని కాంగ్రెస్ సంస్థనుంచి వెళ్లగొట్ట బూనుకోవడం కంటె వారిని మైత్రివల్ల సంస్కరించవలసింది, గాంధీజీ సానునయవిధానాన్ని ప్రేమ ప్రబోధాన్ని కాంగ్రెస్‌నాయకులు విస్మరించారు. కక్షలతో విరోధాలతో క్రమక్రమంగా కాంగ్రెస్ సంస్థని భగ్నం చేసేకంటె, గౌరవంగా సంస్థని రద్దుపరచడం మంచిదని చెప్పారు. ప్రజాదరాన్ని నిలుపుకోలేని ప్రభుత్వం రాజీనామా ఇవ్వడం మంచిదన్నారు.

అయితే కాంగ్రెస్ లేనిపక్షంలో ప్రభుత్వం నడపగల పార్టీ మరొకటి లేదు. దీనివల్ల దేశం అరాచకంపాలవుతుంది. స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలంటే కాంగ్రెస్ నాయకులు సకాలంలో మేలుకొని కాంగ్రెస్‌సంస్థని పునరుజ్జీవిత మొనర్చాలి.

కాంగ్రెస్ కలకత్తాలో పరాజయం సంపాదించిందంటే అక్కడ ప్రజలకి కాంగ్రెస్ కార్యవర్గం పట్లనో, కాంగ్రెస్ ప్రభుత్వంపట్లనో తీవ్ర అసంతృప్తి కలిగిఉండాలి. కాంగ్రెస్ సంస్థపట్ల దేశంలో బహుజనాభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోవలసిన అవసరం ఉందని పండిట్ నెహ్రూ చెప్పారు. పదిహేను మాసాల్లో ఎలాగూ దేశమంతటా శాసనసభలకు ఎన్నికలు జరుగుతాయి. కాని ఈలోగా కాంగ్రెస్‌పట్ల, కాంగ్రెస్‌ప్రభుత్వాలపట్ల, కాంగ్రెస్‌పరిపాలనావిధానాలపట్ల ప్రజల అభిప్రాయం ఎలా ఉందో తెలుసుకోగలరని పండిట్ నెహ్రూ చెప్పారు.

శాసనసభ:

చెన్నరాష్ట్ర శాసనసభ ఈ వారం సమావేశంలో సినిమాప్రదర్శనాలపైన పన్ను, మోటారు రవానాలపైన పన్ను విధించే శాసనాల్ని ఆమోదించింది. పంట చెరువుల మరమ్మతుల శాసనం, పంచదార ఫాక్టరీల శాసనం ఆమోదించబడినాయి. పత్రికాప్రకటనల ఆదాయంపై పన్ను విధించే శాసనాన్ని, పంచాయతీ సంస్కరణల శాసనాన్నీ శాసనసభలో ప్రతిపాదించడానికి శాసనసభల కాంగ్రెస్‌పక్షం అనుమతి నిచ్చింది. సినీమా ప్రదర్శనాలపై పన్ను రేట్లు సెలక్టుకమిటీ కొంత తగ్గించింది. బస్సు రవానారేట్లు నూటికి 50 వంతులు పెంచవచ్చునని శాసనంలో అవకాశ మివ్వబడింది. ఇప్పటికే రాష్ట్రంలో బస్సు రవానా చాలా దుస్థితిలో ఉంది. దీనివల్ల ప్రయాణీకుల ఇబ్బందులు మితిమీరుతాయి.

కృష్ణాజిల్లాలోనూ, సమీపజిల్లాల్లోనూ కమ్యూనిస్టు ఉపద్రవంగురించి విరామతీర్మానం ప్రతిపాదించబడింది. ప్రభుత్వాన్ని నిందించడం తమ ఉద్దేశం కాదని ప్రతిపాదకులు శ్రీ వెన్నెలకంటి రాఘవయ్యగారు చెప్పారు. దీనివల్ల కమ్యూనిస్టు సమస్యకి లేని ప్రాధాన్యం కల్పించినట్లవుతుందని మంత్రి మాధవమీనన్‌గారన్నారు. సభ్యులు తమతమ జిల్లాల్లో కమ్యూనిస్టుల చర్యల్ని గురించి, వారి బెదరింపులు గురించి తెలిపారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకో గలిగితే ఉపద్రవాన్ని అణిచివెయ్యవచ్చునని సభ్యులన్నారు. పరిస్థితి కొందరు తలిచినంత ప్రమాదంగా లేదని సభ్యులు తేల్చుకున్నారు. కాంగ్రెస్‌వాదులు ప్రజాసామాన్యానికి సన్నిహితంగా ఉండి సేవచేస్తే, కమ్యూనిజం వ్యాపించదనే అభిప్రాయం స్థిరపడింది.

వాణిజ్య సుంకం:

వాణిజ్య సుంకం విధింపుగురించి శాసనసభ ప్రశ్నల కాలంలో సభ్యులు ప్రభుత్వాన్ని చాలా ప్రశ్న లడిగారు. అమ్మకపు పన్ను కొనే వారిదగ్గ వసూలు చెయ్యాలని శాసనం విధించడం లేదని మంత్రి గోపాలరెడ్డిగారు చెప్పారు. అమ్మకపు పన్నుపరంగా వర్తకులు వసూలుచేసే ధనాన్నికూడా వారి అమ్మకంవిలువలో చేర్చి, ఆ మొత్తంపైనే అమ్మకపుపన్ను విధిస్తారని చెప్పారు. ప్రభుత్వం వర్తకులకు అమ్మకపుపన్ను విధిస్తే, వర్తకులు దాన్ని కొనుబడిపన్నుగా వసూలు చేస్తున్నారు. ఈ పద్ధతివల్ల అమ్మకపు పన్నుపైన అమ్మకపుపన్ను విధించినట్లు కావడం లేదా? అని కొందరు ప్రశ్నించారు. ఏది ఏమైనా, వర్తకులు కొనుగోలుదారులవద్దనుంచి అమ్మకపు పన్ను పేరుతో అదనపు ?ర వసూలు చెయ్యకుండా ప్రభుత్వం నిర్బంధించలేదని తెలిసింది.

గాంధీ హత్యకేసు:

గాంధీ హత్యకేసులో శిక్షితుల అప్పీలుపైన తూర్పుపంజాబ్ హైకోర్టు తీర్పు నిచ్చింది. డా॥ పర్చూరే, శంకరకిష్టయ్యలని విడిచిపెట్టాలని ఉత్తరువు చేశారు. డా॥ పర్చూరే గ్వాలియర్ పోలీసులవద్ద చేసిన నేరాంగీకారప్రకటన విశ్వాసయోగ్యంగా లేదని న్యాయమూర్తులు నిర్ణయించినందువల్ల డా॥ పర్చూరేపై దోషం నిరూపణ కాలేదు. శంకర కిష్టయ్య స్వయంగా కుట్రలో పాల్గొననందువల్ల అతని దోషం లేదని తీర్పు చెప్పారు. మిగతావారందరిపైనా శిక్షలు ఖాయపరిచింది. వారిలో గాడ్సే, ఆప్టేలకు మరణశిక్ష ఖాయమయింది. గోపాల్ గాడ్సే అన్నగారివల్ల కుట్రలో పాల్గొని ఉంటారు కాబట్టి ఇంకా యువకుడైనందువల్ల క్షమార్హుడని సూచించారు. మదన్లాల్ కూడా యువకుడే అయినందువల్ల క్షమార్హుడేనని ముగ్గురు న్యాయమూర్తులలో ఒకరు తమ అభిప్రాయం తెలిపారు. మిగతా ఇద్దరూ వీరి అభిప్రాయంతో ఏకీభవించలేదు.

కాశ్మీరం:

కాశ్మీరసమస్యలో భారత పాకిస్తాన్ ప్రభుత్వాలమధ్య సంధి ఒడంబడిక కుదిరే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి కార్యదర్శి ట్రిగ్వేలై, కాశ్మీర్ కమిషన్ సభ్యుడు డా॥ ఆల్ఫ్రెడో లొజానో ఇద్దరూ తమ అభిప్రాయాలు ప్రకటించారు. కమిషన్ ప్రతిపాదనల్ని భారత ప్రభుత్వం అంగీకరించలేదని అందరికీ తెలిసినదే.

పాకిస్తాన్ ప్రభుత్వం బేషరతుగా అంగీకరించిందో, కొన్ని మరతులతో అంగీకరించిందో సరిగ్గా తెలియరావడంలేదు. వారి ప్రతిపాదనల్లో ప్రధానాంశాలనే భారతప్రభుత్వం అంగీకరించకపోయినా డా॥ లొజానో సమాధానం సాధించడం వీలేనని ప్రకటించాడు. ఆజాద్ కాశ్మీర్‌లో సైనికులందర్నీ నిరాయుధుల్ని చెయ్యాలనీ, అక్కడ పరిపాలనలోగాని, జనవాక్యనిర్ధారణలోగాని పాకిస్తాన్‌కు ఎట్టి ప్రమేయం ఉండరాదని భారతప్రభుత్వం పట్టుదల. అయినా డా॥ లొజానో పై అభిప్రాయం వెలిబుచ్చాడు. దీనికి తోడు కాశ్మీర్‌సమస్యను భద్రతామండలి చర్చకు ఒప్పగించలేదనే వార్త కూడా వచ్చింది. వీనినిబట్టి ఒక అనుమానం తోచకమానదు.

కాశ్మీర్ కమిషన్ ప్రతిపాదనల్ని పాకిస్తాన్ పూర్తిగా అంగీకరించిఉండాలి. రెండు పక్షాలూ ఒకరినొకరు పూర్తిగా అర్థం చేసుకోగలిగినట్లయితే, సమాధానంకోసం చిత్తశుద్ధితో కృషి చేస్తే, అప్పుడు ఒకపక్షం అంగీకరించిన ప్రతిపాదనల్ని స్వల్పంగా మార్పుచేసి రెండోపక్షం చేత అంగీకరింపచేయవచ్చునని మధ్యవర్తులు

(20 వ పేజీ చూడుడు)

హైదరాబాదులో తెలుగువిద్యా ఉద్యమం

దాదాపు నలభైఏళ్ళ క్రిందట—అంటే 1910 సంవత్సరంలో—తెలుగు, మరాఠీ, కన్నడ భాషల బోధనకోసం, వివేకవర్ధనీ పాఠశాలను హైద్రాబాదులో స్థాపించారు. ఆ నాడు స్థానికభాషలకు ఆలనా పాలనా లేకపోయింది. ఆ కొరత తీర్చేటందుకు ఒక పాఠశాలను స్థాపించాలని, పెద్దలు పట్టుపట్టి వివేకవర్ధనిని ప్రారంభించారు. యథాశక్తిని, మూడు భాషల వారూ ద్రవ్యసహాయం చేశారు. హైద్రాబాదుకు దూరంలో ఉన్న అలంపూరు తాలూకా వారు పూనుకుని ఆ పాఠశాల నిర్మాణానికోసం పాతిక వేలు వసూలు చేసి ఇచ్చారంటే, ఆనాడు వారు తమతమ భాషల్లో తమ పిల్లలకు చదువు చెప్పించాలని ఎంతగా తపించిపోయారో గ్రహించవచ్చు. అయితే ఏం—తెలుగువారు తెలుగు చదువుకోసం ఆరాటబడ్డారే కాని, మెల్లి మెల్లిగా వివేకవర్ధని మహారాష్ట్ర పాఠశాలగా మారిపోతుంటే, నిస్సహాయులై ఊరుకొని పోవాల్సి వచ్చింది. క్రమేపి, మహారాష్ట్ర ధనికులు వివేకవర్ధనిని సంపూర్ణంగా తమదాన్ని చేసుకున్నారు.

డా॥ జయకర్ అధ్యక్షత క్రింద హైదరాబాదులో 1923 లో ఒక హిందూ సాంఘిక సంస్కరణల మహాసభ జరిగింది. అందులో హైదరాబాదు పెద్దలంతా పాల్గొన్నారు. సభలో జోరుగా ఉపన్యాసాలు సాగిపోతా ఉన్నాయి. ఇంతలో అలంపూరు వెంకటరామా రావుగారనే తెలుగుపెద్ద లేచి తెలుగులో ఉపన్యసింప ప్రారంభించాడు. ఆ ఉపన్యాసాన్ని ఆంధ్రేతరులు వినకపోగా, తెలుగులో మాట్లాడటం కూడ దని ప్రకటించారు. తెలుగువారు బయటకొచ్చేశారు. అధికారుల్లో, అనధికారుల్లో కూడిన ఒక ఆంధ్రజన సంఘాన్ని రాజగోపాలరెడ్డి అధ్యక్షత క్రింద స్థాపించారు. ఆ నాటినుంచీ తెలుగు గ్రంథాలయాల్ని, పాఠశాలల్ని పెట్టటానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అంతకుముందే—1093 లో కొమర్రాజు లక్ష్మణరావుగారు కృష్ణదేవరాయ ఆంధ్రభాషానిలయాన్ని స్థాపించారు. తర్వాత తర్వాత తెలుగు గ్రంథాలయాలు అక్కడక్కడా ప్రారంభమయ్యాయి. బాలసరస్వతీ భాషానిలయం 1922 లో, తర్వాత వేమన గ్రంథాలయం మొదలైనవి అనేకం, జన్మించాయి. అనాటికి అదే గొప్ప. 1925లో బాలసరస్వతీ భాషా నిలయానికి కాశీనాథుని నాగేశ్వర రావుగారు రాగా, గొప్ప సన్మానం చేశారు. అయినా పాఠశాలలు పెట్టటం అంత తేలికయిన పనికాదు. అందు ప్రభుత్వపు అనుమతి కావాల.

జోగిపేటలో 1929లో ప్రథమ ఆంధ్ర మహాసభ జరిగింది. 1930లో దేవర కొండలో ద్వితీయ మహాసభ. ఆ సంవత్సరం ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర మహాసభలో లీనం అయిపోయింది. ఆ మహాసభలో ఆంధ్రవిద్యార్థుల కొరకు ఒక హైస్కూలును స్థాపించాలని తీర్మానం చేశారు. అప్పుడు "ఏక్సెల్సియర్ హైస్కూల్"ను తెలుగువారు అభివృద్ధి చేసుకోవచ్చని ప్రభుత్వం సూచించింది. రాజా బహదూర్ వెంకట్రామా రెడ్డి, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డిగారలు, మరికొందరు కలసి ఆస్కూలును కొంతకాలం తెలుగు విద్యార్థులకు పనికి వచ్చేటట్లు అభివృద్ధి చేశారు.

మొగ పిల్లలకే తగిన సౌకర్యాలు లేవు. ఆడపిల్లల సంగతి చెప్పక్కర్లేదు. పూనాలో ఉండే కార్వే విశ్వవిద్యాలయపు పరీక్షలకు బాలికలను తయారు చేసే చిన్న విద్యాసంస్థ ఒక్కటే ఉండేది. దానికి భవనం లేదు. శ్రీ వినాయకరావు విద్యాలంకారుకు కాచిగూడలో కొంత ఖాళీస్థలం ఉంటే, దాన్ని బాలికావిద్యాలయానికి దానం చేయమని శ్రీ మాడపాటి హనుమంతరావు అర్థించారు. వినాయకరావుగారు ఒప్పుకున్నారు. వెంటనే భవన నిర్మాణానికి 30 వేల రూపాయిల విరాళాలు వసూలయ్యాయి. కాని వినాయక రావు గారు, ఆ విద్యాలయానికి తమ తండ్రిగారి పేరు పెట్టాలని పట్టు పట్టటంతో, తెలుగు పెద్దలు నారాయణగూడాలో స్థలాన్ని కొని ఆంధ్ర బాలికా పాఠశాలను స్థాపించారు. ప్రభుత్వాన్ని ఆశ్రయించి ప్రైమరీ సెక్షన్‌కు వందరూపాయల గ్రాంటునకూడా సంపాదించారు. కొన్నాళ్లకు మిడిల్ స్కూలువరకూ ప్రభుత్వం గుర్తించి గ్రాంటిచ్చింది కాని ఉర్దూబోధ ఆ స్కూలులో ఉంటేనే గ్రాంటునిస్తామన్నారు ప్రభుత్వం వారు. ఉర్దూ వద్దంటే గ్రాంటు రాదు కాబట్టి, అందుకు ఒప్పుకొని, ఒక ఉర్దూ ఉపాధ్యాయుని నియమించుకున్నారు. 1944 లో ఆజంగారు విద్యాశాఖ డైరక్టరుగా వచ్చిన తర్వాత బాలికలకు ఉర్దూ నిర్బంధంగా ఉండక్కర్లేదని ఒప్పుకొని పాఠశాల గ్రాంటును మూడువందలరూపాయలకు పెంచాడు.

ఈలోగా ఎక్సెల్సియర్ స్కూలుకూడా సంపూర్ణంగా మహారాష్ట్రుల చేతుల్లోకి పోయింది. తెలుగు బోధకూ స్కూల్లో ప్రాముఖ్యత సన్నగిల్లిపోయింది. అప్పుడు, జూన్ 1944 లో ఆంధ్ర విద్యాలయ బాలుర ఉన్నతపాఠశాల స్థాపితమయింది.

జనానా విశ్వ విద్యాలయానికి విరాళాన్ని పోగు చెయ్యడానికి డా॥ రాధాకృష్ణ 1944 లో హైద్రాబాదు కొచ్చాడు. అనేకులు లక్షలకు లక్షలిచ్చారు. వరంగల్‌లో వుండే శ్రీ చందా కాంతయ్య, ఒక లక్షరూపాయల్ని డా॥ రాధాకృష్ణకు ఇవ్వ సంకల్పించాడు. కాని శ్రీ యస్. కె. రావు ఆడబ్బుతో వరంగల్లులో ఒక ఉన్నత పాఠశాలను పెట్టమని కాంతయ్యగారిని కోరాడు. కాంతయ్యగారు రావుగారి కోర్కెను మన్నించి వరంగల్లులో ఆంధ్ర విద్యాభివర్ధనీ పాఠశాలను స్థాపించటానికి ఆ ధనాన్ని ఇచ్చేశారు. అది ప్రాథమిక పాఠశాల ఉండేది. దాన్ని ఎక్కువ సరిగా పని చేయించక పోవటం చూచి, రాజా నేడు చక్కటి హైస్కూలుగా అభివృద్ధి చెందింది.

ఇది ఇట్లా ఉండగా జనగామ దగ్గర ఒక క్రైస్తవ మిషనరీ పాఠశాల ఉండేది. అందులో వెంకటరామశాస్త్రిగారనే ఉపాధ్యాయుడుండేవారు. మిషనరీలుచేసే తెలుగు వ్యతిరేక ప్రచారం ఆయనకు గిట్టక, ఊళ్లో ఒకరాత్రి పాఠశాలను పెట్టుకున్నాడు. అది రానురాను పగటిపాఠశాలగా కూడా తయారైంది. 1945 లో జనగామలోని— శ్రీ పెద్దనారాయణ మొదలైన పెద్దల సహాయంతో, అదే ఆంధ్రభాషాభివర్ధని మిడిల్ స్కూలుగా తయారైంది.

ఇదికాక— హైద్రాబాదు నగరంలో షాలిబండా ప్రాంతంలో "రిఫాయిఆం" అనే చిన్న బహద్దూర్ వెంకట్రామా రెడ్డిగారు, ప్రభుత్వ సుమతితో 1930లో తమ పోషణ క్రిందకు తీసుకున్నారు. ఇది ప్రస్తుతం ఈ ఆంధ్రవిద్యాప్రచారానికి పనిచేస్తున్న పెద్దల పోషణలోనే ఉంది.

నగరంలో, ఇంకా— కిషన్ గంజ్‌లో సావిత్రీ కన్యాపాఠశాల అని ఉంది. దీన్ని కొందరు సాహుకార్లు— శ్రీ కొత్తూరి సీతయ్య, శ్రీ జెల్ల లక్ష్మయ్య మొదలైనవారు నడుపుతున్నారు. సెల్ఫ్ గూడాలో సరస్వతీ కన్యాలయమని ప్రాథమికపాఠశాల ఉంది. సికింద్రాబాదులో బుర్గుల విశ్వనాథం ప్రాథమికపాఠశాల అని బాలికల పాఠశాల ఉంది.

అదిలాబాదులో సత్యనారాయణ గారనే పెద్దమనిషి నలభైవేల రూపాయలిచ్చి, ఒక మిడిల్ స్కూలును— బాలికలకు— నిర్మించారు. దీనికి సర్ మీర్జా ఇస్మాయిల్ ప్రారంభోత్సవం చేసి— ఆ మర్నాడే తిరిగి హైద్రాబాదుకు రాకుండా బెంగుళూరుకు వెళ్లారు.

ఇట్లాగే ఖమ్మంలో ఒకటి, నల్గొండలో మరొకటి బాలికల పాఠశాలలు—మిడిల్ స్కూళ్లు— ఉన్నాయి.

ఇంతే తెలుగు చదువుకు వీలు. మరెక్కడా తెలుగు బోధించే పాఠశాలలు లేవు. ప్రభుత్వం ఒక్క తెలుగు పాఠశాలనుకూడా పెట్టలేదు. పైగా తెలుగు బాలికలు చదువుకునే బడుకు, ఇంతవరకు ప్రభుత్వంఎక్కడా స్కూళ్లను పెట్టిన పాపాన పోలేదు.

నారాయణగూడా —ఆంధ్రబాలికా పాఠశాలలో 1945–48దాకా ఉపాధ్యాయినులకు శిక్షణ నిచ్చే ఏర్పాటులు చేస్తే, అప్పుడు, ఇప్పుడు, ఇన్‌స్పెక్ట్రెస్‌గా ఉన్న అక్రంబీగమ్ ఆ శిక్షణ తరగతుల్ని బలవంతానా ఎత్తేయించింది.

హైదరాబాదు సంస్థానంలో ఇంతవరకు ఉర్దూను కాదని, తెలుగు స్కూలు పెట్టటం చాలా కష్టమైన పని; రాజద్రోహం. కాని ఎంత దేశభక్తి ఉన్నప్పటికి కొందరు పెద్దలు, అధికారుల్ని ఆశ్రయించి, చేతనైనంతవరకు డబ్బు సంపాదించి తెలుగు స్కూళ్లు పెట్టించారు. ఇంతకంటే పెద్ద నిర్మాణ కార్యక్రమమేముంది?

దేశాభిమానం నాకు కల దని వట్టి గొప్పలు చెప్పుకోకోయ్, పూని ఏదైనాను ఒక మేల్ కూర్చి జనులకు చూపవోయ్ అని గురజాడ అప్పారావుగారు అన్న సూక్తిప్రకారం ప్రజాసేవకుల మనుకునే వారి ప్రవర్తనలు రూపొందిన నాడే దేశానికి ముక్తి.

నేడు సంస్థానంలో విద్యా సంస్థలు చాలా తక్కువ. ఎక్కడికక్కడే పెద్దల మనుకునే వారు పూనికొని పాఠశాలల్ని స్థాపించటానికి పూనుకోటం అత్యవసరం. అనేకులు విద్యావ్యాప్తికి ధనసహాయం చేశారు. కాని అదంతా పట్టణాల్లో మాత్రమే జరిగింది. ప్రజాసేవ చేయ పూనకోటమే కష్టమయిన రోజుల్లో తెలుగు పాఠశాలలని పెట్టించి, నిర్వహించిన పెద్దలు, ఈనాడుకూడా ఇతోధికంగా విద్యావ్యాప్తికి కృషి చేస్తారు. కాని ఇంకా అనేకులు పూనుకొని పనిచేస్తే సక్రమ ప్రజాసేవా సాంప్రదాయాలు వ్యాప్తిలోకి రావటమే కాక, దేశంకూడా చాలా అభివృద్ధి చెందుతుంది.


ప్రభుత్వమే ఈ పనికి పూనుకోవాలంటే— అసలు ప్రభుత్వానికి దేశంలో ఏ ప్రాంతంలో కూడా ఒక సునిశ్చిత అభివృద్ధి కార్యక్రమముంటూ ఉన్నట్లు కన్పించటం లేదు— కాబట్టి ప్రభుత్వమే ఎక్కువ సంఖ్యలో పాఠశాలలు పెట్టటం ఇప్పట్లో జరగదు. కాలాన్ని, ధనాన్ని వినియోగించటానికి, విద్యా ప్రచారం కంటే ఉత్కృష్టమైన పని ఏముంది? శ్రీయుతులు వెంకట్రామారెడ్డి, మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, చందా కాంతయ్య, యస్. కె. రావు, పెద్దనారాయణ అలియాబాదు సత్యనారాయణ మొదలైన పెద్దల్ని, తెలుగు స్కూళ్లు పెట్ట నానాబాధలు పడ్డవారిని స్మరించుకొని, అనేకులు తెలంగాణ వాసులువిద్యా ప్రచారం కోసం నడుం కట్టడం చాలా అవసరం.

—శ్రీ జి. కృష్ణ



భారత సైనిక ప్రతినిధివర్గము అమెరికాలో న్యూయార్కునందు యుద్ధశాస్త్రవిద్యాలయమును సందర్శించినది. అక్కడ సైనికాభివాదమును వీక్షించుచున్నారు. చిత్రములో ఎడమవైపువ ముందుగా అమెరికా సైనికాధికారి వందనము తీసుకొనుచున్నాడు. ఆయనవెనుక భారతసేన ప్రధాన సైనికోద్యోగి మేజర్ జనరల్ కల్వంత్ సింగు, ప్రక్కన భారతరక్షణశాఖాధికారి హెచ్. ఎమ్. పటేల్‌గారున్నారు.

కథానిక:



కొక్కొరొకో......

ఎక్కడో కోడి కూస్తూంది.

గాఢనిద్రలో ఉన్నా, కన్నుకు మెలుకువ వచ్చింది కోడికూత వినడంతోనే. అంచు దగ్గర చిరిగిపోయిన నూలు రగ్గు ముసుగు తీసి, ఎడం చేతితో కుడిచేతి వ్రేళ్లతో "శ్రీరాములవారి సహాయం" అని రాసుకుని, మూడుసార్లు కళ్లు కద్దుకుని లేచబోయిన కన్నా చెవుల్లో మళ్లీ "కొక్కొరొకో." అన్న ప్రకృతి గడియారం తాలూకు హెచ్చరిక అ తెల్లవారు జాము గాలుల్లో తేలివచ్చి పడడంతో లేవాలని శరీరం చేసే అనుకోని (*Reflexive*) ప్రయత్నానికి అడ్డువచ్చి పడింది—మనస్సు జోరుగా పోయే దీపంలేని సైకిలుకు నడిరోడ్డుమీద కనుపించే రైల్వే-క్రాసింగు గేటుకమ్మీల మీది ఎర్ర దీపపు వెలుగులా

ఆకోడితో సమానమైన బ్రతుకు కాతనిది! వ్యక్తిత్వం లేదూ తనకి? పౌరుష మేమయింది? మనిషి కాదూ?

అతని చేతులు మనస్సులోని కోపాన్నంతా తాము లాక్కుని, అంచుబాటులో ఉన్న నూలు రగ్గు మీదకి వారిదా చూపించి, దాన్ని (రగ్గుని) నులిపి ఉండచేసి తలక్రింద పెట్టడంలో నిమగ్నమై ఉన్నప్పుడు అతని ఆలోచనాశక్తి ఏ చెయ్యలేదు గాని, ఆపని పూర్తయి కోపం యథాస్థానం చేరేటప్పటి కది మళ్లీ కదిలిక మొదలు పెట్టింది.

బంత్రోతు! మనిషి కాదూ? కోడివంటి వాటా? తాను మరివాళ లేవడు రోజులా. కోడి కంటె మనస్సూ బుద్ధీ లేకపోవచ్చు కాని తనకూ అంతేనా?

నిన్న మధ్యాహ్నపు సంఘటన సినిమా బొమ్మలా మనస్సు తెరమీద నడవడం మొదలు పెట్టింది.

బాబుగారి బూట్లు పాలిష్ చేస్తున్నాడు తాను. బాబుగారింకా నిద్ర లేవలేదు. వీధి వసారాలో నుంచి చిన్న బాబుగారి నాలుగేళ్ల గొంతు "ఓహోహో పాయిరమా" అని వినవస్తూంది. మూడు గంటలైంది.

అమ్మగారి గొంతు లోపల్నుండి వినొచ్చింది. "పంచదారయిపోతుంది. కన్నా! వేగం వెళ్లి జంగమయ్యదగ్గర రొక వీశ పట్టుకురా."

ఒక బూటికి రంగు వెయ్యడం పూర్తయింది. రెండో దొక పక్కనుంచి చేతులు తుడుచుకుని లేచి పైకి వచ్చాడు తలుపు దగ్గరకు వేసి, కన్నా.

తలుపు చప్పుడు విన్న చిన్న బాబుగారు ప్రస్తుతం పావురంగా తనచేతులో కదలించ బడుతూన్న ఇటుక ముక్కను కిందకు విసిరేసి తన దగ్గరకు పరుగెత్తుకువచ్చి అన్నారు, చేతులు పట్టుకుని-నేనూ వొస్తాను, తన్నా తీతికెళ్ళవూ?

"వద్దు బాబూ! లాల్చీ లేకుండా బజారెళ్ల కూడదు"

"లాల్చీ తెత్తా నుండు అమ్మ నలిగి" అని లోపలికి పరుగెత్తారు చిన్న బాబుగారు, తలుపు తోసుకుని. తలుపు మళ్లీ దగ్గరకు లాగి తాను బజారుకు బయల్దేరాడు.

జంగమయ్య అడిగాడు. "మీ బాబుగారిక్కి జీతా లింకా రాలేదేంటి? సెక్క సాలా యివ్వాలి".

"జీతా లుచ్చుకుంటే ఇచ్చెయ్యరూ? నూప గైజరుగ్గోగం ఒదిలేసి పారిపోతా రనుకున్నా వేంటి?"

"ఎంత కోప మొచ్చిందిరో రీడికి డబ్బడుగు తేను! ఈశెలూ రెండీశెలూ సెక్కని అన్నీ ఒట్టికెల్లడం, చొమ్మడుగుతేను ఉకురోషం అంటూ పంచదార పొట్లాం కట్టి తనచేతి కిచ్చాడు జంగమయ్య. తనేమీ మాట్లాడలేదు. బాబుగారికి చెప్పి వీడి పని పట్టిద్దామన్న నిశ్చయంమటుకు మనస్సులో తయారయింది.

తోవలో ఎవరో గారడీవాడు మోళీ చేస్తున్నాడు. కుర్రాడి ఒంటికి గురద లెక్కించడం, దుప్పటి ముసుగేసి మనిషి గొంతు కోసెయ్యడం, జెంక పాతి నీళ్లు చల్లి నిమిషంలో మామిడి మొక్క మొలిపించడం, పేకముక్కలు గోలుసులా తిప్పడం — మహా బాగుంది. ఒళ్లు తెలియకుండా నిలబడ్డాడు తాను ఆనందిస్తూ. తాను మాత్రం మనిషి కాదూ? బాబుగారు డబ్బున్నవాడు గాబట్టి సినిమాలూ నాటకాలూ చూస్తారు; తా నిలాటివి చూస్తే తప్పేమిటి?

అంతా అయిపోయి మోళీవాడు నల్లటి

[శ్రీ భట్టిప్రోలు కృష్ణమూర్తి]

చిప్పతో డబ్బులు దండుకుంటున్నప్పుడు తాను మెల్లిగా జారిపోయి బాబుగారిల్లు చేరుకున్నాడు. బాబుగారు అరుగుమీద కూర్చుని ఉన్నారు ఒట్టలు వేసుకుని, ధుమధుమలాడే మొహంతో. చిన్న బాబుగారు వెక్కి వెక్కి ఏడుస్తున్నారు స్తంభాని కానుకుని.

బాబుగారు, "ఎంతసేపయింది నువ్వెళ్లి? స్కౌండ్రల్! ఎన్ని సార్లు చెప్పినా బుద్ధి లేదూ, వెళ్లిన పని వేగం చేసుకురావాలని? కళ్లు మరీ నెత్తి కెక్కన్నాయి!"

చిన్న బాబుగారు పరుగెత్తుకుని వచ్చి ఒక్క తోపు తోసారు తనని.—"నన్ను తీతుకెల్లలే దెందుకు తన్నా? పద పోదాం" అంటూ. చేతిలోనున్న పంచదార పొట్లాం జారి క్రింద పడవలసినంత పని అయింది కాని వెంటనే ఆపుకుని లోపలికి వెళ్లాడు తాను.

అమ్మగారన్నారు: "వెళ్లిన వాడివి చంద్రుణ్ణి తీసుకుపోలేకపోయావూ? వాడి ఏడుపుతో బాబుగారు లేచిపోయి నానా చివాట్లు పెట్టారు నిన్నూ, నన్నూ. అయిన పంచదార కెళ్లిన వాడివి ఇంతసేపేం చేస్తున్నావు కన్నా? క్లబ్బు కాలస్య మయిం పోయిదని మండిపోతున్నారు బాబుగారు. సరేలే, ఆ డబ్బాలో పోసేయి పంచదార.

అమ్మగారూ బాబుగారి చివాట్లకూ చీదరింపులకూ పైవారు కారు కాని సమయం దొరికి నప్పుడల్లా తన్ను సాధించడం మటుకు మానరు! బంట్రోతంటే అందరికీ లోకువే!

తాను వీధివసారాలోనికివెళ్లడమూ, బాబుగారి గొంతు "ఫోమరి కేపట్నుంచి రానక్కర్లేదు పొ మరి, కొండ.." అని వినరావడమూ ఒకే సారి సంభవించాయి. ఎందుకో మళ్లీ యీకోపం బోధ పడక ఒక్క చచ్చిపోయిన తన కళ్లకి బాబు తన వంక పెద్దపులిలా చూస్తూ, ధూళితో కప్పబడ్డ ఎండ కాలి బూటు విసురుగా విప్పుతూండడమూ కన్పించింది. దానికి పాలిష్ చెయ్యలే దందాక, బజారునుండి తిరిగి వచ్చాక చేద్దామని తాను...

గాభరాగా ఆ బూటు విప్పుదామని ముందుకు వెళ్తూన్నప్పుడు ఒక్క సెకండు గాని తాను వంగడంలో ఆలస్యం చేసివుంటే బాబుగారు విసిరిన ఇనుప మేకుల బాటా బూటు తన మొహాన్ని వికృతం చేసిఉండేది. కాని అదృష్టవశాత్తూ ఆ దెబ్బ వెళ్లి గోడకు తగిలి గండంగు శాల మేగని సన్నపు పెళ్లొకటి ఊడి టప్‌మన్న చప్పుడుతో క్రింద పడింది.

"కళ్లు కనిపించవూ? కొండవాడివా కోదు వాడివా? తిరుపతి మంగలి క్షురంలా ఒక బూటుకే పాలిష్ జేసి ఏడ్చావేం?"

తనకు మరి ఒళ్లు తెలీలేదు. ఒక్క అదుటున గోడ దగ్గరకు వెళ్లింది తన శరీరం, అన్నాళ్లనుండి అణచబడ్డ పౌరుషం ఒక్కసారిగా తిరగబడి ముందుకు తోయగా—ఆ బూటు తీసి బాబుగారి మొహంమీదకు విసురుదామని ఇంత లోకువా బంట్రోతైతే మటుకు? తేలిపోవా లీవాళతో!

అతివిసురుగా కిందకు వంగిన తన చెయ్యి ఆ బూటును పైకి తీస్తుండగా తన మనస్సు "అదిగో, అదే మొహం! నూటిగా విసురు! నీ కేం భయంలేదు, ఊఁ, విసురూ!" అని ప్రోత్సహిస్తూన్నది. చేతి వ్రేళ్లు మాత్రం ఆ మాటలు త్రోసి పుచ్చి బూటును అతి భద్రంగా గదిలోకి తీసుకు వెళ్తూండగా, రెండో బూటు రపీమని సిమెంటు గచ్చు మీద చప్పుడు చేసింది బాబుగారి చేతిలోనుంచి విసరబడి.

మనస్సుమాత్రం ఏదో గొణుక్కోవడం మానలేదు చేతులు మటుకు నైపుణ్యం నిండిన కదలికల్తో పాలిష్ చెయ్యడం మానలేదు.

పాలిష్‌డబ్బీ గూటి నొక్కుతున్నప్పు డందు మీది పాముబొమ్మ కదిలినట్లనిపించింది— కాని అది తన్నేమీ చెయ్యలేదు, ఇంత నీరసపు బ్రతుకును కాటు వెయ్యడానికి అసహ్య పడిందేమో!

పరధ్యానంగా ఉన్న తన మనస్సుకి బాబుగారంటూన్న మాటలు వినీ వినపడనట్లు వినిపించాయి: "ఇంకొంచెం పంచదార తగలబెట్టే నీ ఫట్టింటిసొమ్ము పోతుందా? చప్పగా ఏడుస్తూంది!"

అమ్మగారి గొంతు "వేశాను, అడుగు నుండి పోయిందో ఏమిటో! కలుపుతా నుండండి"

బూటు పట్టుకువెళ్లి రెండో బూటుతో జత పరిచి, ఒక్కసారి దులిపి బాబుగారి కాళ్లదగ్గి రుంచాడు తాను వాటిని. అప్పటికిమటుకు మళ్లీ తనకు చివాట్లు రాకుండా ఆ పెదవుల నాపి సాహాయ్యం చేసింది కాఫీ.

అమ్మగారు తనతో అన్నారు: "చిన్న బాబుకు మొహం కడిగెయ్ తీసుకెళ్లి."

రానని మారాముచేస్తూన్న చిన్న బాబుగార్ని లాక్కునివెళ్లి మొహం రుద్దేటప్పుడు తన చేతిలోంచి జారి కిందపడింది వైట్‌రోజు సబ్బు. మనస్సు దెప్పిపొడిచింది: "కొద్దిగా గట్టిగా నొక్కితే సబ్బులాటి నిర్జీవపదార్థమే తిరగపడింది కాని, జీవంఉన్న నీకుమటుకు లేదామాత్రం ధైర్యం!" అని. చేతనైన వివిధపు తిట్లతోనూ సంభావించుకొన్నాడు తన్నుతానే.

"కొక్కొరొకో...కో—" మళ్లీ కూస్తున్నది కోడి. ఇరాకిప్పుకన్నాల్లోనుండి అంతకు ముందు నల్లగాఉన్న ఆకాశం తెల్లతెల్లగా కనబడుతూ తన మనసు తెరమీది సినీమాబొమ్మల నీడల్ని కూడా తెల్లవారజేశాయి.

గంగిగొంతు చల్లగా వినిపించింది: "ఇంకా నెగవేటి మావా? సుక్కలన్నీ మాకిన పోతుండాయి" "లేగ్దు—మరివాళ లేగ్దు" అని తన మనస్సు ప్రపంచాన్నే ధిక్కరించే ధోరణిలో తన శరీరాన్ని జ్ఞాపిస్తున్నది.

లేచి కూర్చుంది కన్నా శరీరం మంచంమీద. మనస్సు ప్రశ్నించింది: "మరి వెళ్లకు న్నుగతేమీ నీకు? ఈ ఛండాలపుద్యోగం చెయ్యకపోతే చచ్చిపోతావా?"

గంగిచల్లటిగొంతు పలుకుతున్నది: "నీల్లు కెల్తుండాను నెసుమావా! దొంబందంమీ దెట్టి నాను పండుంపుడక."

కాలకృత్యాలు నెరవేరుస్తున్నంతసేపూ మన స్సెదో గొణుగుతూనే ఉంది. చోడంబలి తాగుతున్నప్పుడు రాజీపడ్డాయి చివరకు మనసూ, శరీరమూ. తాను వెళ్తా డాఖరుసారిగా అక్కడికి; చెప్పేస్తాడు మరివాళ నుంచీ పనిలోకి రానని నిష్కర్షగా.

అయితే బాబుగారిదగ్గిర అడ్వాన్సుగా లోగడ పుచ్చుకున్న ఆరు రూపాయల సంగతి? ఎలా గేమిటి, తన చెవులకి కమ్మలున్నాయి గబూ, తాకట్టుపెట్టే ఆమాత్రం డబ్బు రాదూ?

మనస్సు ఒప్పుకుంది.

బయలుదేరాడు తాను. తోవలో షరాబు దగ్గిర కమ్మలుంచి ఎనిమిది రూపాయలు పుచ్చుకున్నాడు. డబ్బు లెక్కపెట్తూన్నప్పుడు పక్కింట్లో గడియారం ఎనిమిది గంటలు కొట్టింది. ఉలికిపడ్డాడు కన్నా. "అమ్మో—ఎనిమిదైంది, బాబుగారు దెబ్బలాడారు!" మనస్సు నవ్వింది: —"మరేం బాబుగారు? ఈ వేళనుంచీ నీ కేమీ సంబంధం లేదు బాబుగారి ఆగ్రహానుగ్రహాల్తో."

రోడ్డుమీదికి వచ్చాడు కన్నా రాతిసింహాలు కాపలాకాస్తున్న మహాబఇంటి మెట్లు దిగి. మలుపు తిరిగే చోట రంగన్న కిల్లీ దుకాణం దగ్గరకు వెళ్లడమూ బాబుగారికోసం విల్సు పెట్టెన్గి రెండు మిరాకిల్లీలూ పుచ్చుకోవడమూ అతని కాళ్లకూ చేతికీ నోటికీతప్ప, మనస్సుకు తెలియనే తెలియదు. వెళ్లడంతోనే బాబుగారితో అనవలసిన మాటలు ఒక వరసలో సరదడంలో నిమగ్నమై ఉంది మనస్సు.

అరుగుమీద కుర్చీలో కూర్చుని కాఫి తాగుతూన్న బాబుగారు అన్నారు తన్ను చూసి: "దొరగారిప్పుడే నిద్ర లేచారేమిటి? తప్ప తాగి నిద్రబోతున్నారు కాబోలు అఖరుసారి చెప్తున్నాను, ఇంకోమారిలా ఆలస్యంగా వస్తే నీళ్లధారే నీ బంట్రోతుగిరీ!"

ఒక వరసలో అల్లిన ధిక్కారపు మాటల తాడును అందిస్తూ మనస్సు తొందరపెట్టింది, ప్రోత్సాహ మిచ్చింది, ముందుకు తోసింది.— కాని, నోటికీ మనస్సుకీలంకెగా ఉన్న నరాలు మరి పనిచేశాయి కావు. సిగరెట్లూ కిల్లీలూ కుర్చీ మీద పెట్తూండగా ఎవరో అన్నారు తన చెవుల్లో రహస్యంగా:

"ఈ రోజుల్లో ఇటువంటుద్యోగం దొరకడం కష్టం—పాతిక రూపాయల జీతం, బేటా డబ్బులూ, పైగా ఏదో ఆమాత్ర మీ మాత్రపు ఖుస్సీ.....ఎవ డిస్తా డిది వదులుకుంటే?"


ఎనిమిది రూపాయలు లెక్కపెట్తూ మనా బన్నాడు ఆవేళ సాయంత్రం "ఒక రోజయినా నెల తాలూకు వడ్డీ రూపాయ కర్ధణా లెక్కనిచ్చెయ్యాల్సిందే!"

మెట్లు దిగుతున్నప్పుడు పళ్లికిలిస్తూ రాతి సింహం కన్నాను వెక్కిరించింది. "నీ పౌరుషం ఖరీదు పావలా!" అని.




విమానాలనుంచి దిగివచ్చిన ప్రయాణీకులు విశ్రాంతి తీసుకునే హాలులో, విమానాశ్రయోద్యోగులు విదేశాలనుంచి వచ్చేవా రనుసరించవలసిన విధులను ప్రయాణీకులకు బోధపరుస్తారు.

లండన్‌లోని విమానయాన కేంద్రం




విమానాశ్రయానికొద్దనచ్చే, పోయే విమానాలగురించి, ఏ
ప్పుడే విమానాలు వచ్చేదీ వివరాలన్నీ ప్రయాణీకుల




విమానాశ్రయాన్ని సూచించే పటం: ఇందులో విమానాల రాకపోకలు కిరణాలద్వారా చూడవచ్చును. ఇక్కడ చూసి దానిప్రకారం అవసరాన్నిబట్టి ఏ విమానం ఎక్కడ దిగాలో, ఏది ఎక్కడనుంచి బయలుదేరాలో నిర్ణయిస్తారు.



రాడార్ సహాయంతో విమానం ఆకాశంలో ఎక్కడున్నదో చూ
దిగాలో రేడియోద్వారా మానికునికి






విమానాశ్రయంలో విమానం దిగగానే లారీలు నిచ్చెనలు తీసుకెళ్లి, విమానం ముందుభాగంలో ఉండే రవానా సరుకుని దించుతారు.

బ్రిటన్‌లోకెల్ల విమానయానం నిమిత్తం ఆశ్రయంగా పనిచేసే పెద్ద కేంద్రం లండన్‌లో ఉంది. ఇక్కడ 14 దేశాలనుంచి 16 విమానయానసంస్థల విమానాలు ప్రతిదినం ప్రయాణీకుల్ని తీసుకొస్తాయి. ప్రతిదినం ప్రయాణీకులు యూరప్, అమెరికా, బ్రిటిష్ డొమినియన్లనుండి వస్తారు. ప్రతిమాసం వెయ్యివిమానాలు ఇక్కడ దిగుతాయి. ఇక్కడనుంచి బయలుదేరి విదేశాలకు ప్రయాణం చేస్తాయి. 50వేలమంది ప్రయాణీకులు, ఆరులక్షలపౌనుల తపాలా, పదిలక్షల టన్నుల సరుకునీ ఈవిమానాలు రవానా చేస్తాయి. ప్రతిదినం పది పదిహేను విమానాలు దిగడానికి రాడార్లు సహాయపడతాయి. మూడు సంవత్సరాలలో ఒక్కసారి మాత్రమే ఇక్కడ ప్రమాదం సంభవించింది. ఈ విమానాశ్రయం ఇంకా వృద్ధిఅవుతోంది. ఇప్పటికి దీని నిమిత్తం 7 మిలియన్ల పౌనులు (రు. 9 కోట్ల 33 లక్షలు) వెచ్చించబడింది. మొత్తం 26 మిలియన్ల పౌనులు వెచ్చించడానికి (రు. 34 కోట్ల 67 లక్షలు) ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కేంద్రంలో విమానయానం నిమిత్తం ఏర్పాటు చెయ్యబడిన కొన్ని సౌకర్యాలు ప్రక్క చిత్రాలలో సూచించబడినాయి.

...దేశాలకు, ఎప్పుడెప్పుడు బయలుదేరేదీ, ఏ దేశాలనుంచి ...కూర్చునే హాలులో ఒక గోడపైన వ్రాయబడి ఉంటాయి.



...సే, ఆ విమానం ఎక్కడ ...స్తారు.



రవానాసుంక శాఖాధికారుల హాలులో ప్రయాణీకులుకూడా తెచ్చుకునే వస్తువు లన్నిటినీ జాగ్రత్తగా పరిశీలిస్తారు.



సమయస్ఫూర్తి

మూలం :
జోషనా దేవి

అనువాదం :
శ్రీ ఓగేటి శివరామకృష్ణ

అనేకవేల సంవత్సరాలక్రితం ఒక దేశంలో, ఒక గ్రామంలో యిరువురు ఇరుగు పొరుగువాళ్ళు, సమతోటి వాళ్లు నివసిస్తున్న విధంగానే నివసించుతూ యుండేవారు. నిజానికి వాళ్ళ కొకళ్ళయందు ఒకళ్ళకు ప్రేమ లేదు... ఉన్నా అది చాలా తక్కువ ది. అందులో ఒకడు కొంచెం ధనమున్న వాడు...కాని చాలా తెలివితక్కువ వాడు.. లోభి.. అన్న కోరికలు కల లోనే తీర్చుకొని సంతృప్తిపడేరకం... రెండవవాడు బీదవాడు.. అయినా తన జీవితాన్ని సమయస్ఫూర్తి (మాట నేర్పు) కలిగి చెప్పి, డబ్బు సంపాదించి...సంతోషంగా గడుపుకొనే వాడు. నిజంగా చెబుతున్న సంగతి— వాళ్ళు యెప్పుడు కలుసుకొన్నా సరే... చంటిపిల్లల విధంగా దెబ్బలాడుకొంటూ యుండేవారు, .. ఆనందంగా వాళ్ళు కాలం గడుపుకొంటూవుంటే, కాలం నడుస్తూంటే చివరకు, వాళ్ళు ఒక ప్రమాదమైన పరిస్థితి యేర్పడటంవల్ల.. ఆరకం జీవితానికి స్వస్తి చెప్పటం జరిగింది.

—యథాప్రకారం ఒక దినం యిరువురూ కలుసుకొన్నారు. దెబ్బలాటకు మామూలుగా సిద్ధమయ్యారు. ఎప్పుడు యీదెబ్బలాట కొంతకాలం వాదోపవాదాలతో ముగిసిపోయేది. కాని యీ మారు మాత్రం తమాషా జరిగింది... ఈ మారు వారి దెబ్బలాట యిదివరకెన్నడూ దెబ్బలాడుకోనంతటి పెద్దదయింది. చాలా పెద్దగా దెబ్బలాడుకొన్నారు.

'ఏమిటో రాజుగారి కున్నంత ధనం సంపాదించావ్. కాని ప్రయోజన మేమిటి? దమ్మిడీ ఖర్చు పెట్టవు...నీ వెంత డబ్బు సంపాదించినా...నాజీవితంలో నాసమయస్ఫూర్తిమాటలు, ప్రాణాపాయంనుంచి తప్పించుకొనటానికి సాటిరావు; ఎంత ధనం ఉంటే మాత్రం ప్రయోజనం?' అన్నాడు తెలివిగల (సమయస్ఫూర్తిగల) బీద ఆసామీ.

దానితో ధనంవున్న తెలివితక్కువ వానికి కోపం హెచ్చయిపోయింది. అందువల్ల అతడీ విధంగా అనసాగాడు: "నీవు చెప్పినమాటలు కార్యరూపాన ఋజువుచేయి చూస్తాను...నీ సమయస్ఫూర్తితో నీవు ప్రాణాలు తప్పించుకురా చూస్తాను.. నాబంగారంతో పని జరగనప్పుడు నీచేతకాని మాటలతో పని జరుగుతుందా?—ఈ విషయం మనం ఒకసారి పరీక్షకు పెట్టిచూదాం, ఏమవుతుందో!"



'సరే చూదాంగా' అన్నాడు సమయస్ఫూర్తిగల బీద ఆసామీ ...ఆవిధంగా వారిద్దరూ తమ తమ యిష్టములు తెల్పుకుంటూ ఆదేశము నేలే రాజువద్దకు వెళ్ళి, తమ యిరువురిమధ్య జరుగుచున్న దెబ్బలాటకు తీర్పు చెప్పవలసిందని కోరారు. రాజు వారిని మరో మాయదృష్టితో ఒకనిముషం చూచి యేదో వ్రాసి, దాన్ని సీలు చేసి, దాన్ని వారియెదుట పారవేసి వారితో యీవిధంగా అన్నాడు: "దీన్ని నా సోదరునివద్దకు తీసుకొని పోండి. అతడు మీతగువుకు పరిష్కారం చేయగలడు. అతడు తీర్పు చెప్పిన తరువాత తిరిగి మీ కేమయినా తగువు వచ్చినట్లయితే నేను మీ తగువు తీర్చుతాను..."

అందువల్ల మన స్నేహితు లిద్దరూ చల్లగా రాజుసోదరుడు రాజ్యమేలుతున్న ప్రదేశానికి పయనమై బయలుదేరారు. ఆ రాజువద్ద కెళ్ళి, ఆరాజునకు సీలుతో ఉన్నదాన్ని యిచ్చారు. సీలు తీసి...ఆ రాజు లోపలి విషయం పైకి యీవిధంగా చదివాడు: "ఈ తీసుకొని వచ్చినవా ళ్ళిద్దర్నీ ఒకేమారు చంపేయండి!"

మనభాగ్యవంతుడు, బీదవాడు... ఆ మాటలు వినటంతోటే తెల్లబోయి ఒకరివయిపు ఒకరు చూచుకొన్నారు. ఇరువురూగూడా ప్రస్తుతం తామున్న భయంలో ఉన్న సంగతి గుర్తించుకొని ఆలోచించసాగారు...వారిసంగతి ప్రస్తుతం నిప్పుగుండంలోనికి దుముకమన్నట్లుగా ఉంది.

ఇప్పుడు తెలివిగల బీదవాడు, తన స్నేహితుడ్ని ఒకప్రక్కకు పిల్చి తన ఒక్కని ప్రాణం, తానే...తనకున్న బంగారంతో తప్పించుకుపోకలిగితే పోవలసిందని...తన విషయం వదలివేయవలసిందని చెప్పాడు. ఆ ప్రకారంగా ప్రతీవారితోనూ ధనం చూపెస్తూ తప్పించుకుపోవాని కి ప్రయత్నం చేయసాగాడు. కాని రాజుకు రాజే అతడి ప్రార్థనను... ధనాన్నిగూడా యెవరూ ముట్టుగూడదని శాసించాడు. దానితో రాజాస్థానంలోనే యితరులుగూడా, రాజునకు ప్రతికూలంగా నడచి, అనుగ్రహం, యితడు ధనం యిస్తానన్నా యిష్టపడలేదు. ఆవిధంగా అతని ప్రయత్నం వ్యర్థమయింది.

అప్పు డతడు తెలివిగల బీదవాని వైపు తిరిగి జాలిగొలిపేటట్లుగా, భయంతో మెల్లిగా యీవిధంగా చెప్పాడు: "ఇప్పుడు నా బంగారంతో ప్రయత్నం ప్రతికూలమైంది. ఇక వరుస ప్రకారం ప్రయత్నం చేయవలసింది నువ్వు. మన యిరువురు ప్రాణాలు తప్పించుకొనిపోటంకోసం నువ్వు ప్రయత్నం చేసినట్లయితే, ఆ ప్రయత్నంలో నువ్వు నీ తెలివి నుపయోగించి, తప్పించగలిగినట్లయితే నాధనంలో సగానికి నీవు భాగస్వామి ఔతావు."

తరువాత రాజు వారిద్దరినీ ఉరితీసే ప్రదేశము వద్దకు తీసుకొనిపో అనుజ్ఞ యిచ్చాడు. కాని వారు రాజు వద్దనుంచి ముందు కార్యనిమిత్తమై తీసుకొనిపోబోయే సమయంలో.. మన తెలివిగల బీదవ్యక్తి పకపక పొట్టచెక్కలయేటట్లు నవ్వసాగాడు. ఏడవటానికిబదులుగా నవ్వుతున్న అతడ్ని రాజు చూచి... ఆ విధంగా నవ్వటానికి కారణ మేమని అతడ్ని ప్రశ్నించాడు. దానికి జవాబు యీవిధంగా వచ్చింది: "ఓ రాజా...మీరు నానవ్వుకు కారణం యేమిటో తెలుసుకోవాలని కుతూహల పడుతున్నారు. నామంచి, నా జాగ్రత్త కోసం నే నెంతో జాగ్రత్తగా ఉండటం నా కెంతఅవసరమో, మీమంచికోసం ...మీరు జాగ్రత్తగా ఉండటంఅవసరం. మీరు ఆవిధంగా కారణం అడగటం మీక్షేమంకోసమే! (యీ విధంగా చెబుతూ అతడు తన బుద్ధినిఉపయోగించటం మొదలు పెట్టాడు)... ఒకానొకప్పుడుఒక గొప్పజ్యోతిష్కుడు మా రాజుగారి ఆస్థానంలోనికి వచ్చి 'మే మిరువురం ఆ రాజ్యంలో ఉన్నంతకాలం అతనికి చాలా దురదృష్టాలున్నాయని...వారి రాజ్యంలో ఉండటం మారాజు దురదృష్టానికే కారణమని.. యీలా చెప్పినందుకు మాయిరువుర్నీ చంపవద్దని, చంపినట్లయితేని రాజ్యానికే నికూపమైనా దురదృష్టం కల్గవచ్చు. వారిద్దరిని మరే రాజుచేతనయినా చంపబడునట్లుగా చేసినట్లయితే ఒకే దెబ్బకు రెండు పక్షు లన్నట్లుగా నీవు పంపిన వాళ్ళిరువురు ఆ రాజుచేతిలో చనిపోవటం, వారిరువురూ చనిపోవటంవల్ల చెడ్డ రోజులు ఆరాజ్యానికి సంభవించటం జరుగుతాయి. వెంటనే ఆ రాజ్యం నీ చేతుల్లోకి వచ్చిపడుతుంది. అందువల్ల నామాట విని వారిద్దరినీ మరో రాజు రాజ్యానికి పంపించివెయ్యి!' అని చెప్పారు. ఆసమయంలో అదంతా విన్న మాకు అది ఊరికే హాస్యమునకన్నట్లుగా తోచింది. మమ్మల్ని మోసం చేశా డనుకొన్నాము. కాని అది అంతా యిప్పుడు నిజమైంది...అందువల్లనే

(18-వ పేజీ చూడుడు)

బొమ్మల కథ 4



భారవిభట్టు పశ్చాత్తాపం.

చి. పొణంగుపాటి సుబ్బారావు

అనగనగా ఒక వూళ్లో భవానీభట్టు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఆయనకు ఒక కుమారుడు. కుమారుని పేరు భారవిభట్టు. భారవిభట్టు చిన్నతనంలోనే సమస్తశాస్త్రములూ నేర్చుకొని గొప్ప పండితుడై మహాకవి అయి వాదనలో అందరిని ఓడించేవాడు. భారవిభట్టు గొప్పదనాన్ని గురించి లోకులందరూ పొగడి తండ్రిఅయిన భవానీభట్టు దగ్గర మెచ్చుకొనేవారు. తండ్రి అప్పుడు "మాభారవిగాడు ఏదో కుర్రతరహా చదువుకొన్నవాడు; అంతగా వాణ్ణిపొగడడ మెందుకు?" అని అందరితోనూ అనేవాడు. అందరిలోను తన్ను ఆ విధంగా తండ్రి అంటూఉంటే భారవిభట్టుకు చాలాకోపం వచ్చేది.



అందువల్ల తండ్రి తనంటే సహించలేడు ఎప్పుడూ ఇలాగే అంటాడు గాని ఎంత బాగా కవిత్వం చెప్పినా మెచ్చుకోడు. అని తల్లితో చెపుతూఉంటే ఆమె "ఒరేబాబూ, మీనాన్నగారు ఉత్తనే అంటారు గాని, నువ్వంటే ఎంతో ప్రేమరా!" అనేది. ఆమాట భారవిభట్టుకి తల కెక్కక ఈ తండ్రి ఎప్పుడూ నల్గురిలో ఇలాగే అంటున్నాడని తండ్రిని చంపెద్దామని ఒకనాటి రాత్రి పెద్ద రాతిని పట్టుకుని తల్లిదండ్రులు పడుకునే గదిలో అటకమీద కూర్చున్నాడు--కొంతరాత్రి అయిన తర్వాత ఆ బండరాతిని తండ్రి మీద పడేసిచంపేద్దామని. తల్లిదండ్రులు వచ్చి గదిలో పడుకున్నతర్వాత తల్లి దండ్రిని ఇలాగ అడిగింది: "ఏమండీ, మన భారవిభట్టుని అందరూ మెచ్చుకుంటూ ఉంటే మీకు ఇష్టంలేకపోతే ఊరుకోవాలి గాని అందరిలోనూ మనవాణ్ణి ఏమీ రానివాడంటారట!" అని. ఆమాటకు తండ్రి "ఒసే! మనవాడంటే నాకు ఎక్కడైనా ఇష్టం లేకుండా ఉంటుందే? నాకొడుకు అంత గొప్పవాడయినందుకు నేనెంతో సంతోషిస్తున్నాను. తల్లిదండ్రులు కొడుకుల్ని గొప్పతనం ఉన్నా పైకి పొగడకూడదు. నలుగురికి మల్లే పొగిడితే అల్పాయుష్యమని శాస్త్రాల్లో ఉంది. అందువల్ల అల్లా అంటున్నానుగాని లోపల సంతోషిస్తూ న్నాను" అన్నాడు.

అటకమీదనుండి ఈ మాటలు విని భారవిభట్టు చాలా చింతించి "అయ్యో! అనవసరంగా మాతండ్రిని చంపేద్దామనుకున్నాను. ఎంత తప్పు!" అని వెంటనే అటక దిగి తండ్రికాళ్ళమీద పడి తాను ఆ చేయదల్చుకొన్న పాపం గురించి చెప్పి "అజ్ఞానంవల్ల చేసినాను. క్షమించి ఈ పాపం పోవుటకొరకు తగిన శిక్ష వెయ్యవలసిం"దని తన పశ్చాత్తాపం తెలియ చేసినాడు. తండ్రి "అత్తవారింట ఉంటూ సన్నెండేళ్లు పశువులను కాసుకుంటూ కాలక్షేపం చేస్తే పాపం పోతుం"దన్నాడు. భారవిభట్టు పశ్చాత్తాపపడుతూ అత్తవారింట ఉండి పశువులనుకాస్తున్నాడు. అత్తవారింట మొదట నాలుగు రోజులే కాని ఆ తరువాత అగౌరవమే కదూ! [illegible] లేదని [illegible] తూ ఉండేవారు. భారవిభట్టుకి ఏమీ తోచలేదు. ఇల్లాగ కొన్నాళ్లు [illegible] నరికి ఒక ఉపాయం తోచింది. మహాకవి కాబట్టి ఒక శ్లోకం తాటాకుమీద వ్రాసి [illegible] దగ్గరకు వెళ్లేడు. శ్రీ [illegible] పోతే [illegible] తాటాకును [illegible] వచ్చాడు.

[illegible] మానం కలిగి ఒకనాడు పేటకు వెళ్లిన వెంటనె తిరిగివచ్చి [illegible] పుస్తకం [illegible] పెట్టి [illegible] కొన్నాడు. రాజుగారు, అనుమానం [illegible] వాణ్ణి [illegible]

[illegible] ఆ [illegible] భారవిభట్టు ఆనాడు [illegible] తాటాకు [illegible] అందులో [illegible].

"[illegible] చేయ కూడదు. ఆలోచించి చేస్తే మేలు."

[illegible]

అయ్యో! విచారించగా కొడుకును [illegible] ఈ శ్లోకం [illegible] చేయగా భారవిభట్టు అని [illegible] చాలా [illegible] ఆస్థానపండితునిగా [illegible] చేసెను. అదిమొదలు భారవిభట్టు తల్లిదండ్రులతో భార్యతో హాయిగా ఉండెను.



బాలగేయం :

రంగడు

శ్రీ అయ్యగారి సుబ్రహ్మణ్యం

ద్రొడ్డిలో నొక తాడిచెట్టున
గ్రద్ద గూటను కట్టుకొని తా
[illegible] మేతకై
[illegible]
[illegible] పిల్లలు [illegible]
[illegible]
తల్లి గ్రద్దయు [illegible]
తరలి రాకుండక-
[illegible]
[illegible]
[illegible]
[illegible]
ఒక [illegible] మూడు సారులు
[illegible]
[illegible] సాహసము చే-
[illegible]
తల్లి గ్రద్దయు [illegible]
దాపులను [illegible] వెంటనె
వాడియగు [illegible] ముక్కుతో నను
[illegible]
రంగి [illegible] రంగడున్ [illegible]
[illegible]

వానినే కనిపెట్టి పక్షి
[illegible] గిరెన్-
ఒకటి రెండా మూడుసారులు
[illegible] నది
[illegible] పిల్లలు నెల్లగిరెను
సూటిగా మరలెన్-
[illegible] వదలి
పెద్దభయమున నింట్లో కేగిర
[illegible] రంగిని వదలదామను
[illegible]
[illegible] వచ్చి
గ్రద్ద గింగ తన శరీరము
[illegible] పొంగి వారగ
[illegible] సుఖముతో వాడూ-
ఇంటి కేగగ అమ్మకూడ
[illegible] వానిని కూకలేసెను
[illegible] మరి వానిజోలికి
ఎవరు పోకుండన్-
[illegible]
భయము లేకను చెరుపుచేసిన
[illegible] నదియును
గాన [illegible]



అమ్మకపుపన్ను పాతబడింది; కిటికీలపన్ను ఆలోచిస్తారా?

శ్రీ యద్దనపూడి వెంకటరత్నం

భారతదేశమునందు పూర్వపురాజులు తమకు, తమ సిబ్బందికి, జీత భత్యముల కవసరమగు సంతమాత్రమే, ప్రజలవద్దనుండి పన్ను వసూలు చేసేవారు. ఆ కాలములో ప్రజలు దానిని రాజభాగ మనేవారు. ప్రజలు తమంతటతామే దానిని అయాచితంగా యిచ్చేవారు.

దరిమిలాను, మహమ్మదీయు లీ దేశమును పరిపాలించిన కాలములో తమ కీ దేశమం దాధిపత్యము నిలువబెట్టుకొనుట కవసరమగు సైనిక వ్యయమునకును, తమకును, తమ సామంతులకును, సిబ్బందికిని, విలాసములకు, భోగములకొఱకు, ఏ లున్నంతవరకు ప్రజలనలన రాబట్టుకొనుట ప్రారంభించినారు. ప్రజలు అయాచితముగా యిచ్చే పద్ధతిపోయి, నిర్బంధించి వసూలుచేయు విధానము తల యెత్తినది తదాది, రాజభాగము, 'శిస్తు'గా మార్పుదవినది.

అటుపిమ్మట ఆంగ్లేయులు పాదం బెట్టారు- వీరు వణిజులు క్రమ క్రమముగా పాలకులైనారు. ఒకగూల వ్యాపారం అనే నెపముతో చేతిలో లక్కదొంపకాయ చెట్టి, బెల్లం లాక్కోవడమే కాకుండా, పాలకుల కోదాతో, పండినా, యెండినా, అతివృష్టి, అనావృష్టి, దోషాలతో నిమిత్తము లేకుండా, జలప్రళయము వచ్చి, భూమి నీటిలో మునిగిపోయినా, భూకంపమువచ్చి - చేను పాతాళలోకంలోనికి పోయినా, పన్ను చెల్లించక తప్పదనిన్ని, ఆ పన్ను మొత్తమునకు, ఆ భూమి, అందలి సస్యము, ఆ భూమిని దున్నిన సంసారి సంసారము, ప్రథమ తణఖా అంటూ యేవేవో నూతన నిబంధనలను దిగుమతి చేసి, ప్రత్యక్షముగా కత్తితో కోసి, వంట్లో నెత్తురు తీసికొనుటకు ఆపరేషన్ అవసరము లేకుండానే, జలగలను పట్టించి నెత్తురును పుష్కలంప జేసినట్లు, భారతీయులనూ జీర్ణవతులనుగా మార్పుదవించుటకు మార్గదర్శకులైనారు. తదాది, గవర్నమెంటువారు వసూలు చేసేదానిని, ల్యాండురివిన్యూ, అనిన్ని, జమీందార్లు చెల్లించేదాన్ని పేష్కషు అనియును, జమీందార్లకు వ్యవసాయదార్లు చెల్లించేదానిని 'రెంటు' అనియును, ఇంకా యవిగాక, క్విట్రెంటు, ల్యాండుటాక్సు, రోడ్డు సెస్సు, ఎడ్యుకేషన్ సెస్సు, వాటర్‌టాక్సు, మొదలగు భూమికి 'సంబంధించినవి గాక, ఇన్‌కంటాక్సు, ...టాక్సు, యక్సయిజుడ్యూటి, కస్టమ్సు డ్యూటీ, రాయల్టీ, అంటూ వ్యాపారానికి సంబంధించినవి గాక, స్టాంపుడ్యూటీ పోస్టేజీ, రిజిస్ట్రేషన్‌ఫీజు, ఆబ్కారీ, సాల్టుటాక్సు, కల్లమందుపన్ను, వార్ఫేజీ టన్నేజీ, లైసెన్సు ఫీజు, అంటూ క్రొత్త క్రొత్త పేర్లను బెట్టి, వసూలుచేస్తూ వచ్చారు.

అంతటితో తృప్తి పడక, జిల్లాబోర్డులు, మ్యునిసిపాలిటీలు, పంచాయతీ బోర్డు లంటూ స్థానిక సంస్థలు కల్పించి, ఎక్కడికక్కడికే, ఇండ్లపన్నులు, వృత్తిపన్నులు, కుక్కలకు పన్నులు, జంతువులకు పన్నులు, కిటికి పన్ను, దీపాలకు పన్ను, రోడ్లకు పన్ను, గాటీల పన్ను, ఇండ్లు నిలిచేచోట జాగాలకు పన్ను అంటూ, కుదుపలి లగాయతు, ముక్కు నిచ్చు లారని పసి పాపను కూడా, పన్ను చెల్లింపుకు లోను గావించారు.

అమ్మకపుపన్ను

ఆఖరుకు కాంగ్రెసు ప్రభుత్వం వచ్చినది. గౌరవనీయులగు శ్రీ రాజగోపాలాచారిగారు, ... రాజధానికి ప్రధానమంత్రి పదవిని స్వీకరించారు. బహుళాపృయుడును, దూరదృష్టి గలవాడు. రాజకీయములందారి తేరిన చేయి. చూచాడు సింహావలోకనము చేసి. బడ్జటులో. లొచ్చింది. భర్తీచేయాలి - కదిపితే కందిరీగల తుట్టెలాగున లేస్తుందని తెలుసును దోపు కొట్టినే, యెప్పటికైనా, అవుకే అనుకున్నారు. ఒక అపరూపమైననూతన పంథా కనిపెట్టాడు. అదేమి టంటారా? "సేల్సు టర్నోవరుటాక్సు" పైకి చాలా సమరసంగా కనిపిస్తుంది. అతిసులువుగావిధించవచ్చు లెక్కకట్టటానికికూడా గణితశాస్త్ర ప్రవీణత అంతగా అవసరంలేదు. వర్తకునకు నొప్పిగావున్నట్టు కనపించదు. "త్రాగేవాడే యిస్తాడు తాళ్ళపన్ను" అన్నట్లుటూంది. కొనక్కొనేవానికికూడా, అట్టే భారవహంగా కనుపించదు. వసూలుకూడ సులువే. ప్రథమంలో ఏకులాగే మెత్తంగా వుంటుందిగాని, క్రమంగా మేకై తొసకుపోతుంది. అప్పటికీ దీనిఅనుభవం ప్రజలకంతగా తెలియాను క్రొత్త రొకవింత అనిపించేది, క్రమక్రమముగా దేశమంతటా విస్తరించినది. కావలసినన్ని కాయలు కాస్తోంది.

ఇప్పటి మన ఆర్థికమంత్రిగారు, మిరపకాయలు, పసుపు, బంగాళాగుంపలు, కొబ్బరికాయలు, జీడిపప్పు, కాఫీహోటళ్లు, సినిమాలు తప్పమిసం ప్రారంభించారుగాని, శ్రీయుతులు లును పలహాచేసియుంటే, సులభమగు తరుణంగా ఉపాయము చెప్పియుండేరు ఇంత అలజడి లేకయియుండును. అయితే రాజగోపాలాచారిగారి మంత్రాంగము నాటికి, పార్టీలో విభేదాలంతగా రేకెత్తలేదు. ఇప్పుడు, పార్టీల్లో భిన్నత్వము లేర్పడ్డాయి. ప్రజలలో విశ్వాసము తగ్గింది. ప్రజలకు విశ్వాసపాత్రుడైన ఏకైక నాయకుడు లోపించాడు అదిన్నిగాక, అనుభవజ్ఞులకు మంత్రాంగపదవి చేపట్టుటకు అట్టే అవకాశము లేకపోయింది.

సరిగా ఇట్టిపరిస్థితులలోనే, ఒకానొకప్పుడు ఇంగ్లాండు సామ్రాజ్యమువుండేది - 1784 సంవత్సరములో విల్లియంపిట్టు ప్రధానామాత్యుడుగా యెన్నుకోబడ్డాడు. ఆ పదవిని అవిచ్ఛిన్నముగా 17 సంవత్సరములు నిర్వహించాడు. ఈ సందర్భములో, ఇంట్లో పోరు. ఇరుగుపొరుగు దేశములతో వైరము. (నెపోలియన్, ఇంగ్లాండుపై యుద్ధము ప్రకటించాడు) ఆంగ్లేయులయొక్కయు, వారి సామ్రాజ్యముయొక్క సంరక్షణభారమంతా యితనిపై బడినది. ఇతని కప్పటిలో ప్రాయ మిరువదిఅయిదు సంవత్సరములు. పార్లమెంటులోని, ఆరితేరిన నాయకులందరికి, ముక్కు పచ్చలారని, యీతని క్రిందపనిచేయడమూ అనే కడుపుమంట. వైరివర్గాన్ని సాధించడానికి, అడ్డం వచ్చిన వారి నల్లా డప్పిచ్చికొన్నాడు. కాని తానొక్క పైసా అయినా స్వార్థంకొఱకు వినియోగించుకోలేదు. పరిస్థితులీవిధముగా వుండగా, నూతనసంవత్సరము వచ్చినది - ఆదాయవ్యయాలు సరిపుచ్చవలసివచ్చినది. అంచనా సరిపుచ్చడంలో 1,40,00,000 పౌనులు లోటొచ్చింది. ఇదిగాక ప్రభుత్వమువారు తీర్చవలసిన ఋణాలున్నాయి పైపెచ్చు, ఇంగ్లాండు బ్యాంకునకు, ఇరవైలక్షల పౌనులు అప్పు తీర్చాలి - చూచాడు - చూచాడు - భాగ్యవంతులను రెచ్చగొట్టితే, దరిద్రులను చంకబెట్టుకొని, భాగవతం ఆడతారని గ్రహించాడు. దరిద్రులను, సామాన్యులను చంకబెట్టుకుంటేనేగాని, భాగ్యవంతులను వశవర్తులనుగా జేసుకొనటం సాధ్యము కాదని కనిపెట్టాడు.

కిటికీలపై పన్ను

అప్పట్లో తేయాకువ్యాపారం, మామ్మూలుగా వుండేది - వర్తకులు, డ్యూటీ లేకుండా విస్తారం తేయాకు దొంగతనంగా దిగుమతి చేసి అపరిమితంగా లాభాలు సంపాదిస్తూ యుండేవారు. అరికట్టడానికి, కఠినశాసనాలు అవసరం నిర్బంధ చర్యలకు అది అదను కాదనుకొని, అప్పటికి ఇంగ్లాండులో జనాభా లెక్క వేయించి చూడగా 60,00,000 కుటుంబాలని తేలింది. అందులో నలభైలక్షలు భాగ్యవంతులు. ఇరవైలక్షలు సామాన్యులు. మెల్లగా తేయాకు దిగుమతిపైన సుంకము పెంచాడు. వెంటనే, కిటికీలపన్ను "*WindowTax*" అని ఒకనూతనపన్ను విధించాడు. అవీడుకిటికీలకంటె యెక్కువవున్న వారి యీపన్ను నిన్ను, ఏడుకిటికీలకుతక్కువ వున్న యిండ్లలోని వారికి, తేయాకుపన్ను మినహాయింపన్నాడు. దానితో ,ప్రజలలో కట్టు వీడింది. భాగ్యవంతులకు, సామాన్యులు పాటకపు ప్రజా సముదాయముమీద అదుపు సడలింది. సామాన్యులు, సంతోషించి, ప్రభుత్వఅండను చేరారు. భాగ్యవంతులు క్రొత్త పన్ను తప్పించుకొనుటకు గత్యంతరము గానక, గొణుక్కుంటూ, చెల్లించారు. దానితో లోటు భర్తీ అయింది; ఎవరికీ నొప్పి లేకుండా.

ప్రభుత్వమునకు కావలసిన ఋణము చేయడములో, భాగ్యవంతులకు, ఆశ్రితులకు చోటివ్వక, ప్రజలలో పోటీలుపెట్టి, యెవరు తక్కువ వడ్డీ కేయిస్తామని ముందుకు వస్తే వారి వద్దనుండి స్వీకరించారు.

తేహ్యాలు, లేసాలు, యింకా లోట్లోస్తే, టోపీలు, ముడిపట్టు, నార, అద్దకంబట్టలు, మైనపువత్తులు, ఇటుక, పెంకు, బట్టకు సంబంధించిన, యక్సయిజు డ్యూటీలు, వేటలైసెన్సులు, బట్లు, బంగారు, వెండి మొదలగు లోహములతో తయారయ్యేడి పాత్రసామాను యిత్యాదులమీద పన్ను విధించినాడు.

అంతేకాని, మన మద్రాసు ఆర్థికశాఖా మంత్రిగారివలె మిర్చి, పసుపు, కొబ్బరికాయలు, జీడిపప్పు, యిత్యాదులపైకి దృష్టి నిగుడించలేదు.

మంత్రిగారు నిదానించలేకపోయినారు. గాని, యించుక ఆలోచించినచో, విల్లియంపిట్టు మహాశయునకు తట్టిన, విండోటాక్సు (కిటికీలపన్ను) వంటిదో, శ్రీమాన్ రాజగోపాలాచారిగారికి స్ఫురించిన, సేల్సుటర్నోవరు టాక్సువంటిదో, బీదసాదలకు బాధ లేనిది, భాగ్యవంతులకు లక్ష్యము లేనిది లోటు భర్తీ చేయుటకు అవసరమగు సాధనము దొరుకక పోయియుండునా?

కాశ్మీరసాహిత్యము

శ్రీ పులగంపల్లె గోవిందరెడ్డి

మన భరతఖండములో భూతలస్వర్గ మనిపించుకొన్న కాశ్మీరు, తన అనుపమేయ ప్రాకృతిక సౌందర్యాల్లోనే కాకుండా, భారతీయసాహిత్య దృష్ట్యా విశ్వవిఖ్యాతిని గడించినది. ఒకానొకప్పుడిది సంస్కృత సాహిత్యానికి కేంద్రస్థానం. అది భారతీయ ఇతిహాస ప్రారంభసమయము. అప్పటిలో దీర్ఘకాలమువరకూ 'కాశ్మీరు' భారతదేశ విద్వత్ కేంద్ర మనిపించుకొన్నది. ఇప్పుడు...?

ఆ సమయంలో ఈ మనోహర పర్వతమయ దేశంలో ప్రబలసాహిత్యము సమాజముయొక్క ఆందోళనోద్భవ మయింది. అది కేవలము భారత దేశములోనే కాకుండా పరదేశాలకు కూడా ప్రాకింది తిబ్బత్, ఈరాన్, ఇరాకుల వరకూ వ్యాపించింది. బౌద్ధవిచారధార, దార్శనిక జ్ఞానమూ ఎక్కువగా కాశ్మీరులోనే పరిపుష్ట మయిందని చెప్పవచ్చు. తిబ్బత్‌లో బౌద్ధమత ధర్మంలోని ప్రచలిత వర్తమాన తాంత్రిక మార్గాలు వాస్తవములో కాశ్మీరు కృషిఫలితాలే. శైవమత ధర్మానికి కూడా కాశ్మీర్‌లో కావలసినంత ప్రోత్సాహం దొరికింది.

పురాతన సాహిత్యంలో అధికాంశాన్ని సురక్షితంగా ఉంచలేని కారణంవలన ఆ కాలము నాటి సాహిత్యమూ, తథా సామాజిక ఆందోళన వివరాలను, సుసంగతంగా వివరించజాలము. కానీ ప్రాచీన భారతీయ సంస్కృతి, విచారధారా ప్రవాహంలో కాశ్మీరు కొద్ది రోజులు, ఎడతెగకుండా ఈదగలిగిందంటే నమ్మవలసిందే.

కాశ్మీర్ వాసులకు తమ అతీతముద్వారా ఒక సంపన్న సాహిత్యము, ఉత్తరాధికృతసంపత్తి రూపములో ప్రాప్తించింది. వారికి ఈ సాహిత్య మూలధనం ఆరంభ హిందూకాలము నాటి సంస్కృతమూ, అటుతరువాత అఫ్గన్ కాలము నాటి ఫారసీ, తత్‌పశ్చాత్ సిక్కుల కాలం నాటి ఉర్దూ భాషలయొక్క సంపర్క సమావిష్ట మయింది. ముసల్మానులా, మొగలుల సమయంలో తయారయిన ఫారసీయే దర్బారు భాష అయింది. అది సిక్కుల కాలప్రారంభములో కొద్దిరోజులు జీవించి ఉండినది. ఆఖరికి దీని స్థానాన్ని ఉర్దూ ఆక్రమించుకొన్నది.

ప్రజల వాడుకభాష అయిన 'కాశ్మీరము', మొట్టమొదటి 'శారదా' లిపిలో వాడబడుచుండినది. అది ఇప్పుడు పూర్తిగా లుప్తప్రాయమై పోయింది. ఎంతో కాలంనుండి దీని స్థానాన్ని 'ఫారసీ' లిపి ఆక్రమించుకొన్నది. వర్తమాన ప్రచలిత భాష ఉర్దూయేకానీ, అచ్చట కొద్ది రోజులనుండీ కాశ్మీరుభాషమీదా సాహిత్యం మీదా ప్రజల అభిరుచి ఎక్కువయింది. మరియు ఈ ప్రాచీనభాషను వైజ్ఞానికఆధారంమీద ఉన్నతిని పొందించేదానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

కాశ్మీర్ భాషాసాహిత్య శిలాన్యాసము చాలామట్టుకు 'షాహ్-జైన్-ఉల్-అబ్దీన్' కాలములో అయింది. కేవలము రాజనీతిక, తథా ధార్మిక క్షేత్రంలో శాంతి, సద్భావనాల స్థాపన చేయడమే కాకుండా, అనేక రచయితలకూ, కవులకూ, అన్యసాహిత్యకారులకూ తన శాసనాలద్వారా తగిన ప్రోత్సాహ మిచ్చినాడు. అయినా అతని కాలములో దర్బారుభాష 'ఫారసీ'యే. సంస్కృతాన్నికూడా సమాన దృష్టితో చూచేవాడు. ఐతిహాసిక ప్రసిద్ధ గ్రంథము 'రాజతరంగిణి'ని ఆయన కాలము నాటి జోనరాజా, ముల్లా-అహమ్మద్ అను పేర్లుగల ఇద్దరు రచయితలు క్రమంగా సంస్కృత, ఫారసీభాషలలో పూర్తిచేసినారు. ప్రసిద్ధ హిందూ విద్వాన్ శ్రీ భట్టకీకూడా ఇతని దర్బారులో ఉత్తమరత్న మనిపించుకొన్నాడు. దార్శనిక విచారాల్తో, సూక్తుల్తో, ఛందోబద్ధంగా వ్రాయబడిన 'ఋషినామా' అనే సుందరగ్రంథము ఇతని కాలములోనే లిఖించబడినది. దీనిని రచించినది నందఋషి అని ప్రఖ్యాతిగొన్న షేకు నూరుద్దీన్. ఇవే కాకుండా సోమభట్టుని 'జైనచరితము' ఉోధభట్టుని 'జైనవిలాసమూ' షాహ్ జైన్ ఉల్ అబ్దీన్ కాలములోనే రచించబడినవి.

ఆటుతరువాత అక్బరు పరిపాలన నాటి సాహిత్యక్షేత్రములో ఐక్యాన్ని స్థాపించ రెండవ ప్రయత్నం జరిగింది. రాజభాష ఫారసీ అయినా సంస్కృతసాహిత్యానికి తగిన ఆదరణ ఉండేది. మహమ్మదీయుల, అఫ్గనుల, తథా సిక్కుల శాసనకాలములో కాశ్మీర సాహిత్య చరిత్ర అంతా ఫారసీ సాహిత్య చరిత్రయే. అయినా సంస్కృత ప్రాచీన సాహిత్య పరంపర పూర్తిగా, లుప్తప్రాయమైపోలేదు. ఈ విషయము 'లాల్‌నూరీ' లేక 'లాల్‌జేద్' కృతులలో బయల్పడుతుంది. ఈయన వ్యక్తిత్వములో సంస్కృతమూ, ఫారసీ భాషా

కాశ్మీర సాహిత్యము

సంస్కృతులు సమ్మేళనమైనవి. ఈ కాలంలోని మహత్వపూర్ణ సంస్కృతికృతులలో జగధరభట్టుని 'స్తుతికుసుమాంజలి' (1840), సితికంఠుని 'బాలబోధిని' (1475), వల్లభదేవుని 'పద్యావళి' (1550) గణన చేయవచ్చు.


ఈ కాలంనాటి సాహిత్యంలో మరొక విశేష మేమిటంటే కేవలము మహమ్మదీయులే కాక హిందువులుకూడా ఫారసీభాష నభ్యసించ మొదలిడిరి. దీని పరిణామము 'మొహమద్ తాహిరీగనీ'లవంటి సుప్రసిద్ధ ఫారసీకవులకంటే 'మనీభవానీదాస్‌కచరూ'లవంటి హిందూకవులే ఫారసీ సాహిత్యంలో ఉన్నత స్థానాన్ని పొందగలిగిరి. ఇతనే కాకుండా అన్యకాశ్మీర పండితులు ఫారసీభాష నారాధింప మొదలిడిరి. తమ ప్రతిభచేత ఫారసిభాషా వాఙ్మయాన్ని సుసంపన్నము చేసిరి. కాశ్మీరకవి హిందువైనాసరే, మహమ్మదీయుడైనా సరే పురాతనమునుండీ వచ్చిన స్వదేశీసాహిత్యపరంపరలను అవహేళన చేయ సాహసించనూ లేదు; తను ముట్టడించి వాతావరణాన్ని, చీల్చుకుని దూరము తొలగడానికి ప్రయత్నించనూలేదు దీనికి తార్కాణం ఆ ప్రదేశంలోని ఊహాకథలూ, ప్రేమకథలే.

ఇక ఆధునిక కాలాన్ని గూర్చి విచారింతము. ఆధునిక రచయితలలో 'మహమ్మద్‌గనీ' బలిఉల్లామట్టూ, పీర్‌మకబూల్‌షాహ్, మరికొంతమంది కవులు ప్రసిద్ధి చెందినవారు. మహమ్మూద్, 'పంచ్ గంజ్' (అయిదు ఖజానాలు)ను కాశ్మీర్ భాషలో రచించినాడు. పీర్‌మకబూల్‌షాహ్ 'గుల్‌రేజ్' యొక్క ప్రేమకథనూ, వాహబ్‌పారె ఫిరదౌసీయొక్క 'షాహనామా'(ఫారసిదేశపు సుప్రసిద్ధరాజుల చరితము) కాశ్మీర్ భాషలనే వ్రాసినారు. హిందూకవుల్లో పరమానంద, అతనిశిష్యులు లక్ష్మణ ప్రకాశరాముడూ. కృష్ణదాసు పేర్లుకూడా లెక్కించవలసినవే.

ఈనాటి కవులు తమ రచనలలో ఫారసీ సంస్కృతిములయొక్క తత్సమ, తద్భవ శబ్దాలనెన్నిటినో ప్రయోగించినారు. కాశ్మీర సంస్కృతి సాహిత్యాలను ప్రభావితము చేయు భిన్న భావములయొక్క ముద్ర ఈకవుల రచనలలో కన్పడుచున్నది. 'ఆసీ' (పాపి) అనే పేరుతో ప్రసిద్ధికెక్కిన అబ్దుల్ సత్తార్ గుజరీ ప్రత్యేక ప్రతిభాశాలి కవి. ఈకవిలో నవీన కాశ్మీర్ ఆత్మ సమావేశాన్ని చాలాముట్టుకు దర్శించగలుగుతాము. ఇతనిని 'శ్రామికజనులకవి' అని చెప్పవచ్చు. తన రచనలద్వారా జనసముదాయముయొక్క సామూహిక అభిలాషలూ, ఆలోచనలు వ్యక్తీకరించినారు. వర్గహీన సమాజ స్థాపన, హిందూ ముస్లిమ్ ఐక్యతకొరకై ఎంతో పాటుపడినాడు. కాశ్మీర్ లోకప్రియసాహిత్యము దేవకన్యల కథలతోనూ గీతాలతోనూ నిండివుంది. ఇందుకు చేరికగా పూర్వసాంప్రదాయ పరంపర, కథలయొక్క అతుల సంపత్తి సురక్షితంగా నుండినతో మరెంత బాగుండెడిదో!

విశుద్ధకాశ్మీర్ భాషలో సంగ్రహిత దేవకన్యలకథలయొక్క సుప్రసిద్ధసంగ్రహములు 'షెరీర్‌మల్,' 'లాల్‌మల్,' అను పేరుగలవి కాశ్మీరు గ్రామాల్లో నేడుకూడా ప్రచారంలో ఉన్నవి. పాటకజనగీతాల్లో ఋతువ్రతాల విశేషాలు ప్రసంగానుసారంగా వివిధవస్తునిరూపణ చేయబడినవి. ఈ గీతాల భావమూ, అభివ్యంజనముయొక్క శైలినీ, వాని నిర్మాతల సామాజిక భావాత్మక అనుభవముయొక్క మూర్తిమాన స్వరూపమని గుర్తించగలుగుదుము. ఉత్సవాల్లో కాశ్మీరగ్రామీణబాలికల నృత్యగీతాలు విన్నప్పుడు వానిద్వారా సాంస్కృతిక, జాతీయైక్యతాతంత్రులు పునర్ధ్వనిత మాతవి.

కాశ్మీర్‌వాసుల భాషా సాహిత్యానికి సంబంధించినంతవరకూ తేలే సత్యం ఏమిటంటే, కాశ్మీరులోని హిందువులూ, మహమ్మదీయులూ ఒకే సామాన్యదృష్టికోణముతో, సామాన్య మానసిక ఆధ్యాత్మిక, సంస్కృతియొక్క వికాసాన్ని కల్గించినారు. ఎన్నోతరాలనుండీ అన్యోన్యంగా కలిసిమెలసి అన్ని క్షేత్రాలలో పనిచేయుచూవచ్చిన హిందువులు ముస్లిములు ఈనాడు కాశ్మీర్‌లో వేరు వేరగుటఇష్టములేని కారణంతో భూతలస్వర్గాన్ని భూతల నరకంగా మార్చ సంకల్పించిన పాకిస్థాన్ ప్రభుత్వం పశ్చాత్తాపపడే కాలము ముందున్నది.



తాళ్ళపాకవారి పదములు

శ్రీ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

33

అన్నమాచార్యుల రచన : (సం. ౮; ప. ౧౦.)

శ్రీరాగం - జంపెతాళం

[పల్లవి]

(౧) సా సరి సని పా పమ నిప పమరిర | రిస రిగా. రి సా , , ,
చా లు ని క ని టు వం టి సం సా ర ము

(౨) సా గరి సని పా సనిపమ రిగరి | సరిసరి గా రి సా , , ,
చా లు ని క ని టు వం టి సం సా ర ము

(౩) సా గరి సని సప రిమ పని సనిపమరీ | సనిపని సరి గా రి సా స స స
చా లు ని క ని టు వం టె సం సా ర ము మ రు ని

(౧) సనిసరీ సరిమపాప | పానిమ పమరీమ పని సరిగరి
పా లై తి ని పు డే టి భా గ్య మి ది నా కు

(౨) రిసనిప నిసరీ సరిమ పనిసా ప | పని సరిగరి గరిసని పని సరిగరి
పా లై తి ని పు డే టి భా గ్య మి ది నా కు

(౩) రిసనిప నిసరిమ మరి రిమపనిని | పని సరిసా రిరి గగరిరిసని నిపని
పా లై తి ని పు డే టి భా గ్య మి ది నా కు (చాలు నిక)

[చరణం]

(౧) పని సని పపమరీగ రీ | రిసరిగరి రిగసా సస స
త ని య క కి టు నీ వు కాం త ల వె ల్ల నా యె దు ట

(౨) పని సరి సని పమ రిమపని సని పమరీ | సనిపా పని సరి గా గరిరి సస స
త ని య క కి టు నీ వు కాం త ల వె ల్ల నా యె దు ట

రిమ పనిని నిని నిపమ | , మ పని సా , , ,
కొ ని యా డ దొ ర కొం టి కొం కు లే క

(౧) రి రి రి రిరి సరి గారిరి | సారిగ రిసని ని నిసరి రి
వి ని యు ప్రా ణ ము తో డ వి ష మై న యీ కూ డు

(౨) రి రి రి రి , స స స రిరిగరి | సారిగ రిసని నిపా , ని సరి సా రి
వి ని యు ప్రా ణ ము తో డ వి ష మై న యీ కూ డు

సరి సా సని స నిని | పానీ పమ రిస నిపరిమపని సరిసరి
తి న జే రి న ది యే టి దే హ మి ది నా కు (చాలు,

ఇట్లే క్రింది చరణములు :

(౨) వెలిని కిటు సతుల నీ - వెనువెంట బెట్టుకొని
మెలయ దొరకొంటి విదె - మేర లేక ;
ఎఱిగియును దీ సనుచు - నిట్టి నీమున్నవల
చెఱబెట్టినది యేటి - జీవ మిది నాకు ! (చాలు)

(౩) ఎక్కువగు నీ కరుణ - లిందఱిని నా కిట్ల
మొక్కించ దొరకొంటి - మొఱగు లేక ;
గ్రక్కనను నన్ను వెంకటగిరీశ్వర కలసి
చిక్కనైతివి చాలు - జిన్న మిది నాకు. (చాలు)

లఘుటీక : తనియక = తృప్తిపడక ; తినజేరినది = తినగా ఒంట బట్టినది ; మెలయ = మెరవడిచేయుటకు ; మొఱగు = బాపరికము ; చిక్కనైతివి = లభించితివి ; చిన్నము = బంగారు : సొమ్ము.

ముద్రిత పాఠము : నిపు డింటి భాగ్య మిది.

బాలానందం

(14 వ పేజీ తరువాయి)

నవ్వు...మరి అంతకన్న మరేం లేదు."

తాను కథ చెప్పి దానివల్ల పెద్ద ఫలితం అపేక్షించాడు మన తెలివిగల పండితుడు...అనుకొన్నట్లుగా రాజాస్థానంలో ఉన్న ప్రేక్షకు లంతా గూడా యేకకంఠంతో, వా రిరువురినీ అక్కడ్నించి పంపించివేయవల్సిం దని కోరారు. అంతదూరంనుంచి, యింత దూరం పంపించి, మరణదండన వారికి విధించమని కోరటంలో యేదో అంతరార్థం ఉండియుండటం...వీరు చెప్పియున్న మాటల్లో కొంతయైనా సత్యం లేకుండా ఉండటం జరుగదు.'

ఈవిధంగా రాజుతల చాడు. ఎంతో కోపం రాజునకు వచ్చింది...వెంటనే వార్తను సీలుచేసి వారిద్దరినీ తిరిగి వచ్చినదారినే, వారిరాజ్యానికి పంపించాడు. వా రిద్దరూ నడవకలిగినంత తొందరగా నడచి తమ రాజ్యానికి చేరుకొన్నారు.

సీలుతో ఉన్న ఆ వార్తను యివ్వవలసిన తమ రాజున కిచ్చారు వాళ్ళు. తిరిగి చనిపోకుండా బ్రతికివచ్చిన వారిని చూడటంతోటే రాజునకు యెంతో సంతోషం కలిగింది. సీలు తీసి అందులో ఉన్నవార్తను చదువుకొన్నాడు. ఆశ్చర్యం! అతని ముఖం నల్లగా అయిపోయింది! ఆ వుత్తరంలో అతని సోదరుడు 'ఈ వార్త...నీతో యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉన్నానని తెల్పటం కోసం' అని వ్రాశాడు.

భయం, ఆశ్చర్యం—రెండూ మిళిత మయ్యాయి రాజుకు. సరిగా అతనికి వృత్తాంతం అర్థ మవలేదు. అందువల్ల మన తెలివిగలవ్యక్తిని దగ్గరకు రప్పించుకొని 'వృత్తాంత' మేమి టని ప్రశ్నించాడు మన తెలివిగల వ్యక్తిగూడా ముందుకు వచ్చి తాను తన స్నేహితుడు... కథ చెప్పి...తప్పించుకొనిన విధానం తెల్పాడు.

రాజు వా రిద్దరినీ చూచి అన సాగాడు: "అడవి దాటి బయట కొచ్చామని, అపాయం తప్పిపోయిం దని మీ రప్పుడే సంతోషపడకండి. చావునుంచి తప్పించుకొన్నామని మీరు ఆనంద పడుతున్నారు. లేదు—మీరు చావు నుండి తప్పించుకు పోబడలేదు'.—ఈ విధంగా అంటూ రాజు వారిద్దరినీ చంపడానికి అనుజ్ఞయిచ్చాడు. తిరిగి మన తెలివితక్కువ వాడు, తన బంగారుతో తన ప్రాణం రక్షించుకొందామని యధాప్రకారం ప్రయత్నంచేసి, అందు విఫలుడై...తన కర్మ యేవిధంగా పోతుందో ఆ విధంగా నడుస్తా మనుకొని విచారింపసాగాడు. వా రిద్దరూ తిరిగి యధాప్రకారం ఉరికంబంవద్దకు తీసుకొని పోబోయేసమయంలో మన తెలివిగలవాడు తిరిగి పొట్ట చెక్కలయ్యేటట్లుగా నవ్వాడు. ఏడ్వవలసిన సమయంలో నవ్వుతున్న సంగతి రాజు గమనించి అతగాడ్ని కారణ మడిగాడు.

మన తెలివిగలవాడు యీ విధంగా జవా బిచ్చాడు: "ఓరాజా! నే నవ్వినందుకు మీరు కారణం అడిగారు. చాలా సంతోషం. మీ రాజ్యం... మా ప్రాణాలమీద ఆధారపడి ఉన్న దన్న సంగతిమాత్రం మరచిపోకండి. మే మిరువురంగూడా...ఒక జంట... మీరు తవ్వుకొంటున్న గోతియందు మీరే పడుతున్నసంగతి మాత్రం మరచిపోకండి...ఆ విషయం గుర్తునకొచ్చే నాకు నవ్వు వచ్చింది." ఆ మాటలు విన్న రాజు యీ విధంగా చెప్ప సాగాడు..."ఏదో మీరుచెబుతున్నారు ...కాని మీ సాహసకృత్యాలు చూపకలిగితే మీప్రాణాలను రక్షిస్తాను... వచ్చే సైన్యాన్ని తిరిగి నువ్వు పంపించివేయగలిగినట్లయితే మీ జీవితాల్ని రక్షించుతాను. అట్లా గాక ... కథ అడ్డం తిప్పితే...మీ ప్రాణాలు యెగిరిపోతాయ్. పిచ్చికుక్కల యెదురుగా మిమ్మల్నితోసి, ముక్క ముక్కలుగా నరికించి, మీ రన్ని, అబద్ధములు చెప్పినందుకు నా కసి తీర్చుకొంటా!

ఎప్పుడూ గూడా మన స్నేహితు లిద్దరూ గుఱ్ఱంమీద యెక్కడంగాని, దానిమీద ప్రయాణం చేయటంగాని జరగలేదు. కాని యేం చేస్తారు? గుఱ్ఱములమీద, కత్తులు ఒళ్లో పెట్టుకొని బయలుదేరారు!


వాళ్లు అలా కొంతదూరం వెళ్లి, చివరకు పెద్ద సైన్యంతో యెదుర్కొనటానికి వస్తూఉన్న రాజును చూచి అతనిదగ్గరకు వెళ్లారు...వెళ్లినవారు ...ఆ రాజుతో యీ విధంగా చెప్ప సాగారు: "ఓ రాజా! నీవు ముందుకు అడుగు వేయదలస్తే, మాతో ముందు పోరాడి లోనికి వెళ్లాలి. లేనట్లయితే మీ రాజ్యానికే, తిరిగి వెళ్లిపోవాలి."

ఆ మాటలు విన్న రాజునకు యెంత భయం అంకురించిందో, అంతే అతని సైనికులకుగూడా అంకురించింది. ఎందువల్లనంటే, వారు వీరిని యెదుర్కొన్నట్లయితే వీ రిద్దరూ చనిపోవటం ఖాయం. చంపినట్లయితే దుష్టశక్తులు తన్ను, తన రాజ్యాన్ని పట్టుకు పీడిస్తాయ్...దానికి తోడు రాజుకు యిదివరకు వీళ్లు చెప్పిన మాటలు గుర్తునకొచ్చాయ్. రాజు తనలో తాను యీవిధంగా తలచసాగాడు: 'ఒకవేళ నేను వీళ్లిద్దర్ని యెదిర్చినట్లయితే... జోతిష్కుడు చెప్పినట్లుగా నా రాజ్యాన్ని నే గోల్పోతాను. వాళ్లు మా చేత్తో చంపబడకుండా ఉండాలీ అంటే అందులో మంచి కారణం ఉంది. అందువల్ల మాట్లాడకుండా నారాజ్యానికి నే తిరిగి వెళ్లిపోవటం అంత శ్రేయస్కరమైన పని యింకొకటి లేదు'— ఆ విధంగా తలస్తూ రాజు తన సైన్యంతో...తన రాజ్యానికి తిరిగి పయనమయ్యాడు; మన తెలివిగలవాడు, అతని స్నేహితుడూ యిరువురూ కలసి యీ శుభవార్త చెబుదామని తమ రాజధానికి బయలుదేరారు.

వాళ్లు చేసిన సాహసకృత్యానికి రాజు యెంతో మెచ్చుకొన్నాడు; వాళ్లుచేసిన పనులకు బదులుగా, వాళ్ల జీవితాలు రక్షించటమే కాకుండా పెద్ద ఉద్యోగములు చూపి, వాళ్లకు తన కృతజ్ఞత చూపుకొన్నాడు.

ఇదివర కనుకొన్నప్రకారంగా మన తెలివితక్కువ భాగ్యవంతుడు సగం ధనము తెలివిగలవానికి యివ్వబోయాడు; కాని తెలివిగల ఆసామీ తిరిగి యిచ్చినదాన్ని యిచ్చివేస్తూ 'ఇప్పుడైనా గుర్తునకొచ్చిందా?...నీబంగారం మీద నాబుద్ధికుశలతపని...'అన్నాడు.

'ఆ...'అని అత డన్నాడు. ఆనాటి నుంచి యిదివరకువిధంగా ఉండక, ఒకరితో ఒకరు కలసి ఉండసాగారు.



అర్థిక ఐరోపా పునరుద్ధరణ కార్యక్రమమును నిర్వహించుటకు ఉద్దేశింపబడినబిల్లుపై వైట్‌హౌస్‌లో ఏప్రిల్ 19 వ తేదీన అధ్యక్షుడు ట్రూమన్ చేవ్రాలు పెట్టుతున్నాడు. అధ్యక్షుని వెనుక నిల్చున్నవారు ఎడమప్రక్కనుండి, యూరప్ పునరుద్ధరణ కార్యక్రమ డిప్యూటీ నిర్వాహకుడు హవార్డ్ బ్రూస్, జాడ్‌కీ, విదేశాంగ వ్యవహారముల కమిటీ అధ్యక్షుడు, ఎవరెల్ హారిమన్, కార్యక్రమ నిర్వాహకుడు పాల్ జి హాఫ్‌మన్, సెనేటర్ టాంకానల్లీ విదేశాంగమంత్రి, డీన్‌అఛిసన్.

దక్షిణ - ఆఫ్రికా - నాడు నేడు

శ్రీ నిష్ఠల కేశవరావ్

దక్షిణాఫ్రికాలో మొదట కాలిడినవారు పోర్చుగీసువారు. వీరి పలుకుబడి 16 వ శతాబ్దమున తగ్గిపోగా, వీరి స్థానమును డచ్చివారు ఆక్రమించిరి. వీరు తూర్పుదేశములతో వర్తకము సాగించునపుడు దక్షిణాఫ్రికా దక్షిణమున కల "గుడ్ హోప్" అగ్రప్రాంతము వీరికి మధ్యమకాముగా నుండెడిది. ఒక శతాబ్దకాలము యీ ప్రాంతము వీరి అధీనమందు కలదు. నెపోలియన్ యుద్ధానంతరము యీ ప్రాంతము ఆంగ్లేయుల చేతిలోనికి వచ్చెను. వీరుకూడా యీ గుడ్ హోప్ అగ్రప్రాంతమును వారి ఓడల మకాముగా వాడు కొనుచుండెడివారు.

1820 లో బ్రిటిషుప్రభుత్వం తన దేశమునుండి కొంతమందిని ఆఫ్రికాఖండమున స్థిరముగా నుండు ఏర్పాటు చేసి పంపెను. ఆఫ్రికాలో కల డచ్చివారి సంతతికి "బోయర్లు" అని పేరు. వారి ప్రాంతములకు ఆంగ్లేయులు వచ్చుటచే బోయర్లు, ఆంగ్లేయులపై క్రోధభావమును వహించిరి 1836 లో బోయర్లు ప్రథమంగా ఒక జట్టుగా చేరి, అగ్రప్రాంతమందు కల ఆంగ్ల ప్రభుత్వమునుండి విడిపోయి, ఆఫ్రికాలోని లోభాగములకు వలసపోనారంభించిరి. ఈ విధంగా దక్షిణాఫ్రికాలోని, లోభాగములకు వలసపోయి ఆరంజిఫ్రీస్టేట్, ట్రాన్స్వాల్, నేటాల్ రాష్ట్రములను బోయర్లు ఏర్పరచుకొనిరి. ఆ కాలములో "నేటాల్ రాష్ట్రము జూలూ" జాతి అధికారమందుండెను. ఆంగ్లేయులు వీరి అనుమతిని డర్బన్ రేవు ప్రాంతమందు వలస నేర్పరుచుకొనిరి అప్పటికి ఒక్క "కేప్ కాలనీ" మాత్రం ఆంగ్లేయుల అధికారమందు కలదు. కాని బోయరు ఆంగ్లేయులపై క్రోధభావమును వహించిరి బోయర్ల ఒత్తిడికి తగలేక ఆఫ్రికన్ జాతులు ఆంగ్లేయుల అధికారమందు గల కేప్ కాలనీపైకి దండెత్తు దురను నయముచే, ఆంగ్లేయులు 1843 లో యుద్ధమున బోయర్లని ఓడించి నేటాల్ రాష్ట్రమును తమ రాజ్యమున కలుపుకొనిరి అంతటితో బోయర్లు నేటాల్ను విడిచి ట్రాన్స్వాల్, ఆరంజ్ రివర్ కాలనీలకు లేచి పోయిరి. 1852-54. ఒడంబడికలను అనుసరించ ఆంగ్లేయులు బోయర్ల ట్రాన్స్వాల్ ఆరంజిరివర్ కాలనీలను స్వతంత్రి రాష్ట్రములుగా గుర్తించిరి.

ఇది యిలా ఉండగా ట్రాన్స్వాల్ రాష్ట్రమందు బంగారు గనులు దొరికెను. అందుచే ఆంగ్లేయులు ఆ ప్రాంతమందు తండోపతండములుగా నుండ నారంభించిరి. కాని ట్రాన్స్వాల్ రాష్ట్రాధ్యక్షుడు "పాల్ క్రూగర్" వీరి రాకను అనుమతింపక, వచ్చినవారికి అనేక చిక్కులను కల్పించెను. బంగారు గనుల కొరకు ఆంగ్లేయులు బోయర్లు ఆధ్వర్యం క్రిందకల ట్రాన్స్వాలుపైకి దండెత్తిరి. 1900 సం॥ లో ఇంగ్లండునుంచి "రాబర్ట్సు" ప్రభువు, "కిచ్నర్" సేనానియూ ఆఫ్రికాలో దిగి యుద్ధములో పాల్గొనిరి. చివరకు బోయర్లు ఓడిపోయిరి. ఆంగ్లేయులు ట్రాన్స్వాల్, ఆరంజి ఫ్రీస్టేటు రాష్ట్రములను తమ రాజ్యమున కలుపుకొనిరి 1909 లో కేప్ కాలనీ, నేటాల్, ట్రాన్స్వాల్, ఆరంజి ఫ్రీస్టేట్ రాష్ట్రములు కలిసి యూనియన్గా ఏర్పడెను. ఈ నాలుగు రాష్ట్రములలో రెండు బోయర్లవీ, రెండు ఆంగ్లేయులవీ అగుటచేత వీరికి ఫెడరేషన్ పొసగలేదు. అందుకనే వారు యూనియన్ ప్రభుత్వమును స్థాపించిరి. ఇదియే నేటి సర్వస్వతంత్ర "దక్షిణాఫ్రికన్ యూనియన్".

1860 లో దక్షిణాఫ్రికాలోకల ఐరోపియన్ భూస్వాముల పొలములలో పని చేయుటకు ఆంగ్లేయులు నేటాల్‌నకు కొంతమంది భారతీయులను రప్పించిరి. కొంతకాలమయిన తరువాత వీరు క్రమంగా భూములను సంపాదించుకొని అచ్చటనే స్థిరనివాసముల నేర్పరుచుకొనిరి. మరి కొంతమంది వర్తకవ్యాపారములలోనూ, పరిశ్రమలలోనూ ప్రవేశించిరి. 1936 నాటికి సుమారు 2 లక్షల 40 వేల మంది భారతీయులు దక్షిణాఫ్రికన్ యూనియన్‌లో కలరు.

దక్షిణాఫ్రికాను పాలించు ఐరోపియన్ ప్రభుత్వము నల్లజాతులను పాలించుటగడు సమస్యయే! శ్వేతజాతుల కంటె నల్లజాతులవారే అధిక సంఖ్యాకులు. దక్షిణాఫ్రికాలో శ్వేతజాతులకూ నల్లజాతులకూ ఉండవలసిన సంబంధ మెట్టిదో నిర్ణయించుట నేటివరకూ జరుగలేదు. ఇదియే నేటి ఆఫ్రికన్ సమస్యలలో ప్రధాన మయినది. ఆరంజి ఫ్రీస్టేట్, ట్రాన్స్వాల్ రాష్ట్రపార్లమెంటు సభలందు వీరు సభ్యులుగా నుండరాదు వీరికి ఓటింగ్ అధికారం లేనేలేదు. ఈ యూనియన్ ప్రభుత్వం ఏర్పడిన తరువాతకూడా, రాష్ట్రములందు వీరికి ఎట్టి పౌర హక్కులూ లేవు. భారతీయులు ప్రభుత్వమందు ప్రాతినిధ్యమునూ, వర్తకవ్యాపారములందు, పరిశ్రమలందు యూరోపియనులతో పోటీ చేయుటకు కావలసిన హక్కులనూ అభిలషించుచున్నారు. వీరు నేటివరకూ స్వేచ్ఛా, సాంఘిక, గౌరవ ప్రతిపత్తికి పోరాటం సాగించుచున్నారు. వీరికి కలిగిన బాధలను నివారించుటకు ఇదివరకు గాంధీ మహాత్ముడు సత్యాగ్రహ దీక్షను బూని ఆఫ్రికన్ యూనియన్ ప్రభుత్వముతో పోరాడి కొన్ని హక్కులను సంపాదించి పెట్టినారు. కొన్ని నిషేధములను యూనియన్ ప్రభుత్వము తొలగించిననూ, భారతీయుల ప్రధాన కోర్కెలను మాత్రం మన్నించలేదు.

యూనియన్ ప్రభుత్వ పూర్వప్రధాని జనరల్ "స్మట్సు" రాజమార్గమున భారతీయులను వంచించు శాసన మొకటి ఆఫ్రికన్ ప్రభుత్వము తలపెట్టెను. భారతీయు లందరూ ఐక్యకంఠముతో దానిని ఖండించి తమ అసంతృప్తిని ప్రకటించిరి.

దక్షిణాఫ్రికాలో ఆదివాసులూ భారతీయులూ కలసి ఐరోపియనుల విధానమును చాల వరకు ప్రతిఘటించుచూ వచ్చిరి నల్లజాతులకు తెల్లజాతులు చేసే అన్యాయమునకు సంబంధించినంత రకూ, ఆదివాసులు భారతీయులతో సహకరిస్తూ ప్రభుత్వ విధానమును ఖండిస్తూ వచ్చేవారు. ఇంక ఆఫ్రికన్ ప్రభుత్వం చూస్తే ఐక్యకంఠంతో తమ విధానాన్ని ఖండిస్తున్న నల్లజాతులలో నెగ్గలేమని, ఆఫ్రికన్ ఆదివాసులను నల్లజాతుల ఐక్యసంస్థనుండి విడదీసి భారతీయులపై పగసాధింప మొదలిడిరి. ఆఫ్రికాలో స్థిరనివాసములను ఏర్పరుచుకొన్న భారతీయులు అచ్చటి ఆదివాసులతో సంబంధ బాంధవ్యాలు పెంపొందించు కొనుచుండిరి. అచ్చటకల భారతీయులలో చాలామంది పేదవారు. ఆదివాసులలో చాలామంది ధనవంతులు కలరు. భారతీయులు వారితో సంబంధ బాంధవ్యాలు చేసికొని వారి ధనం దోచుకుంటున్నారని తీవ్రంగా ఆఫ్రికన్ పత్రికలు ప్రచారం చేయసాగేయి ఏదో విధంగా భారతీయులకూ, ఆదివాసులకూ, అభిప్రాయభేదాలు కల్పించుటనే ప్రధానలక్ష్యముగా, ఆఫ్రికన్ పత్రికలూ ప్రభుత్వమూ భావించాయి. ఆఫ్రికన్ జాతులను ప్రభుత్వం అనేక విధాలుగా భారతీయులపై రెచ్చగొట్ట నారంభించింది. ఆదివాసులకూ సౌకర్యాలు చేయలేక పోవడానికి కారణం, ఈ భారతీయులేనని విష ప్రచారం ప్రారంభించేరు. డర్బన్ ప్రాంతమందు ఆదివాసులు గృహములు, వసతులు లేక చాలా బాధపడుచున్నారు. ఆదివాసులు చాలామంది ఉండటకు యిళ్లు లేక పెద్దపెద్ద దొడ్లలో నివసిస్తున్నారు. వీరికి ప్రభుత్వం ఏవిధమైన సౌకర్యం కలిగించలేదు ప్రభుత్వంమాత్రం ఇందుకు భారతీయులే ముఖ్యకారకులను బదులు చెప్తూ వచ్చింది. ప్రతి చిన్న విషయానికీ భారతీయులే కారణమని ప్రచారం చేస్తూ ప్రభుత్వం ఆదివాసులను భారతీయులపైకి రెచ్చగొట్టింది.

దేశం అంతటా కల్లోలాలు చెలరేగే సూచనలు పెచ్చు పెరిగేయి. అధికంగా డర్బన్ రేవు పరిసర ప్రాంతాలలో మాత్రం పరిస్థితులు తీవ్రరూపం దాల్చేలాగ కనుపించెను. ప్రభుత్వ విష ప్రచారాన్ని నమ్మి ఆదివాసులు భారతీయులపై కత్తి గట్టేరు.

గత జనవరి నెలలో ఆదివాసులు అధికంగా కల డర్బన్ ప్రాంతపరిస్థితులు ఒక్కసారిగా తీవ్రరూపం పొందేయి. జనవరి 13 తేదీన డర్బనులో హఠాత్తుగా ఆదివాసులు భారతీయుల పైకి విరుచుకొని పడిరి. ఆదివాసులు తమ హత్యాకాండను ప్రారంభించేరు. ఈ కల్లోల సమయంలో పోలీసులు తటస్థంగా ఉన్నారు. ఇదే విధంగా ఆదివాసులు మరునాడు (జనవరి 14 తేదీన) హత్యలు సాగించేరు పోలీసుశాఖ ఉదాసీనత వహించడంవల్ల రెండు రోజులపాటు జరిగిన యీ కల్లోలాలలో 142 మంది భారతీయులు మరణించిరి. మరి 1087మంది గాయపడ్డారు. పరిస్థితులు యీ విధంగా ఉండడంచేత ప్రతి భారతీయుడూ తన ప్రాణాలపై ఆశ వదులుకున్నాడు. చాలామంది యూరోపియనులు యీ హత్యాకాండలో ప్రత్యక్షంగా ఆదివాసులకు సహాయం చేసేరు. కొందరు యీ సంఘర్షణలలో పాల్గొన్నారు భారతీయులను వెలివేయాలని, ఆఫ్రికా ఆదివాసులలో ఏళ్ళతరబడి ప్రచారం చేస్తున్న సంస్థలపట్ల ప్రభుత్వం ఏ విధమైన చర్యలూ తీసుకోలేదు

మిత్రరాజ్యసమితి అసెంబ్లీ సమావేశంలో డర్బన్ భారతీయుల ప్రతినిధిగా నియమింపబడ్డ "జార్జిసింగ్" ఏప్రెయల్ 13 తేదీన లండనులో మాటాడుతూ ఆఫ్రికన్ భారతీయులను గురించి యీవిధంగా అన్నాడు:

"దక్షిణాఫ్రికాలో భారతీయులు తమ నైతిక బలాన్ని నానాటికీ కోల్పోతున్నారనీ రాజకీయంగా, ఆర్థికంగా పరిస్థితులు విషమించడంచేత కొద్దివారి నైతిక శక్తి కుంటుపడుతున్నదనీ" హెచ్చరించాడు.

నేటి దక్షిణాఫ్రికన్ మలాన్ ప్రభుత్వం దేశంనుండి భారతీయులను తరిమివేయడానికి అనేక విధాలుగా ప్రయత్నించుచున్నది. మాతృదేశానికి పోతామన్న భారతీయులకు అధికంగా బోనస్ యివ్వడం మొదలిడెను. ఈ ఎరచూచి చాలామంది భారతదేశానికి పోయారు. ఎలాగైనా భారతీయులు దక్షిణాఫ్రికాను వదలిపోతే చాలన్న యూనియన్ ప్రభుత్వం ఇట్టివారికి అనేక సౌకర్యాలను కలిగించడం సాగించింది. గత జనవరిలో జరిగిన హత్యాకాండకు బెదరి, అనేకమంది భారతీయులు తమ జన్మహక్కులను వదలి స్వదేశానికి పోవాలని తలంచేరు. మార్చి నెలలో దాదాపుగా 64 మంది భారతీయులు దక్షిణాఫ్రికన్ యూనియన్‌ని వదలి భారతదేశానికి వచ్చారు.

డర్బన్ భారతీయుల హత్యాకాండను గురించి భారత ప్రభుత్వం దక్షిణాఫ్రికాయూనియన్ ప్రభుత్వమును విమర్శిస్తూ, తీవ్రమైన ఆధిక్షేపణ పత్రాన్ని నాజీ వలాన్ ప్రభుత్వమునకు అందజేసింది. ఆఫ్రికన్ ఆదివాసులు, ప్రభుత్వ విష ప్రచారాన్ని నమ్మి నారిమద్దతును చూచి, యీ హత్యలు కావించారని, ఆసియాలో చాలా దేశాలు ఆఫ్రికన్ యూనియన్ మలాన్ మంత్రివర్గాన్ని ప్రత్యక్షంగా విమర్శిస్తూ చాలా ఆలజడ చేసేయి. "తమపై యితర దేశాలు అన్యాయంగా అపోహ పడుతున్నాయనీ, న్యాయానికి వారికేమీ తెలియదనీ, డర్బన్ పరిస్థితులు యింతవరకూ విషమిస్తాయని తాము అనుకోలేదనీ" ఆఫ్రికన్ యూనియన్ ప్రభుత్వం మొండిగా సమాధానాలు యిచ్చింది. డర్బన్ భారతీయుల హత్యాకాండకు వారికికూడా ఎక్కువ కారణాలు తెలియవన్నారు. పరదేశాలు తమ ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగావిమర్శిస్తున్నాయనీ, తమపై తప్పు లేదనీ వాదించడానికి దక్షిణాఫ్రికన్ యూనియన్ ప్రభుత్వం ఒక విచారణ సంఘాన్ని ఏర్పాటుచేసి కల్లోలప్రాంత పరిశీలనకు పంపెను.

ఇంక యీ విచారణ సంఘాన్ని పరిశీలిస్తే ఒక ప్రభుత్వ న్యాయాధిపతి దీనికి నాయకత్వం వహించేడు. ఈ ప్రభుత్వం నియమించిన విచారణ సంఘం డర్బన్ పరిసరప్రాంతాలలో దాదాపు రెండునెలలు పర్యటన జరిపింది. అనేకమంది భారతీయ నాయకులవద్దనుండి సాక్ష్యాలు తీసుకొంది. విచారణ సంఘం ఎదుట సాక్ష్యమిస్తూ నేటాల్ భారతీయ సంస్థ సంయుక్త కార్యదర్శి మిస్టర్ "పి. ఆర్. పాథర్" "డర్బన్ అల్లరులకు మలాన్ మంత్రులే పూర్తిగా బాధ్యు"లని వివరించాడు. భారతీయుల పట్ల ఆదివాసులలో విద్వేషం రేగడానికి మంత్రులూ, రాజకీయ వేత్తలూమాత్రమే బాధ్యులని వక్కాణించేడు. అల్లరులకు ఆదివాసులు చెప్పిన కారణాలనుబట్టి చూస్తే కొందరు రాజకీయ నాయకులు యీ దుస్తంత్రం పన్నినట్లు కనిపిస్తోందనీ, భారతీయులను గురించి ప్రభుత్వం ప్రచురించిన రాజకీయ ప్రకటనలే యిందులకు ముఖ్యకారణమనీ మిస్టర్ పాథర్ సూచించేడు.

న్యాయానికీ భారతీయులకు వ్యతిరేకంగా వున్న ఒక వర్గంవారు ఆదివాసులతో ఏళ్ళ తరబడి ద్వేషాన్ని రేపుతూ వచ్చారు. న్యాయమూర్తి ఆధిపత్యం క్రింద వున్న యీ ప్రభుత్వ విచారణ సంఘం అన్యాయం చేయబోదని ఇదివరలో భారత ప్రభుత్వం ఆశించింది. వీరి ఆశలను పటాపంచలు చేస్తూ, చివరకు యీ డర్బన్ కల్లోల విచారణ సంఘ సభ్యులు ఒక నివేదికను తయారుచేశారు ఈ నివేదికలో ముఖ్యాంశములు యీ క్రింది విధంగా కలవు.

(1) కల్లోలానికి భారతీయులే పూర్తిగా బాధ్యులు.

(2) భారతీయులపైకి దౌర్జన్య చర్యలకు ఆదివాసులను ప్రేరేపించిన వారిలో యూరోపియనులు కొందరు కలరని అంగీకరిస్తూ, అయితే అలాంటివారు చాలా అరుదుగా మాత్రమే వున్నారని యీ నివేదికలో పేర్కొనబడింది. హత్యలు కొనసాగుతూ వుండగా పోలీసులు సోద్యం చూస్తూ నిలపడ్డారని, వారి ప్రత్యేక పోలీసులు కొందరు తెగేసి చెప్తూవుంటే యీ మాటకు ఏ విధమైన ఆధారం లేదనియూ, హత్యాకాండ ప్రారంభంకాగలదని ప్రభుత్వం పోలీసు శాఖను హెచ్చరించిన దనియూ యీ నివేదికలో కలదు.

వీటినిబట్టి చూస్తే విచారణ సంఘం మాటలు లోకం నమ్మగలదా?

హత్యాకాండకు మలాను మంత్రివర్గమే పూర్తిగా బాధ్యులని కొందరు సాక్ష్యమిస్తూ వుంటే, ఈ ఆరోపణ ఖండనకు వేరేమీ సాకు దొరకనందున "సమస్తబాధ్యతా భారతీయులదే" అని ప్రత్యారోపణ చేసింది. ఇంతే గాదు "ఆదివాసులు తిరిగి మీ పస పట్టవచ్చు" నని కూడా భారతీయులను బెదరించింది.

ఒక న్యాయమూర్తి విచారణ సంఘాధిపతి. కాని ఈ సంఘ నివేదికను కంచుకాగడాతో వెదికినప్పటికీ న్యాయం ఎక్కడా కొంచెం కూడా కానరావడం లేదు దక్షిణాఫ్రికా భారతీయుల ప్రాణ, మాన, విత్తాల రక్షణ నిమిత్తం భారతదేశ ప్రభుత్వం తీవ్ర చర్య తీసుకోవాలి.

ఇది యిలా వుండగా దక్షిణాఫ్రికా భారతీయుల స్థితిని గురించి ఇండియా ప్రభుత్వం తక్షణమే చర్య తీసుకోవాలని, డర్బన్‌లోని "ఇండియన్ ఒపీనియన్" పత్రికా సంపాదకుడు శ్రీ మణిలాల్ గాంధీ భారత ప్రభుత్వాన్ని హెచ్చరించేడు. ఇంకా యీయన యీ విధంగా వివరించేడు "దక్షిణాఫ్రికాలో అల్ప సంఖ్యాకుల వర్గానికి చెందిన భారతీయులకు రక్షణ కల్పించడానికి, మిత్రరాజ్య సమితిలో యీ విషయాన్ని యిండియా ప్రభుత్వం చర్చకు తీసుకురావలసిన సమయమిది. పౌర సత్వాలు లేకుండా భారతీయులు దక్షిణాఫ్రికాలో కాలక్షేపం చేయవలసి వస్తే అందుకు బాధ్యత వహించవలసింది ఇండియా ప్రభుత్వమే!!"

దర్బన్ కల్లోలాలపై ప్రభుత్వ విచారణ సంఘ నివేదికను చూచి దక్షిణాఫ్రికా భారతీయ ప్రతినిధి మిస్టర్ "కచాలియా" యీ క్రింది విధంగా విమర్శించేడు: ఈ నివేదిక అసమగ్రంగా ఉందనీ, ఆదివాసుల ప్రతినిధులు చాలా తక్కువ మంది మాత్రమే, యీ కమీషన్ యెదుట సాక్ష్యమిచ్చేరని ఇతడన్నాడు.

కాని మొత్తం మీద యీ నివేదికను చూస్తే జడ్జీలు యిచ్చిన తీర్పులా గాక, ప్రభుత్వంతరఫు నున్న పత్రికలనూ, ప్రభుత్వోద్యోగుల చర్య

(20 వ పేజీ చూడుడు)

గృహాధి దేవత

(8-వ పేజీ తరువాయి)

వులు కొనడంలోనూ, వస్తువుల నెంచడంలోనూ ఆమె వివేకం ఉన్నత ప్రభుత్వోద్యోగులలో కూడా అపురూపమే. పిల్లలు పసివారుగా ఉన్నప్పుడు వారి దుస్తులు ఆమే తయారుచేసేది. దాదాపు తన దుస్తులన్నీ ఆమే తయారుచేసుకుంటుంది.

ఒకపర్యాయం ఆమె ఇంటికి వెళ్లినప్పుడు చిన్న పడక గది గోడలకి కాగితా లంటిస్తోంది "ఈ పనుల్లోకి మనస్సు త్వరగా చొరబడదు. ఒకసారి ప్రారంభిస్తే చాలు అదే చరచరా నడచిపోతుంది. ఆమె తీరికసమయాల్లో పుస్తకాలు చదివేది. భర్తకి ఆఫీసుకాగితాలు రాసిపెట్టేది. వీణ వాయించేది. పిల్లలకి వీణ, సంగీతం నేర్పేది. పిల్లల పాఠాలు తను కూడా చదివి వాళ్లకి బోధపరిచేది. బిడ్డలకి సుబోధకంగా విజ్ఞానవిషయాలు చెప్పడం ఉపాధ్యాయునికంటే తల్లికే సులువు. అది సహజం. తరవాత బిడ్డలు పెద్దవారై కాలేజీలకి వెళ్ళ ఆరంభించిన తరవాత ఆమెకి తీరిక అధికంగా ఉండేది. పేటలో సమాజవ్యవహారాల్లో శ్రద్ధ వహించేది. విద్యాలయ వ్యవహారాల్లో శ్రద్ధ వహించేది. ఆమెవలె జీవితంలో ప్రజ్ఞావిశేషాలు ప్రదర్శించిన స్త్రీలు అరుదు.

"కాని నా జీవనోపాధిని నే నార్జించుకోడం లేదుగదా! భర్తపైనే ఆధారపడి ఉండాలి గదా!" అంటారు కొందరు.

కుటుంబం సమిష్టి వ్యవహారసంస్థ అనే విషయాన్ని గుర్తించుకుంటే పై చింత నిరాధారమైనదని గ్రహించవచ్చును. భర్తలు తమ ధనోపార్జనవల్ల సంసారాని కెంత కర్తవ్య బాధ్యతలు నిర్వహిస్తున్నారో, భార్యలు కూడా తమ గృహకార్యనిర్వహణవల్ల సంసారాని కంత కర్తవ్యబాధ్యతలూ నిర్వహిస్తున్నారు. దేశంలో లక్షలాది వనితాజనం ఈ కార్యంలో నిమగ్నులై ఉన్నారు. సంఘజీవనంలో ఒక ప్రధాన కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నారు వాస్తవానికి వారి కార్యనిర్వహణల మూల్యాన్ని గుణించండి. వారు చేస్తున్న కార్యాలకు నౌకర్లని వినియోగించవలసినా, లేక వ్యాపార సంస్థలకు ఒప్పగించవలసినా, ఎంత ధనం వెచ్చించవలసిఉంటుందో లెక్కగట్టండి. గృహకార్యాలకోసం చేసే వ్యయంలో నూరింట 80 వంతులు ధనం, మిగతాది గృహిణి పరిశ్రమ. ఆదాయలోపంవల్ల గృహజీవనానికి లోపం కలగకుండా, కొన్ని అవసరాలకి ధనం వ్యయపరిచే బదులు ఇల్లాలు శరీరపరిశ్రమ చేసి ఆ లోటు తీరుస్తుంది.

తల్లిలేని లోటును ధనంతో తీర్చగలవారెవరు? కొనే ప్రతివస్తువునీ పదిమార్లు తగునా తగదా అని ఆలోచించి నిర్ణయించగల నౌకర్లు ఎక్కడైనా దొరుకుతారా? పాదుపు, తాహతు మొదలైనవి యోచించి ఖర్చుపెట్టగలవారు దొరుకుతారా? నౌకరు చాకర్లలోగాని, విద్యావంతులైనవారిలోగాని ధన మిచ్చి ప్రేమ కొనాలంటే ఎవరైనా దొరుకుతారా? ఆపేక్ష కొనడానికి దొరుకుతుందా? నిద్రాహారాలుకూడా మాని ఏకాగ్రతతో సంరక్షణ చేసేవారు వేరె ఎక్కడైనా దొరుకుతారా? వేతన మిచ్చి నియమించగలవారు దొరుకుతారా?

స్త్రీలు ఉద్యోగాలు చేసి ఆర్జించే ధనంకంటె, గృహంలో స్వయంగా కార్యాలన్నీ నిర్వర్తించి ఆదాచేసేధనం చాలా అధికం.

జీవితం ఆటుపోటుల్లో ప్రేమపూర్ణ అయిన గృహిణి శ్రద్ధాన్విత కార్యనిర్వహణ, ఏకాగ్రత, త్యాగసహనాలతోడ్పాటు లేకపోతే ఎంతమంది పురుషుల జీవితాలు ధ్వంసమైపోతాయి. ఎన్ని సంసారాలు విచ్ఛిన్నమైపోతాయి? గృహిణి అచంచల విశ్వాసాలే లేనిచోట సంసారజీవనం అధఃపతన మైపోతుంది. ఈ సత్యం సర్వదేశాల్లోనూ సర్వవర్గాల్లోనూ నిరూపించబడింది.

ఒక రన్నారు "ఒక మహత్తరవ్యక్తిని చూడగానే ఒక మహత్తర మాతృమూర్తి దివ్యరూపాన్ని పరోక్షంగా గమనించగలుగుతాం" కాని మహామేధావులు ప్రజాసమూహాలకు కీర్తి ప్రశంసలకు దూరంగా ఏకాగ్రతతో కృషిచేసి కార్యసాధన చేసినట్లే, తల్లికూడా ప్రత్యక్ష ప్రశంసలకు దూరంగా ఉండి దీక్షపరిశ్రమ చెయ్యాలి. మాతృదేవి చేసేసృష్టి దీర్ఘకృషి ఫలితం. వరప్రసాదమైన మహిమాన్విత లక్షణాలవలె తక్షణం ప్రకాశించవు. ఉత్తమపురుషులకు ఉత్తములే తల్లులుగా ఉండడం లోకవిదితం. బిడ్డలు నైతికప్రమాణాలు, ఆశయాలు, ఆదర్శాలు, ధైర్యసాహసాది లక్షణాలు తల్లులవద్దనే నేర్చుకుంటారు.

ఆహార మిచ్చి పోషించేవారు, పసిబిడ్డల జీవనానికి ఆరంభంలో వాతావరణం కల్పించేవారు, ఊహ లూదిపోసేవారు, గృహాని గ్యాతలు అయినవారే నాగరికతలు సృష్టించి పునస్సృష్టించేవారు. వారే మానవధర్మానికీ సభ్యతకీ కర్తలు అటువంటప్పుడు చేసేపని నౌకరి అని హీనపరించుకోవడ మెందుకు? చిన్నబుచ్చుకోవడ మెందుకు? గృహిణి అనీ, గృహాధిదేవత అనీ, ఉద్యోగాలలోకెల్ల అత్యుత్కృష్టమైన ఉద్యోగ మనీ ఎందుకు చెప్పకోరాదు?

దక్షిణఆఫ్రికా: నాడు నేడు

(19-వపేజీ తరువాయి)

లనూ, వారి విధానాన్నీ సర్థిస్తూ ప్రచురించబడిన ఒక ప్రభుత్వ రాజకీయకరపత్రంలా ఉన్నది.

పరిస్థితులు యిలా ఉండగా భారతదేశం, దక్షిణాఫ్రికన్ యూనియన్‌తో తమకు గల వాణిజ్యసంబంధాలను తెగతెంపులు చేసుకొని, డర్బన్‌లో కల భారతీయ హైకమీషనర్‌ను వెంటనే వెనుకకు పిలిపించి వేసింది. ఇంకనూ భారత ప్రభుత్వం ఏప్రియల్‌లో జరిగిన మిత్రరాజ్యసమితి అసెంబ్లీ సమావేశంలో ఆఫ్రికన్ యూనియన్‌లో కల భారతీయుల స్థితిగతులను గురించి చర్చించడానికి మిస్టర్ యం. సి. సెటల్వాడ్"ను లేక్‌సక్సెస్‌కు పంపించింది. దక్షిణాఫ్రికన్ యూనియన్ నాజీ మలాన్ ప్రభుత్వ ప్రతినిధి మిస్టర్ "ఎరిక్‌లో" భారతీయులకు వ్యతిరేకంగా లేక్‌సక్సెస్‌లో వాదించుటకు అమెరికా వెళ్ళేడు. ఇంక నేటాల్ ఇండియన్ కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ నాయకర్ లేకసక్సెస్ వెళ్తే తమ గుట్టుబయటపడుతుం దని ఆఫ్రికన్ యూనియన్ ప్రభుత్వం అతనికి అమెరికాకు ప్యాస్‌పోర్టు యివ్వడానికి నిరాకరించింది అప్పటికి లండన్‌లో వున్న ట్రాన్స్‌వాల్ ఇండియన్ కాంగ్రెసు అధ్యక్షుడు మిస్టర్ "దాదూ" అమెరికా వెళ్ళడానికి అమెరికన్ ప్రభుత్వం ప్యాస్‌పోర్టు సౌకర్యాలు కలిగించలేదు. అందుకనే "దాదూ" లండన్‌లోనే ఉండి పోవలసి వచ్చినది. కాబట్టి దక్షిణాఫ్రికా ఇండియన్ కాంగ్రెసువారు మిస్టర్ సింగ్ తమ ప్రతినిధిగా పంపేరు. అదేసమయానికి ఇండియాలో వున్న దక్షిణాఫ్రికన్ ఇండియన్ కాంగ్రెస్ కార్యనిర్వాహక సభ్యుడు మిస్టర్ ఎం. డి నాయుడు, ఆఫ్రికన్ భారతీయుల సమస్యలను గురించి మిత్రరాజ్య సమితి అసెంబ్లీ సమావేశంలో చర్చ జరిగినపుడు ఇండియన్ ప్రతినిధివర్గానికి అనధికార సలహాదారుడుగా వ్యవహరించడానికి ఏప్రియల్‌లో అమెరికాకు వెళ్ళేడు.

ఏ దేశపు అంతరంగిక విషయాల్లో జోక్యం కలిగించుకుందికి, మిత్రరాజ్య సమితికి, సమితి సూత్రాల ననుసరించి అధికారం లేదని, మిస్టర్ ఎరిక్‌లో మొండిగా వాదించడం ప్రారంభించెను. కాని ఇటీవలనే ఐక్యరాజ్య సమితిఆమోదం పొందిన మానసత్య సిద్ధాంతాల ననుసరించి భారతీయుల పట్ల దక్షిణాఫ్రికా ప్రభుత్వ విధానాన్ని విమర్శిస్తూ, ఐక్యరాజ్య సమితి అట్టి విషయం తప్పక చేర్పించవలసిందని, భారత ప్రతినిధి మిస్టర్ సిటల్వాడ్ వాదించేడు. ఐక్యరాజ్య సమితి ఒక కమీషన్‌ను పంపి దక్షిణాఫ్రికా భారతీయుల స్థితిగతులను విచారింపవలెనని భారత ప్రతినిధి ప్రతిపాదించిన తీర్మానానికి అనుకూలంగా 21 దేశ ప్రతినిధులు ఓట్లుయిచ్చారు. యీ తీర్మానానికి ప్రతికూలంగా ఓటు చేసిన బ్రిటన్, అమెరికాలతో సహా 17ఓట్లు వచ్చాయి. ఇందులో 12 దేశాలు మాత్రం తటస్థంగా ఉన్నాయి. సమితిలో దక్షిణాఫ్రికా ప్రతినిధి ఎరిక్‌లో ప్రతి పాదించిన తీర్మానం వీగిపోయింది. చిట్టచివరకు ఫ్రెంచి, మెక్సికన్ ప్రభుత్వ పతినిధులు భారత, పాకిస్థాన్, దక్షణాఫ్రికా ప్రభుత్వాలు తమ ప్రతినిధులతో ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని పై విషయానికి సమాధానం తెచ్చుకోవాలని సూచించారు. ఇందుకు ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికాలు మాత్రమే ప్రతికూలంగా ఓటుచేశాయి.

తరువాత ఐక్యరాజ్య సమితి సర్వసభ్య సమావేశంలో యీ విషయం చర్చకు వచ్చింది. ఇచ్చట కూడా ఇది కేవలం అంతరంగిక విషయం అని ఆఫ్రికన్ యూనియన్ ప్రతినిధి ఎరిక్‌లో వాదించేడు. కాని భారత ప్రభుత్వ ప్రతినిధి సిటల్వాడ్ తన తీర్మానాన్ని అంగీకరించవలసిందని ఏమాత్రం సమితిని ఒత్తిడి చేయలేదు. చివరకు ఫ్రెంచి మెక్సికన్ ప్రభుత్వ ప్రతినిధులు సూచించిన రౌండ్ టేబుల్ సమావేశానికి ఉభయులూ అంగీకరించేరు

కాని దక్షిణాఫ్రికన్ ప్రభుత్వ ప్రతినిధి ఎరిక్‌లో వాదన చూస్తే ఐక్యరాజ్య సమితి ఆదేశాన్ని మలాన్ ప్రభుత్వం ధిక్కరించటానికి ఏమాత్రం జరవనట్లు కనిపిస్తోంది. అందుచేత సమితి సూచన ఏమాత్రం ప్రయోజనకారి కాదని స్పష్టపడుచున్నది. మానసత్య సిద్ధాంతాల ననుసరించి దక్షణాఫ్రికాలో మలాన్ ప్రభుత్వం భారతీయులను ఆదరిస్తోందో లేదో అనియూ, ఐక్యరాజ్య సమితి సూత్రాలను జాగ్రత్తగా పాటిస్తోందో లేదో అనియూ రౌండ్ టేబుల్ సమావేశం జరగాలట

అమెరికాకు వెళ్లిన దక్షిణాఫ్రికన్ భారతీయ నాయకుడు మిస్టర్ ఎం. డి నాయుడు బహుశా యీ రౌండ్ టేబుల్ సమావేశం జరగక పోవచ్చునని సూచిస్తున్నాడు

కాని మలాన్ ప్రభుత్వ ప్రతినిధి మిస్టర్ ఏరిక్‌లో వాదన చూస్తే ఐక్యరాజ్య సమితి ఆదేశం కేవలం నిష్ప్రయోజనం లాగ కనపడుతోంది.

మనరాష్ట్రం - మనదేశం

(9 వ పేజీ తరువాయి)

భావిస్తారు. కాని, పైన చెప్పిన లక్షణాలు ఒక పక్షంలో లేనప్పుడు, వా రంగీకరించినా నిష్ప్రయోజనమే కాగలదు. అందువల్ల నాలుగా లాజానో చెప్పిన వాక్యాలపై అంతగా విశ్వాసం ప్రజలకిగాని, నాయకులకిగాని కలగదు.

కొలంబియా ప్రభుత్వ ప్రతినిధియైన నాలుగా లాజానో స్వదేశ రాజకీయాల ఫలితంగా కాశ్మీర్ కమిషన్‌నుంచి రాజీనామా నిచ్చాడు అతని తరపున తాత్కాలికంగా సాంపర్ సభ్యుడుగా ఉంటాడు.

ఒకవైపున కమిషన్ మధ్యవర్తిత్వ వ్యవహారాలు నడుస్తుండగా మరొకవైపున పాకిస్తాన్ కాశ్మీర్‌లో తన తంత్రాలను తీవ్రంగా ఆచరణలో పెడుతోంది. సర్వసైనికసన్నాహాలూ చేస్తున్నదనీ, యుద్ధవిరామానికిగాను గిరిగీసిన చోట వివిధ కేంద్రాలలో సైనికబలాలను కేంద్రీకరిస్తున్నదనీ వార్తలు వస్తున్నాయి. గిల్గిట్‌లో వైమానికబలాన్ని కేంద్రీకరించిం దట. కొన్ని విదేశప్రభుత్వాల సహాయంతో పాకిస్తాన్ తన విమానదళాన్ని వృద్ధిపరుచుకుంది. ఈ పర్యాయం విమానాలను కూడా వినియోగించి వారు దాడిచెయ్యవచ్చును. పఠాన్లకి బదులు పాకిస్తాన్ సైనికులు ఆజాద్ కాశ్మీర్‌లో గుంపులు గుంపులుగా ప్రవేశించినట్లుకూడా వార్తలు వస్తున్నాయి.

ఈ పరిస్థితిలో కాశ్మీర్ కమిషన్ ప్రతిపాదనలు సమస్యను పరిష్కరించలేకపోయినా యుద్ధ విషయం బహిర్గత మైతే వెంటనే అక్కడ యుద్ధం ప్రజ్వలించవచ్చునన్న భీతికొద్దీ కమిషన్ పైపైగా అందరినీ జోకొడుతూ ఉండవచ్చునని కొందరి అభిప్రాయం.

దనికితోడు పాకిస్తాన్ ప్రచారం కాశ్మీర్‌లో నానాటికీ హెచ్చుతోంది కాశ్మీర్‌లో ఆహారం కొరవై లక్షలాది ప్రజలు మలమల మాడిపోతున్నారని ప్రచారం చేస్తోంది. తియ్యని మాటలతో లోని విషాన్ని కప్పపుచ్చాలనీ, కాశ్మీర్ ప్రజల ఆదరణ పొందాలనీ పాకిస్తాన్ యత్నిస్తోంది. షేక్ అబ్దుల్లా పరిపాలనలో ఉన్న ప్రాంతాలకి ఇండియావారైతే ఆహారం సప్లై చెయ్యగలరని భారతప్రభుత్వానికి ఇవ్వజూపింది భారతప్రభుత్వం ఈ ప్రసాదాన్ని నిరాకరించి, ఇది రాజకీయ తంత్రమే కాని దాక్షిణ్యం కాదని చెప్పింది. పాకిస్తాన్ మంత్రులకీ, నాయకులకీ అంత దాక్షిణ్యభావమే ఉంటే భారతదేశానికి రవానాచెయ్యగలరని ఒప్పందంలో అంగీకరించిన ప్రకారం లక్ష 75 వేల టన్నుల బియ్యం సప్లై చెయ్యలేకపోయిందా? పేరుకి ఒక్క టన్ను బియ్యంకూడా రవానా చెయ్యలేదు. పాటి ప్రభుత్వంతో ప్రభుత్వ హోదాలో చేసుకున్న ఒడంబడికనే పాటించలేని ప్రభుత్వం ఇటువంటి తియ్యని మాటలు చెప్తే నమ్మేవారెవరు? షేక్ అబ్దుల్లా ప్రభుత్వం ఈ 'దానం' అనవసర మని చెప్పి నిరాకరించింది. వాస్తవానికి కాశ్మీర్‌లో గత వత్సరం పంటలు పాడైపోయినప్పుడు భారత ప్రభుత్వం సమృద్ధిగా ఆహారం సప్లై చేసింది. కాశ్మీర్ అంత ఆహారాన్నెన్నడూ చూసి ఉండరు. కావలసినది 31 వేల టన్నులు. ఈ కాస్త మొత్తం సప్లై చెయ్యడం భారత ప్రభుత్వానికి కష్టమని తలచడంకూడా హాస్యాస్పదం. పాకిస్తాన్ మోసానికి కాశ్మీర్ లోబడలేదు.

పాకిస్తాన్‌తో వాణిజ్యసంధి:

ఒడంబడికలకోసం సంప్రదింపులు జరిగే వరకూ పాకిస్తాన్ చాలా అనుకూలభావం కనపరుస్తుంది అయితే క్రియలో సవ్యంగా వారు పాటించిన ఒడంబడిక ఒక్కటీ లేదు. అయినా భారతప్రభుత్వం ఒడంబడికలు చేసుకోడం మానకుండా సహనం చూపుతూ వస్తోంది. ఈవారంలో ఎగుమతిదిగుమతి వర్తకానికి సంబంధించిన ఒడంబడిక ఒకటి భారత పాకిస్తాన్‌ల మధ్య అంగీకరించబడింది. కరాచీలో సంతకాలైనాయి. భారతదేశంనుంచి ఉక్కు, బొగ్గు, ప్రత్తి, నారతో తయారైన వస్తువులు, రసాయనిక పదార్థాలు, ఉప్పు, నూనెలు, వనస్పతి మొ॥ వానిని భారతదేశం పాకిస్తాన్‌కి ఎగుమతి చేస్తుంది. ముడినార, ప్రత్తి, కొండఉప్పు, తోళ్లు, చర్మాలు మొదలైనవానిని పాకిస్తాన్ భారతదేశానికి పంపుతుంది. వీలైనంతవరకూ ఉభయదేశాలూ తమ అవసరాలను తీర్చుకుంటూ ఎగుమతి దిగుమతుల విలువ దాదాపు సమానంగా ఉండేవిధంగా వివరాలు నిర్ణయించుకోడానికి ఉభయప్రభుత్వాల ప్రతినిధులూ సమ్మతించారు. గతసంవత్సరం మేనెలలో చేసుకున్న ఒడంబడికను పాకిస్తాన్ తృప్తికరంగా అములు జరపలేదు ఇప్పుడు ఉభయులూ సక్రమంగా అమలు జరపగల రని ప్రకటనలు చేశారు. [సీతారాం]

కాలక్షేప కబుర్లు

"శతమానం భవతి..."

శ్రీ జి. యన్. సూరి

నూరేళ్లు వెళ్లతీయాలనే వాంఛ నూటికి నూరుమందికీ ఉంటుంది. ఏవో కారణాంతరాలవల్ల బ్రతుకుమీద విరక్తి కలిగినవాళ్లు తప్ప ప్రతివ్యక్తి ఆ గడువును అందుకోటానికి ప్రయత్నిస్తూనే ఉంటాడు. సాధారణ మానవుడి లెక్క ప్రకారం ఇదే జీవితపరిమితి.

జ్యోతిష శాస్త్రం ఈ పరిమితిని నూట ఇరవై దాకా పెంచింది. అంతేకాదు. దేవుడు మేలు చేస్తే, గ్రహబలం బాగుంటే, జీవుడు మొండికేస్తే, మరొక పందుకూడ కొట్టవచ్చునని నిర్ధారణ చేసింది. జననకాల మహాదశతో తిరిగి ప్రారంభించి, ఏ మారకగ్రహమో "ఈ తడవ నన్ను తప్పించుకొని ఎక్కడికి పోతావు?" అని గుట్టుపట్టి మరిపించేదాకా కాలం లాగవచ్చు.

ఆయుర్దాయాన్ని అధికం చేయటానికి ఎన్ని అగచాట్లయినా అనుభవిస్తారు. ఆరోగ్యానికి భంగకరంగా పరిణమించే అలవాట్లను మానివేస్తారు. జిహ్వాచాపల్యంగా ఉండే పదార్థాలను విసర్జిస్తారు. కనబడిన మందును మాకును సేవిస్తారు. రుద్రాభిషేకాలు చేయిస్తారు. జపతపాదులను ఆరంభిస్తారు. వీలైతే కాయకల్పచికిత్సను పొందుతారు. కోతుల గ్రంథులను అతికించుకుంటారు. నూరవ పడిలో పడటానికి యమయాతన ఈ లోకంలోనే అనుభవిస్తారు.

ఈమధ్య పత్రికలలో ఒక వింతవార్తను చదివే ఉంటారు. హైలరు అనే ఎనభయ్యేళ్ల పెద్దమనిషి ఆంగ్లేయభిషగ్వరులను ఖంగారు పెడుతున్నాడు. ఎలెక్ట్రిషియన్‌గా పనిచేసి పదవీవిరమణ కాగానే పెన్షన్ పుచ్చుకున్నాడు. తరువాత కొంతకాలానికి పెద్దతనపు జాడ్యాలకు గురికావటంవల్ల కృశించిపోవటం మొదలుపెట్టాడు. డాక్టరుగారు ఆ మందూ ఈ మందూ వాడి, లాభంలేదని తేల్చి, గడువుసమీపించింది, విల్ నామా వ్రాస్తే మంచిదని సూచించాడు.

ఇలు అంతంతమాత్రాన కాళ్లు పారజాపే మనిషి కాడు. ఒక్క నమస్కారం పెట్టి డాక్టరును వదిలించుకున్నాడు. అటకమీద ఉన్న పాతపుస్తకాలను తిరగేయటం మొదలుపెట్టాడు. ఈ పుస్తకాలన్నీ ఆయన అవ్వగారిద్వారా సంక్రమించినవి. ఆ మె కాలంలో అవ్వగారు వనమూలికల వైద్యురాలుగా ఉండేదిట. పేజీలు తిప్పగా తిప్పగా ఒక ప్రక్రియ దొరికింది. ఎవ్వరితో చెప్పకుండా రోజూ సమీపంలో ఉన్న అడవికి వెళ్లేవాడు. లేని ఓపిక తెచ్చుకుని జాబితాలో ఉన్న కుందేటి కొమ్ము, పెద్దపులిజున్ను లాంటి వస్తుసామగ్రిని సేకరించాడు. తలుపులు బిగించి పుటాలు పెట్టాడు. అరఖులను తీశాడు. మాత్రలను కొట్టాడు, కషాయాలను కాచాడు. కావలసిన మోతాదులలో అన్నిటిని కలిపి ఒక పసుపుపచ్చని ద్రావకాన్ని సీసాలోకి ఎక్కించాడు.

ప్రొద్దుటా, సాయంత్రం ఈ ద్రావకాన్ని, తేనె పండురసం మొదలైన అనుపానాలతో సేవించాడు. ఒక మండలం రోజులు గడిచేప్పటికి నడుమునొప్పి తగ్గి నిటారుగా నిలబడగలిగాడు. ముడతలుపడ్డ శరీరం నానినశెనగగింజలాగా తయారయింది. చూపు చురుకుఅయింది. ఊరంతా చుట్టివచ్చినా అలసట అనిపించేదికాదు. రాలిపోయిన జుట్టు మొలకలెత్తింది. క్రమంగా నెరుపుపోయి నల్లబడటం సాగించింది. ఊడిపోయిన దంతాలకు బదులు కొత్తపళ్లు బయలుదేరినవి. రోజురోజుకు యువకుడుగా మారిపోతున్నాడు.

పాత డాక్టరుగారు వచ్చి మూసిన నోరు మూయక చూశాడు. లండన్ వైద్యనిపుణులను పిలిపించి చూపించాడు. ఈ మార్పుకు సమాధానం చెప్పలేకపోయినారు. ఆ మహాద్రావకం ఒక సీసాడు ఎవరికి వాళ్లు కాజేశామని హైలరును బ్రతిమాలారు. అవ్వగారి రహస్యం బయటపెట్టటానికి వీలు లేదన్నాడు హైలరు. ఆ మందు పద్ధతిని లక్షలరూపాయలిచ్చి కొనేందుకు సిద్ధంగా ఉన్నారు పేటెంటుమందుల వ్యాపారస్థులు. రహస్యంమాత్రం బయటికి వచ్చేట్లు కనబడదు. ప్రభుత్వంవారు వశపరచుకొని, జాతీయంచేసి, చర్చిల్‌లాంటివారిమీద ప్రయోగంచేసి, జనబాహుళ్యానికి అందుచేస్తే తప్ప ఈ మహాద్రావకం హైలరుహయాంతో అదృశ్యమై పోక తప్పదు.

ఇటువంటి ప్రక్రియలు మన దేశంలో ఎన్నో ఉన్నట్లు అప్పుడప్పుడు వింటూనే ఉంటాము. పండిత మదనమోహన మాలవ్యాగారికి కాయకల్ప చికిత్స చేసిన యోగి రెండవ వంద సమీపిస్తున్నానని చెప్పేవాడు. మీసాలు గడ్డాలు తుమ్మెదరెక్కలలాగా ఉండేవి. మనిషి చూస్తే పిడుగల్లే ఉండేవాడు. కాని చికిత్సపుచ్చుకున్న మాలవ్యాగారు శతవృద్ధులైనా అందుకోలేకపోయినారు. కాని చికిత్సపొందిన మొదటిరోజులలో చాలవరకు మారినట్లే ఫోటోలలో చూసేవాళ్లం. అసలు చికిత్స కుతట్టుకోలేడని నమూనా ఇంతవరకే చేసి చూపించాడు కాబోలు గోసాయిమహారాజ్.

పురాణాలను పరిశీలిస్తే నూరేళ్లు బ్రతకటమనేది ఏమంత చెప్పుకోదగిన విషయం కాదని తోస్తుంది. దశరథుడు వేలసంవత్సరాలు రాజ్యం చేశాడుట. వేదవ్యాసుడు ఎప్పుడు పుట్టాడో ఎప్పుడు పరమపదించాడో ఎవ్వరికీ తెలియదు. ఈలాంటి దీర్ఘజీవులేగాక అశ్వత్థామ, ఆంజనేయులు మొదలైన చిరంజీవులు ఎందరో ఉన్నారు. ఏ హిమాలయ పర్వతాలలోనో తపస్సు చేస్తున్నారుట. చిరంజీవులైన తరువాతకూడా ఇంకా తపస్సు ఎందుకో మాకుమాత్రం బోధపడదు.

ఘోరతపస్సు చేస్తే భగవంతుడు ప్రత్యక్షమై నీకు ఏమి వరం కావాలో కోరుకోమనేవాడు. ఈ కోరిన వరాలలో చాలవరకు ఆయుర్దాయానికి సంబంధించినవే. మార్కండేయులు అలాంటివాడు. హిరణ్యకశిపుడు న్యాయశాస్త్రం చదివినవాడు కాబట్టి బందోబస్తుగా ఉండే వరాన్ని కోరాడు.

ఆయన ఇచ్చిన వరాన్ని రద్దు చేయటానికే భగవంతుడు ప్రత్యేకంగా అవతారం ఎత్తవలసి వచ్చింది. ఏ భస్మాసురుడు లాంటి ఆటకాయితనపు వింత కోర్కెలో తప్ప తపస్సు చేశారంటే దాదాపు చిరంజీవులైనట్లే.

ఆ కాలంలో ఎట్లావున్నా ఈనాడు ప్రతి మానవుడూ నూరేళ్లూ కళ్లజూడటం కోరతగిన వరంగా కనబడటం లేదు. ఈ రేషను రోజులలో తిండికి తట్టుకోవటమే కష్టంగా ఉంటుంది. పైగా ప్రతివాడూ నూరేళ్లు బ్రతికితే పెన్షను ఇవ్వలేక ప్రభుత్వం కుంగిపోతుంది. ఇంకా కొత్తరకం పన్నులు విధిస్తుంది. అరవై దాటినవారు ఏడాదికి ఒక రూపాయ చెల్లించవలసిన దనవచ్చు. అంతేగాక వయసు మీరినకొద్దీ కష్టాలు ఎక్కువ కాగలవో, సుఖాలు ఎక్కువ కాగలవో చెప్పటానికి వీలు లేదు. నడివయసు దాటిన తరువాతకూడ ముసలి తండ్రుల అదుపు ఆజ్ఞలలో ఉండటానికి కొడుకులు నొచ్చుకోవచ్చు. ఎంత కాలానికీ పట్టువిడుపు పుచ్చుకోని అత్తగార్ల ధాటికి కోడళ్లు నిలవలేకపోవచ్చు. మొత్తంమీద ఆలోచించి చూస్తే ఆయుర్దాయం పెరుగుతుందంటే ఆశ కాకపోయినా శతమానమాత్రం అంగీకారం ఏమంత ఆకర్షణీయంగా కనబడటం లేదు.

నేటి ప్రపంచం

(౬-వ పేజీ తరువాయి)

తప్పకుని పోతుండగా, బ్రిటిషు నౌకలు బహిరంగంగా వర్తక వ్యాపారాలు చేస్తున్నాయి. బట్టర్‌ఫీల్డు అండ్ స్వైర్ అనే బ్రిటిషు నౌకారవాణాసంస్థ కమ్యూనిస్టు ప్రభుత్వం కంట్రాక్టులు తీసుకున్నట్లు, ఆ కంపెనీ భారీపరిశ్రమలకు కావలసిన యంత్రసామగ్రిని సప్లై చెయ్యడానికి అంగీకరించినట్లు హాంకాంగ్‌నుంచి వార్త వచ్చింది.

ఈ కంపెనీ ఇదివరలో హాంకాంగ్‌నుంచి సెంట్రల్‌కు ఓడరవాణా వ్యాపారం చేసినప్పుడు, (అనగా జాతీయప్రభుత్వం పరిపాలనలో) వారికి నష్టం వచ్చేది. ఇప్పుడు నష్టం లేకుండా రాబడి ఖర్చుకి సరిపోతుందని కంపెనీ అధికారులు చెప్తున్నారు. మొత్తానికి బ్రిటిష్, అమెరికన్ వ్యాపారస్థులు, ప్రభుత్వప్రతినిధులు కొమింటాంగ్ ప్రభుత్వాన్ని విడిచిపెట్టి కమ్యూనిస్టులతో వ్యాపారం సాగిస్తున్నారు. ఇంక చీనాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని గుర్తించే విషయమై ఇప్పుడిప్పుడే విదేశవ్యాపారస్థులు తొందరపడకపోవచ్చును. కొరియా, జపాన్ సమస్యల చర్చల్లో అమెరికా, రష్యాల వైఖరి తేలేవరకూ, అనగా ఆ సంప్రదింపుల్లో చీనా కమ్యూనిస్టు ప్రభుత్వం పాల్గొనే సమస్య వచ్చేవరకూ వారు తొందరపడకపోవచ్చును.

ఇండొనీషియా:

ఇండొనీషియాలో డచ్చి-రిపబ్లికన్ వర్గాల మధ్య అన్ని అంశాలపైనా సమాధానం కుదిరింది. దీనికి ఐక్యరాజ్యసమితి నియమించిన ఇండొనీషియా కమిషన్ కృషియే హేతువని వార్తాసంస్థలు ప్రశంసించాయి. జోగ్జకర్తా నగరాన్ని డచ్చిసేనలు ఖాళీ చేయటం పూర్తి అయింది. త్వరలో రిపబ్లికన్ అధికారులు నగరంలో తమ ప్రభుత్వాన్ని స్థాపించుకుంటారు. జోగ్జకర్తా సుల్తాన్ ఈలోగా అక్కడ శాంతిభద్రతల బాధ్యత వహిస్తున్నాడు. రిపబ్లిక్ అధ్యక్షుడు డా॥ సొకర్నో తిరిగి అధ్యక్షపదవి స్వీకరిస్తాడు డా॥ హట్టా ప్రధానిపదవి స్వీకరిస్తాడు. ఈ నాయకులు తాత్కాలిక రిపబ్లికన్ ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి తమ సైన్యాలన్నిటికీ యుద్ధం విరమించాలని ఆజ్ఞ ఇవ్వగలరు.

డచ్చి న్యూగినీ సంగతి తప్ప తదితరవాద గ్రస్తవిషయాలపై డచ్చి ప్రతినిధి వర్గానికీ, ఇండొనీషియన్ ప్రతినిధివర్గానికీ సమాధానం కుదిరిందని వార్తలు తెలుపుతున్నాయి. డచ్చి ప్రతినిధివర్గనాయకుడు డా॥ వాన్ రోయన్‌ను ప్రశంసిస్తూ ఒక వార్తాసంస్థ అతనికి ఇండొనీషియన్ ఎగ్రిమెంట్ బాకర్ అని నామకరణం చేసింది కూడా. సమాధానం కుదిరినట్లు ఉభయ ప్రతినిధి వర్గనాయకులూ, ఇండొనీషియా కమిషన్ ప్రకటనలు చేశాయి. జోగ్జకర్తాలో రిపబ్లిక్ ప్రభుత్వాన్ని పునఃస్థాపన చెయ్యడానికి అంగీకరించి డచ్చి ప్రభుత్వం కొన్ని షరతులు తనకు ముఖ్యంగా పొందింది. ఉభయపక్షాలూ యుద్ధం విరమించాలని తమతమ సైన్యాలకు ఆజ్ఞలిస్తారు. రిపబ్లికన్ సైన్యాలు ఆజ్ఞలు పాలించేటట్లు చేసే బాధ్యత డా॥ సొకర్నో ప్రభుత్వం వహిస్తుంది. సంధిస్థాపన అనంతరం, ఇండొనీషియాకు సర్వస్వతంత్ర పరిపాలనా హక్కులనిస్తారు. హాలండ్‌తో సమానప్రతిపత్తితో డచ్చిసామ్రాజ్యంలో సభ్యతకు ఇండొనీషియా అంగీకరిస్తుంది. స్వాతంత్ర్యం ఇవ్వడానికిగాను డచ్చిప్రభుత్వం హేగ్‌లో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ జరుపుతుంది. ఆ సమావేశంలో రిపబ్లికన్లు పాల్గొనాలి. డచ్చివారి ప్రాపుతో అక్కడక్కడ ప్రభుత్వం స్థాపించుకున్న ఫెడరలిస్టులుకూడా హేగ్ సమావేశంలో పాల్గొనవచ్చునని. ఈ షరతులకి ఉభయపక్షాలూ అంగీకరించాయి. [సూర్యం]




బరంపురం రైల్వేస్టేషన్: ఇక్కడ బోర్డుమీద ఇటీవలవరకూ తెలుగులో కూడా పేరురాసి ఉండేది. ఇప్పుడు తీసివేశారు. అటు ఛత్రపురం, ఇటు జగన్నాథపురం స్టేషన్లలో తెలుగు పేర్లుండగా మధ్యనున్న బరంపురంలో తెలుగుపేరు తీసివెయ్యడం వింతగా ఉంది. బరంపురం పాఠశాలల్లో తెలుగున విద్యాబోధన మానివెయ్యడానికి ముందు చేసిన పని ఇది.

ఫోటో — జి. పన్నేశ్వరరావు, బరంపురం.



సోషలిస్టునాయకులు డా. రామమనోహర లోహియా (కుర్చీపై చివరకూర్చున్నవారు) వీరికి రెండుమాసాలు కారాగారశిక్ష విధించబడింది.



"విక్రయపు పన్ను"

ఆర్యా,

మద్రాసు ప్రభుత్వమువారు కొన్ని వస్తువుల పన్ను రేటు హెచ్చు చేయనున్నారని పత్రికలలో తెలియవచ్చినది. యిప్పటికే విక్రయపు పన్ను రేటు హెచ్చు అయివున్నదని అనుకుంటుంటె గా యింకా హెచ్చుచేయ తలచుట మిక్కిలి శోచనీయంగా వున్నది. ప్రజోపయోగమైన దినుసులపై రేటు హెచ్చుచేయుట మరీ వింతగా వుంది. అబ్కారీ తీసివేసినపిమ్మట పెద్దలతోబాటు బీదలుకూడా విస్తారంగా కాఫీ హోటళ్ళకు అలవాటు పడినారు. యిప్పుడు అమ్మకంపన్ను తినుబండారములపై హెచ్చు చేస్తే ఆదరుపన్ను చెల్లించేవారిలో బీదప్రజలు లేకపోలేదు అదిగాక తినుటకు బియ్యం చాలినంత సరుకు దొరకనందున కొంతమంది బీద ప్రజలు కాఫీహోటళ్ళలో ఫలహారములు గావించి కాలక్షేపము చేస్తూవున్న సంగతి అందరికీ విదితమే. యిట్టి తరి ప్రభుత్వము పన్నులు హెచ్చించిన ప్రజానురాగము కోల్పోవుట తప్పదు. యీ విషయములు ప్రభుత్వమువారు గుర్తించెదరని నమ్ముచున్నాము.

వెత్సా వెంకటరాజు,
సాలూరు.
(సాలూరు వర్తక బృందం తరఫున)

"అల్యూమినియం పాత్రలు"

ఆర్యా,

కొలదికాలమూగా మన దేశమున అల్యూమినపు పాత్రల వాడుక యధికమైనది. అవి చౌకగా లభించుచు బీదసాదల కందరకు అందుబాటువం దుండుటయే గాక తేలికగా నుండి త్వరలో వేడి యెక్కుగుణము కల్గియుండుట తథ్యము.

కాని, వానివలన బడయు లాభములకన్న నష్టములే ఎక్కువ యని అనుభవజ్ఞులనుండి వినికిడి. అల్యూమినం అజీర్ణము, మలబద్ధకము, నరముల బలహీనత, శరీరమంతయు తిమ్మిరులతో స్పర్శజ్ఞానము నశించుట, పైత్యోద్రేకము, వాంతులు, ఇత్యాది రోగములకు హేతువగుచు అపాయకారి యగుచున్నదని తెలియుచున్నది.

కాన ప్రభుత్వము ఇందలి సత్యాన్వేషణకై పరిశోధనలు కల్పి తక్షణచర్యల గైకొన ప్రార్థన.

టి. యల్. నారాయణ,
చివ్వలూరు

పబ్లిక్‌సర్వీస్ కమిషన్, వయఃపరిమితి

అయ్యా,

10-5-49 వ తేదిన మద్రాసు పబ్లిక్ సర్వీసు కమీషన్‌వారుకో-ఆపరేటివ్ జూనియర్ ఇన్‌స్పెక్టర్లను, అసిస్టెంటు కమర్షియల్ టాక్సు ఆఫీసర్లు వగైరాలను రిక్రూట్ చేసుకొందుమని ప్రచురించిరి.

కో ఆపరేటివ్ జూనియర్ ఇనస్పెక్టర్ల విషయమైన ప్రచురణలో యస్. యస్. యల్. సి. పరీక్ష ప్యాసయి 1934 వ సం॥ రంకు పూర్వము కో ఆపరేటివ్ ట్రైనింగ్ అయి పరీక్షలలో ప్యాసయి, కనీసము 5 సం॥ ములు కో ఆపరేటివ్ సూపర్వైజరు సర్వీసు కలిగినవారికి *Preference* యితుమని, శ్రేష్ఠులుగా పరిగణించి యెన్నుకొందుమని వివరించిరి. కాని వీరికి కూడ 30 సంవత్సరాల లోపు వయసు వుండవలెనని నిర్ణయించిరి ఇట్టి అభ్యర్థుల కీ వయోనిర్ణయ మసంబద్ధముగా నున్నది.

నేను నా 18 వ వత్సరములో *S. S. L. C.* పరీక్ష ప్యాసయితిని. ఆంధ్రసహకారశిక్షణాలయము బెజవాడలో 1931-32 సం॥ రం లో కో ఆపరేటివ్ ట్రైనింగ్ అయి సనరు పరీక్షలన్నింటిలో ఉత్తీర్ణుడనయితిని. అప్పటినుండియును సహకారసంస్థలలోనే పనిచేయుచు సూపర్వైజరుగా 7 సం॥ లకు పైనను, 1 సం॥ 2 నెలలు జూనియర్ ఇన్‌స్పెక్టరుగాను నా విధులను నేను సక్రమముగా నిర్వర్తించితిని. ఇప్పుడు నాకు వయస్సు 35సంవత్సరాల 8 నెలలు.

1934 వ సం॥ రంకు పూర్వము సంవత్సరంలు 1930-31 గడచి యిప్పటికి 19, 18 సంవత్సరములయినది. అభ్యర్థి *S S. L C.* ప్యాసగునప్పటి వయస్సు 18 గా నున్నయెడల 1930 వ సంవత్సరమునుండి జరిగిన కాలపరిమితి 19 సం॥ రంలు కలపగా 37 సంవత్సరము లగును. అనగా 1934 వ సం॥ రం కు పూర్వము సహకారశిక్షణ పొందిన వ్యక్తులను యెన్నుకొనవలయునన్న వారివయస్సు కనీసము 37, 38 సంవత్సరములలోపు వున్నను జూనియర్ ఇన్‌స్పెక్టరుగా సెలక్టు అగుటకు అర్హులగుదురని ప్రచురించిన సముచితముగా నుండెడిది.

1934 వ సంవత్సరంకు పూర్వము శిక్షణ పొందినవారికి *Preference* యిత్తురను నిర్ణయమున్నది. గదాయని యీ *Selection* కు చెల్లించవలసిన ముడుపు 15 రూప్యములు చెల్లించి దరఖాస్తు పంపుకొన్నవయస్సు మీరినదని వారి రూకలను వాపసుచేయకయే దరఖాస్తులను త్రోసివేయుదురు.

ఒకానొకప్పుడు పుత్రశతము ప్రసాదించుమి యిచ్చినవరమును సార్థకముచేయుటకొఱకు మహాపతివ్రతకు పతిప్రాణములనుకూడ ప్రసాదించిన మహిషవాహనుడగు ప్రేతపతివలె ఇందుకు కారణభూతులు పరస్పరవిరుద్ధములగు యిట్టి ఉత్తర్వులను అనుకూలముగా సవరణచేసి జారీ చేయుదురని ప్రార్థన.

పై ఉత్తర్వులవలన నష్టపడు
అభ్యర్థి.

నీరాపై నిషేధమును తొలగించరాదు

ఆర్యా,

మద్యపాననిషేధము అమలునందున్న ప్రాంతాలలో పచ్చికల్లు తీయడానికి, దానిని పులవబెట్టకుండా అమ్ముకొనడానికి అనుమతి నిస్తూ భారత ప్రభుత్వ వ్యవసాయశాఖవారు కావించిన అధికార ప్రకటన పత్రికలలో ప్రచురింపబడింది. ఆ ప్రకటనలో పచ్చికల్లులో మత్తుపదార్థము లేదనీ, దానిలో పంచదార విశేషంగా వుందనీ, పులవబెట్టినప్పుడే అది కల్లుగా మారుతుందనీ వున్నది. ఈమాటల్లు నిజము కాదని ఎవ్వరూ అనరు. అయితే ఆ పచ్చికల్లు (దీనిని 'నీరా' అని అందురు) సూర్యరశ్మి సోకినేగాని, సీసా లేక ఇతర పాత్రలలో పోసి దానికి చలనము కలిగించితేగాని, యివన్నీ లేకపోయినా ఉదయం, 10 గంటలవరకును ఉంచితేగానీ, సృష్టి తలక్రిందులయినాసరే అది కల్లుగా మారక తప్పదు. ఇవిగాక ఆ పచ్చికల్లును చెట్టునుండి తీయునప్పుడు ప్రతిరోజూ క్రొత్తకడవను కట్టవలయుననీ, లేకపోతే అందులోని వాసనకు జిగురువంటి ఒక పదార్థము వుండుటవల్ల దానివలన అది వెనువెంటనే కల్లుగా మారక తప్పదనీ అనుభవజ్ఞులు చెప్పుదురు. ఒకవేళ యిన్నిచేసి అమ్మించినా, కొనుగోలుదారులు దానిని ఇండ్లకు తీసుకొనిపోయి సాయంత్రం కల్లుగా మారినతర్వాత హాయిగా త్రాగవచ్చును. దీనిని అరికట్టుటకు బ్రహ్మకయినా తరము కాదు. కావున ఇన్నివిధముల మానవున కాచరణసాధ్యంగాని పనులు చేసియు, నిష్ఫలతను పొందుటకంటె యథేచ్ఛగా మద్యమును అమ్ముటకు ఉత్తరు విచ్చుట మేలు కాదా? ఇందువల్ల మనకు ద్రవ్యముకూడ సమకూరునే! ఇదంతేయు వేరుమాటలలో కల్లు విక్రయించుటకు ఒప్పుకొనుటగాక మరేమున్నది? దీనికేనా మన మిన్నాళ్లు మహాత్మునికి అత్యంత ప్రియతమమయిన 'మద్యపాన నిషేధమును' గూర్చి పలవించినది! ఇంతకూ ఇప్పుడు మునిగిపోయిన దేమున్నది? గ్రామాలలో దొంగసారాయి ప్రబలుచున్నదనియా? అయితే చట్టమునందును, ముఖ్యముగా విశ్వాసఘాతకులయిన ప్రభుత్వోద్యోగుల యందునూ ఈ లోప మున్నది. ఏదో యింత త్రాగినవానిని పట్టి శిక్షించుచున్నామేగాని అసలు తయారు చేయువారిని శిక్షించుటకు నేటి చట్టమునం దవకాశము లేదు గదా? లేనిచో ఆ అవకాశమును చట్టములో కలిగించి దానిని తీవ్రతరముగా యేల మార్చరాదు? పైగా నేడు దొంగ సారాయి యెవనో డబ్బున్నవారు ధైర్యవంతులకు, అదీ పురుషులకు మాత్రమే లభ్యమగుచున్నది. స్త్రీలకు లేదనియే చెప్పవచ్చును. పైగా నూతనముగా త్రాగుబోతులుతయారగుట కవకాశములేదుగదా? ఇంక యేకొంతెనో దొంగసారాయి వున్నచో చట్టము తీవ్రముగా చేసినచో యిదెంత? క్రమక్రమముగా యిదియు పోవును. ఈ మాత్రమునకేనా మన మింత స్వర్ణస్వప్నములు కన్నది? ఇది మన భారతజాతినైతిక పతనమునకు, తద్వారా బానిసత్వసహనమునకునూ, విశేషించి ఆర్థికముగా గొడ్డలిపెట్టు వంటి దనికదా మహాత్ముడు కలవరించింది? 'ప్రయత్నాద్యతమానస్తు యోగీ సంశుద్ధకిల్బిషః' (గీత 6-45, అని ప్రయత్నము చేయువాడొకనాటికయినా గమ్యస్థానము పొందునని భగవంతుడే వాక్రువియుండగా, ప్రభుత్వమునకీ నిస్పృహయేల కలిగెనో తెలియరాదు. మొన్ననేకదా మన ప్రభుత్వముద్రికయందు 'సత్యమేవ జయతే' అను ఉపనిషద్వాక్యము చేర్చితిమి. అయినప్పుడు సత్యమయిన ఈ కార్యమును సాధించుటలో ప్రయత్నమునందే ఈ నిస్పృహ తగునా? మన భారతజాతి కెంత కళంకము! మహాత్ముని ఆత్మశాంతి యెట్లుకలుగు? కావున భారతప్రభుత్వమీ విషయమును లన్నింటిని, పూర్వాపరములను యోచించి, మొన్నచేసిన ప్రకటనను ఉపసంహరించుకొని మద్య నిషేధమును అమలుపరుచుచున్న రాష్ట్రప్రభుత్వములకు విశేషముగా గ్రాంటులిచ్చి ప్రోత్సహించుమని ప్రార్థించుచున్నాను.

బంకా చిన్నరామప్ప,
ప్రధానకార్యదర్శి, పట్టణసోషలిస్టుపార్టీ.

మచిలీపట్నంనుంచి గంటకల్ వరకు ఎక్స్‌ప్రెస్ ట్రెయిను

ఆర్యా!

మచిలీపట్నంనుంచి గుంటకల్ వరకు పోవు రైలుమార్గం 329 మైళ్లు నిడివి గలదై, మైల్ లైనులో వున్నప్పటికీ కూడా, యెక్స్‌ప్రెస్ ట్రైన్ లేకపోవుటవల్ల దూరపుప్రయాణికులు చాలా యిబ్బందిపడుచుండుట అందరు యెరిగినదే. కాని యిట్టి యిబ్బంది తీర్చుటకు రైల్వేవారుగాని గవర్నమెంటువారుగాని పూనుకోనందుకు చాలా విచారపడవలసియున్నది. మనశాసనసభ్యులుకూడా యిట్టి ముఖ్యమైన పనులను అశ్రద్ధగ చూచుట మనము గమనించవలసియున్నది. యిందునుగురించి ప్రజలు ఆందోళనచేసి గవర్నమెంటువారిని కోరవలసియున్నది. వెంటనే గవర్నమెంటువారు కూడా యెక్స్‌ప్రెస్ ట్రైన్ వేయుదురని నమ్ముచున్నాను.

పోతుకూచి సుబ్రహ్మణ్యాం,
విజయవాడ.

దేవదాసి చట్టము భోగము మేళములు

అయ్యా,

కళావంతుల సంస్కరణ సభ యొక్క ముప్పదేండ్ల కృషి ఫలితంగా ఆంధ్ర దేశమునందుగల భోగము సాని వగయిరా కులములలోని వ్యభిచార దురాచారములు చాల వరకు నిర్మూలింపబడి, ఆ సంఘీయులు నలుగురిలో ఆత్మ గౌరవముతో తలయెత్తి తిరుగుటకు అవకాశము లభించింది. శేషించిన దురలవాటులను పూర్తిగా తుడిచి పెట్టుటకు శాసన సహాయ మవసరమగుటచే సంస్కరణ సభ ఆందోళన, బహుజనాభిప్రాయము ననుసరించి, మదరాసు ప్రభుత్వము తమ దేవదాసి చట్టములో, వ్యభిచార వృత్తికి దోహదమొసగుచున్న భోగము మేళములను 3 వ సెక్షనులో 2 క్లాజు ప్రకారము నిషేధించుచు, భోగము సాని, నాగవాసులు కూర్మాపులు మొదలగు వారిలో నెవ్వరైనను మేళములలో పాల్గొన్నచో 6 నెలలవరకు శిక్ష, రు 500/ల జుల్మానాకు పాత్రులగుదురని శాసించియున్నారు.

అనేకమంది సంఘీయులు మా ప్రచారము వల్లనేమి, పై శాసనము వల్లనేమి మేళములను పూర్తిగా మానివేసి, తమ బాలికలకు వివాహములు జరుపుచున్నారు. ఇంకను కొందరు దురోభలపలన శాసనమును ధిక్కరించి, మేళములకు పోవుచుండుటచే తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలలో దేవదాసి చట్ట ప్రకారము కొంతమందిపై చర్య తీసుకొబడినది. కాని అన్ని కేసులు, యిట్టి మేళములకు చట్టము వర్తింపదను నెపముపై, కొట్టివేయబడుచున్నవి. దీని ఫలితముగా మరింత విచ్చలవిడిగా యీ కులముల వారు మేళములకు పోవుట తటస్థమగుచున్నది.

ఈ మేళములవలన కలుగు దుర్నీతి అందరకు తెలిసినదే. చిన్నబాలికలు లేనిదే మేళము ఆకర్షణీయము కాదు. అందుచే పెద్దసానులు చిన్న పిల్లలను తయారుచేసి మేళములకు తీసికొని పోవుదురు. వీరు పెద్దవారు కాగానే తిరిగి చిన్న పిల్లలు మేళములకు అవసరమగుచుందురు. వీరంవరు అవివాహితలై, వ్యభిచార వృత్తివల్లనే జీవించుచుందురు. ఈ మేళములు వీరి వృత్తికి ప్రకటనగా ఉపకరించి, అనేకులను పెడ మార్గములకు త్రిప్పుచున్నవి. అందుచే భోగము మేళములను పూర్తిగా నిషేధించినగాని యీ దుర్వృత్తి నశించి, యీ కులముల వారు బాగుపడుటకు అవకాశము కనుపించదు.

దేవదాసి చట్టములో ఉన్న లోటును సవరించుటకు శ్రీ తెన్నేటి విశ్వనాథంగారు ఒక సవరణ బిల్లును శాసన సభలో ప్రతిపాదింపనున్నారు. దీనిని శాసనసభ్యులందరును బలపరచి, ఏ దురాచార నిర్మూలనకు గాంధీ మహాత్ముడు, వీరేశలింగం, వెంకటరత్నం నాయుడు, రాష్ట్రపతి డాక్టరు పట్టాభిగార్లు పరితపించినారో, అట్టి మేళములను నిశ్శేషమొనర్చి యీ సంఘీయులను పునీతుల నొనర్చుటకు తోడ్పడెదరు గాక యని ప్రార్థించుచున్నాను.

భా. గోపాలకృష్ణమూర్తి,
కార్యదర్శి,
ఆంధ్రరాష్ట్ర కళావంతుల సంస్కరణసభ,
బందరు.

తెలంగాణా పల్లె ప్రజ

(మా విలేఖరి తీసిన చిత్రాలు)



"ఆ, బొమ్మ తీస్తుండు"



"ఊర్లోకి పెద్దమనుషులొచ్చిండ్రు. ఏం సెప్పుతారో ఇందాం. మరిగింతలో బొమ్మలు దీసేటాయన వచ్చిండ్రు."



"ఈ పోరడు తెగ ధూం (అల్లరి) జేస్తుండు. జర బొమ్మ తీయి దొరా."




"అరె! నా సూటూ, బూటూ, కెమేరా కూడా సూడరె!"




"తమ్ముడా లచ్మన్న సీతమ్మ ఏదిరా-తందానా తాని తంద "నానా."

విదేశాలలో విశేషాలు



తయారీవంతెన: ముందే తయారుచేసి ఉంచిన వంతెనల్ని తీసుకుపోయి చిన్న చిన్న కాలువలు, ఏరులు దాటడానికి వీలైన సదుపాయాన్ని బ్రిటిష్ సైనిక శిక్షణాలయంలో ప్రదర్శిస్తున్నారు. 30 అడుగుల వెడల్పుగల కాలువలపైన వీటిని వేసి, వీనిపై బరువైన చర్చిల్ టాంకుల్ని కూడా నడుపవచ్చును.



అన్నివిధాలా మామూలు కారుగాని వాలిన పిల్లల బొమ్మ కారు. ఇది లండన్‌లోని ఒక ఆటబొమ్మల పరిశ్రమలో తయారు చెయ్యబడింది.



393 మైళ్లు ఎక్కడా ఆగకుండా ప్రయాణించే "ది కాపిటల్స్ లిమిటెడ్" అనే పేరుగల ఎక్స్‌ప్రెస్. లండన్‌లో ఈ కొత్త రైలుకి సినీమాతార ఆన్ క్రాఫర్డు పై నామకరణం చేసింది.

Regd. No. M. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St., G. T. Madras 1.